## రష్యా-ఇరాన్ చమురు కొనుగోలుదారులపై అమెరికా ఆంక్షలు

వాషింగ్టన్ : రష్యా, ఇరాన్ దేశాల నుంచి చమురును అధిక పరిమాణం లో కొనుగోలు చేసే దేశాలపై ఆంక్షలు విధించేందుకు దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు అధికారాలు కట్టబెట్టే ద్వైపాక్షిక బిల్లును వేగంగా ముందుకు తీసుకుపోవడానికి అమెరికా సెనెట్ అంగీకారం తెలిపింది. దీనికి అనుకూలంగా 86 ఓట్లు పడగా కేవలం 12 మంది మాత్రమే వ్యతిరేకించారు. సెనెట్ నిర్ణయం భారత్, చైనా వంటి ప్రధాన చమురు కొనుగోలుదారులపై ప్రభావం చూపే అవకాశం ఉంది. వంద మంది సభ్యులున్న సెనెట్‌లో ఈ బిల్లు తేలికగానే ఆమోదం పొందుతుందని భావిస్తున్నారు.


RNI NO.APTEL/2006/18110

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....

# ప్రజాగళం

తెలుగు దినపత్రిక

నిజామాబాద్ | సంపుటి : 20 | సంచిక : 256 | పబ్లిషర్ : కొక్కు రవికుమార్ | గురువారం 30 - 7 - 2026 | పేజీలు : 8 | వెల : రూ. 1 - 00


## మన్మోహన్ సింగ్‌కు సుప్రీంకోర్టు క్లీన్ చిట్

న్యూఢిల్లీ: బొగ్గు బ్లాకుల కేటాయింపు కేసులో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌పై ఉన్న క్రిమినల్ విచారణను ఆయన మరణించిన రెండేండ్ల తర్వాత సుప్రీంకోర్టు బుధవారం మూసివేసింది. దర్యాప్తు సంస్థ ముగింపు నివేదికలను తిరస్కరించి విచారణకు హాజరు కావాలని ఆయనకు సమన్లు జారీచేసిన 2015 నాటి ప్రత్యేక సీబీఐ కోర్టు ఉత్తర్వును సుప్రీంకోర్టు తోసిపుచ్చింది.
మన్మోహన్ సింగ్ అప్పీల్‌ను అనుమతిస్తూ సీబీఐ నిర్ధారణలను తిరస్కరించడానికి లేదా ఆయనకు వ్యతిరేకంగా చర్యలు తీసుకోవడానికి బలమైన కారణాలు ఏవీ లేవని కోర్టు పేర్కొంది. ఈ కేసు యూపీఏ ప్రభుత్వ హయాంలో తలబీర-2 బొగ్గు బ్లాక్ కేటాయింపునకు సంబంధించినది.

### రాహుల్ గాంధీ కుటుంబానికి బాబ్రీ మసీదుకు పట్టిన గతే..

## బీజేపీ ఎమ్మెల్యే వివాదాస్పద వ్యాఖ్యలు!



**కర్ణాటక ఎమ్మెల్యే యశ్‌పాల్ సువర్ణపై ఎఫ్ఐఆర్ నమోదు**
**బాబ్రీ మసీదు ఘటనను ప్రస్తావిస్తూ విమర్శలు**
**కాంగ్రెస్ ఫిర్యాదుతో కేసు నమోదు**
**వ్యాఖ్యలపై రాజకీయ దుమారం**
**కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ డిమాండ్...**

**న్యూఢిల్లీ,జూలై,29:**
లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కుటుంబంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యే యశ్‌పాల్ సువర్ణపై పోలీసులు కేసు నమోదు చేశారు. 1992లో బాబ్రీ మసీదు కూల్చివేసిన ఘటనను ప్రస్తావిస్తూ, కాంగ్రెస్ ఇదే తరహా రాజకీయాలు కొనసాగిస్తే రాహుల్ గాంధీ కుటుంబానికీ అదే పరిస్థితి వస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపాయి. సామాజిక మాధ్యమాల్లో ప్రసంగం వీడియో వైరల్ కావడంతో కాంగ్రెస్ తీవ్రంగా స్పందించింది. ఉడుపిలో నిర్వహించిన బీజేపీ కార్యక్రమంలో యశ్‌పాల్ సువర్ణ ఈ వ్యాఖ్యలు చేశారు. దీనిపై ఉడుపి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు అశోక్ కుమార్ కొడవూర్ ఫిర్యాదు చేయడంతో ఎఫ్ఐఆర్ నమోదైంది. భారతీయ న్యాయ సంహితలోని పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.
విద్వేషాన్ని రెచ్చగొట్టేలా, బెదిరింపులకు పాల్పడేలా ఎమ్మెల్యే మాట్లాడారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై కర్ణాటక కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మంజునాథ్ భండారి తీవ్రంగా స్పందించారు. రాజ్యాంగాన్ని పరిరక్షిస్తానని ప్రమాణం చేసిన ప్రజాప్రతినిధి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. నీట్ ప్రశ్నపత్రం లీక్ వివాదం, దేశవ్యాప్త నిరసనల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే రాహుల్ గాంధీపై బీజేపీ వ్యక్తిగత విమర్శలకు దిగుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో ఉన్న ఇతర బీజేపీ ప్రజాప్రతినిధులు కూడా ఈ వ్యాఖ్యలను ఖండించకపోవడం ఆందోళనకరమని అన్నారు.

### ఉద్యమాలు చేయాలనుకునే ఏ విద్యార్థైనా

## పోలీసులను ఎదుర్కోవాల్సిందే: నడ్డా

**రాజ్యసభలో ఢిల్లీ పోలీసుల చర్యలపై దుమారం**
**ఐషే ఘోష్ ఘటనను ప్రస్తావించిన ప్రతిపక్షం**
**'విద్యార్థి ఉద్యమకారులు పోలీసులను ఎదుర్కోవాల్సిందే' అన్న నడ్డా**
**ఎమర్జెన్సీలో తాను కూడా అరెస్టయ్యానన్న కేంద్ర మంత్రి - పోలీసులపై చర్యలు కోరిన ఖర్గే**



**న్యూఢిల్లీ,జూలై,29:**
రాజ్యసభలో బుధవారం ఢిల్లీ పోలీసుల చర్యలపై అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఢిల్లీలోని సీపీఎం కేంద్ర కార్యాలయంలోకి పోలీసులు వెళ్లి మాజీ జేఎన్‌యూ విద్యార్థి సంఘం అధ్యక్షురాలు ఐషే ఘోష్‌ను అరెస్టు చేసేందుకు ప్రయత్నించిన ఘటనను ప్రతిపక్ష సభ్యులు ప్రస్తావించారు. ఈ సందర్భంగా సభలో ఆందోళన, నినాదాలు కొనసాగాయి. దీనిపై స్పందించిన రాజ్యసభ సభానేత, కేంద్ర మంత్రి జేపీ నడ్డా చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. "ఉద్యమాలు చేయాలనుకునే ఏవిద్యార్థైనా పోలీసులను ఎదుర్కోవాల్సిందే" అని అన్నారు.సీపీఎం సభ్యుడుజాన్ బ్రిట్టాస్ ఈ అంశాన్ని సభ దృష్టికి తీసుకొచ్చారు. జంతర్‌మంతర్‌లో జరిగిన విద్యార్థుల నిరసనలో పాల్గొన డమే ఐషే ఘోష్ చేసిన తప్పని పేర్కొన్నారు. 2020-21 కేసులను చూపిస్తూ పోలీసులు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండానే జాతీయ రాజకీయ పార్టీ కార్యాలయంలోకి వెళ్లడం ఆందోళన కలిగించే విషయమని అన్నారు. ఈ ఘటనపై కేంద్ర హోంమంత్రి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే కూడా దీన్ని ఖండిస్తూ, పార్టీ కార్యాలయంలోకి వెళ్లి నాయకురాలిని అరెస్టు చేయడానికి ప్రయత్నిం చడం సిగ్గుచేటని అన్నారు. సంబంధిత పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతిపక్ష సభ్యుల విమర్శల కు సమాధానంగా జేపీ నడ్డా మాట్లాడుతూ, తాను కూడా ఒకప్పుడు విద్యార్థి నాయ కుడినేనని గుర్తుచేశారు. ఎమర్జెన్సీ కాలంలో పలుమార్లు అరెస్టయ్యానని చెప్పారు. చట్టాన్ని అమలు చేయడం పోలీసుల బాధ్యతని పేర్కొన్నారు. ఉద్యమాల్లో పాల్గొనాలనుకునే విద్యార్థులు పోలీసు చర్యలను కూడా ఎదుర్కోవాల్సి ఉంటుందని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలతో ప్రతిపక్ష సభ్యులు మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలో నినాదాలు కొనసాగడంతో గందరగోళం నెలకొంది.

### పీఓకేలో రక్తపాతం.. పాక్ బలగాల దాడిలో 40 మంది మృతి

## పీఓకేలో పాక్ సైన్యం దమనకాండ

**గత రెండు రోజుల్లో 40 మంది పౌరులు మృతి**
**ఇది మారణకాండ అంటున్న స్థానిక నేతలు**
**100 మందికి పైగా హతమయ్యారని ఆరోపణ**
**అంతర్జాతీయ సమాజం జోక్యం చేసుకోవాలని డిమాండ్**



పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో పరిస్థితి తీవ్ర ఉద్రిక్తంగా మారింది. అక్కడ నిరసనలు తెలుపుతున్న పౌరులపై పాకిస్థాన్ బలగాలు జరిపిన దమనకాండలో గత రెండు రోజుల్లో కనీసం 40 మంది ప్రాణాలు కోల్పోయారు. డజన్ల కొద్దీ ప్రజలు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రాంతంలో తీవ్ర అశాంతి నెలకొన్న నేపథ్యంలో పాక్ సైన్యం విచక్షణారహితంగా వ్యవహరిస్తోందని స్థానిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. 'యునైటెడ్ కశ్మీర్ పీపుల్స్ నేషనల్ పార్టీ' (యూకేపీఎన్‌పీ) ఈ ఘటనలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నెల 27, 28 తేదీల్లో రావల్‌కోట్, మీర్పూర్ సహా పలు ప్రాంతాల్లో పాక్ బలగాలు జరిపిన దాడుల్లో 40 మంది పౌరులు మరణించారని, వందలాది మందిని అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపించింది. అంతేకాకుండా జూన్ 5 నుంచి ఇప్పటివరకు 100 మందికి పైగా పౌరులను పాక్ సైన్యం చంపేసిందని, వందల మందిని బలవంతంగా అదృశ్యం చేసిందని పేర్కొంది. ఇదిలా ఉండగా, జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ) నేత సర్దార్ అమ్మాన్ ఖాన్ కూడా పాక్ సైన్యంపై విరుచుకుపడ్డారు.
ఇది నిరాయుధులైన పౌరులపై జరిగిన 'మారణకాండ' అని ఆయన అభివర్ణించారు. "కేవలం రెండు రోజుల్లోనే పాక్ బలగాలు 38 మంది శాంతియుత నిరసనకారులను అత్యంత కిరాతకంగా చంపేశాయి" అని ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. పీఓకేలో కొనసాగుతున్న ఈ నిరసనలు, ఇస్లామాబాద్ నియంత్రణకు ప్రత్యక్ష సవాలుగా మారాయి. ఈఘటనలపై ఐక్యరాజ్యసమితి, యూరోపియన్ యూనియన్ తక్షణమే స్పందించి, స్వతంత్ర దర్యాప్తునకు ఆదేశించాలని, పౌరులను రక్షించాలని యూకేపీఎన్‌పీ డిమాండ్ చేసింది. ప్రస్తుతంపీఓకేలోని చాలా ప్రాంతాల్లో కమ్యూనికేషన్ వ్యవస్థలను పూర్తిగా నిలిపివేసి, కర్ఫ్యూ వాతావరణం విధించారు.

## ఒక అధికారికి ఒకే ప్రభుత్వ వాహనం.. కేంద్రం కొత్త ఆదేశాలు



**హైదరాబాద్,జూలై,29:**
ప్రభుత్వ వనరుల దుర్వినియోగం, వృథా ఖర్చులకు కళ్లెం వేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై అర్హులైన ఒక అధికారికి ఒకే ప్రభుత్వ వాహనాన్ని కేటాయించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని వ్యయ విభాగం 'ఒక అధికారికి-ఒకే కారు' విధానాన్ని అమల్లోకి తెస్తూ అధికారిక మెమొరాండం జారీ చేసింది. ప్రభుత్వ వాహనాలను కేవలం అధికారిక ప్రయోజనాల కోసమే వినియోగించేలా చూడటమే ఈ చర్య ముఖ్య ఉద్దేశం. కొత్త నిబంధనల ప్రకారం, ఇప్పటికే ప్రభుత్వ వాహన సదుపాయం పొందుతున్న అధికారికి.. వేరే మంత్రిత్వ శాఖ, ప్రభుత్వ రంగ సంస్థ లేదా ఇతర స్వయంప్రతిపత్తి సంస్థల్లో అదనపు బాధ్యతలు అప్పగించినప్పటికీ, రెండో వాహనాన్ని కేటాయించకూడదని స్పష్టం చేసింది. సదరు అధికారి తన వద్ద ఉన్న వాహనాన్నే ఆ అదనపు బాధ్యతల నిర్వర్తణకు కూడా ఉపయోగించుకోవాలని ఆదేశాల్లో పేర్కొంది. ఈ విషయంలో ఎలాంటి మినహాయింపులు ఇవ్వొద్దని అన్ని మంత్రిత్వ శాఖలు, విభాగాలను ఆదేశించింది. కేవలం వాహనాల సంఖ్యకే ఈ నిబంధనలు పరిమితం కాలేదు. ప్రభుత్వ రంగ సంస్థలు, స్వయంప్రతిపత్తి లేదా పాక్షిక-ప్రభుత్వ సంస్థలకు చెందిన వాహనాలను కేంద్ర ప్రభుత్వ అధికారులు వినియోగించడాన్ని కూడా నిషేధించింది. అయితే, అధీకృత అధికారిక పర్యటనలు లేదా విధుల్లో భాగంగా ప్రయాణించేటప్పుడు మాత్రం మినహాయింపు ఇచ్చింది. ఈ చర్యల ప్రధాన ఉద్దేశం పరిపాలనా సామర్థ్యాన్ని పెంచడం, వనరుల దుర్వినియోగాన్ని అరికట్టడం, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణను మెరుగుపరచడమని ప్రభుత్వం తెలిపింది. వినియోగంలో లేని లేదా మిగులుగా ఉన్న వాహనాలను అనధికారిక పనులకు వాడకుండా వాటిని సురక్షితంగా భద్రపరచాలని కూడా శాఖలకు సూచించింది. పన్ను చెల్లింపుదారుల సొమ్మును బాధ్యతాయుతంగా ఖర్చు చేయడమే తమ లక్ష్యమని పేర్కొంది. 2022 సెప్టెంబర్‌లో ప్రభుత్వ వాహనాల వినియోగంపై జారీ చేసిన సమగ్ర మార్గదర్శకాలకు అనుబంధంగా ఈ తాజా ఆదేశాలు వచ్చాయి. ఆర్థిక క్రమశిక్షణను బలోపేతం చేయడంలో భాగంగా ఈ సవరించిన నిబంధనలను కఠినంగా పాటించాలని అన్ని కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, విభాగాలను వ్యయ విభాగం ఆదేశించింది.

### తెలంగాణలోని బొగత జలపాతం ఉగ్రరూపం..

## సందర్శన నిలిపివేత

**వాయుగుండం ప్రభావంతో ఉత్తర తెలంగాణలో భారీ వర్షాలు - ఉధృతంగా ప్రవహిస్తున్న బొగత జలపాతం - పర్యాటకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని చర్యలు చేపట్టిన అధికారులు**



**ములుగు,జూలై,29:**
వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో తెలంగాణలోని ఉత్తర జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో ములుగు జిల్లావ్యాప్తంగా కురుస్తున్న కుండపోత వర్షాలకు ప్రసిద్ధ పర్యాటక ప్రాంతమైన బొగత జలపాతం ఉధృతంగా ప్రవహిస్తోంది. గత 10 గంటలుగా అటవీ ప్రాంతంలో వర్షం నిరంతరాయంగా కురుస్తుండటంతో ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరి జలపాతం ఉగ్రరూపం దాల్చింది.
ఈ పరిస్థితుల నేపథ్యంలో, పర్యాటకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అటవీ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లి వద్ద ఉన్న బొగత జలపాతం సందర్శనను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. వరద ఉధృతికి రాళ్లు జారే ప్రమాదం ఉండటంతో పాటు ప్రవాహం ఒక్కసారిగా పెరిగే అవకాశమున్నందున పర్యాటకులు ఎవరూ జలపాతం వైపు రావొద్దని అధికారులు విజ్ఞప్తి చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జలపాత పరిసర ప్రాంతాల్లో భద్రతను పెంచినట్లు తెలిపారు.

## తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ.. నిండిన క్యూ కాంప్లెక్సులు

**టోకెన్లు లేకుండా వచ్చిన వారికి సర్వదర్శనానికి 18 గంటల సమయం - నిండిపోయిన 31 కంపార్ట్‌మెంట్లు**

**తిరుమల,జూలై,29:**
తిరుమల గిరులు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. శ్రీవారి దర్శనానికి భక్తుల రద్దీ కొనసాగుతోంది. టోకెన్లు లేని భక్తులకు సర్వదర్శనానికి సుమారు 18 గంటల సమయం పడుతోందని అధికారులు తెలిపారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌ల్లోని 31 కంపార్ట్‌మెంట్లు భక్తులతో పూర్తిగా నిండిపోయాయి. ఇక మంగళవారం (జులై 28) ఒక్కరోజే 78,709 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 31,312 మంది తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 4.76 కోట్లుగా నమోదైంది.



### ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డికి 14 రోజుల రిమాండ్..

## చంచల్‌గూడ జైలుకు తరలింపు

**ట్రైనీ ఐపీఎస్ అధికారిణిపై లైంగిక వేధింపుల కేసు**
**ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణ రెడ్డికి ఆగస్టు 11 వరకు రిమాండ్**
**చంచల్‌గూడ జైలుకు తరలించిన పోలీసులు**
**తమది ఇద్దరి అంగీకారంతో కూడిన సంబంధమని నిందితుడి వాదన**



**హైదరాబాద్,జూలై,29:**
ట్రైనీ ఐపీఎస్ అధికారిణిపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో అరెస్టయిన ట్రైనీ ఐపీఎస్ ఎం. ఉదయ్ కృష్ణారెడ్డికి న్యాయస్థానం 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. మంగళవారం అరెస్టయిన ఆయన్ను పోలీసులు బుధవారం ఉప్పర్‌పల్లి కోర్టులో హాజరుపరిచారు. విచారణ జరిపిన న్యాయమూర్తి, ఆగస్టు 11 వరకు రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఉదయ్‌ను చంచల్‌గూడ సెంట్రల్ జైలుకు తరలించారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీలో తనతో పాటు శిక్షణ పొందుతున్న 30ఏళ్ల మహిళా అధికారిణిని లైంగికంగా వేధించాడని ఉదయ్‌పై తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. పదే పదే లైంగిక వేధింపులకు గురిచేయడం, వాట్సాప్‌లో అసభ్యకర సందేశాలు పంపడం, వెంటపడడడం (స్టాకింగ్), అక్రమంగా నిర్బంధించడం,శారీరకంగా దాడి చేసి బెదిరింపులకు పాల్పడటం వంటివి ఫిర్యాదులో ఉన్నాయి. అంతేకాకుండా, రహస్యంగా ప్రైవేట్ వీడియో తీసి, దానిని ఆమె భర్తకు పంపి బ్లాక్‌మెయిల్ చేశారని బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈనెల 18న బాధితురాలి ఫిర్యాదు మేరకు అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), ఐటీ చట్టంలోని వివిధ సెక్షన్ల కింద లైంగిక వేధింపులు, మహిళ పట్ల నేరపూరిత బలప్రయోగం, గోప్యతకు భంగం కలిగించడం, అశ్లీల సమాచారాన్ని ప్రసారం చేయడం వంటి అభియోగాలతో కేసు నమోదు చేశారు. అరెస్టు అనంతరం పోలీసులు ఉదయ్‌ను అశోక్ నగర్‌లోని ఆయన నివాసానికి తీసుకెళ్లి సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేసినట్లు సమాచారం. మరోవైపు, తనపై వచ్చిన ఆరోపణలన్నీ అవాస్తవమని, న్యాయవ్యవస్థపై తనకు నమ్మకం ఉందని ఉదయ్ కృష్ణారెడ్డి ఇటీవల సోషల్ మీడియా ద్వారా తెలిపారు.
బాధితురాలితో తనకు ఏడాదిగా (2025 జూన్ 2025) సంబంధం ఉందని, ఆమెకు వివాహం జరిగిన తర్వాత కూడా అది కొనసాగిందని ఆయన వాదిస్తున్నారు. తమ సంబంధం ఇద్దరి అంగీకారంతోనే జరిగిందని నిరూపించడానికి తన వద్ద ఫొటోలు, వీడియోల రూపంలో ఆధారాలున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈనెల 21న మోతీనగర్‌లోని బంధువుల ఇంట్లో అపస్మారక స్థితిలో కనిపించడంతో ఆయనను ఆసుపత్రిలో చేర్చారు. ఇది ఆత్మహత్యాయత్నమని ప్రచారం జరిగినా, సానుభూతి కోసమే ఇలా చేసి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యాక ఆయన అదృశ్యమయ్యారని వార్తలు వచ్చాయి. అయితే, తనపై ఆరోపణలు రావడంతో అనారోగ్యం పాలైన నాయనమ్మను చూసేందుకు ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా ఉళ్లపాలెం వెళ్లానని, తాను పారిపోలేదని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్ తిరిగి వస్తుండగా మంగళవారం నాడు పోలీసులు ఆయనను అరెస్టు చేశారు. ఇదిలా ఉండగా, తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ ఉదయ్ కృష్ణారెడ్డి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. అయితే, ఈ కేసులో బాధితురాలికి ఇంకా నోటీసులు జారీ చేయలేదని పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు కోర్టుకు తెలపడంతో, విచారణను హైకోర్టు వాయిదా వేసింది.

# ఎంఎస్సి ఫారంలోని పాఠశాలలో బాల సభ

## విద్య బోధన,భద్రత,హక్కుల గురించి అడిగి తెలుసుకున్న సర్పంచ్ జయశ్రీ శ్రీనివాస్ గౌడ్

### పోటీల్లో ప్రతిభ కనబ ర్చిన విజేతలకు బహుమతులు అందజేసిన సర్పంచ్, కార్యదర్శి.



ఎడపల్లి,జూలై 29: (ప్రజా గళం) ఎడపల్లి మండలం ఎంఎస్ సి ఫారం గ్రామంలోని ప్రభుత్వ ప్రైమరి పాఠశాలలో బుధవారం సర్పంచ్ నోముల జయశ్రీ శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన బాల సభ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విద్యా ర్థులతో బాలల హక్కులు,విద్య,ఆరోగ్యం,పరిశుభ్రత, భద్రత అలాగే వారు ఎదుర్కొంటున్న వివిధ సమస్య లపై చర్చించారు.ఈ సందర్భంగా విద్యార్థులు ఎదు ర్కొంటున్న సమస్యలు వారి అభిప్రాయాలను సర్పంచ్ తెలుసుకున్నారు. అనంతరం"సోక్ పిట్"అంశంపై విద్యా ర్థులకు వ్యాసరచన అలాగే డ్రాయింగ్ పోటీలు నిర్వహించటం జరిగింది అని తెలిపారు.ప్రతిభ కనబ రిచిన విద్యార్థు లకు ప్రథమ,ద్వితీయ,తృతీయ బహుమతులు సర్పంచ్ నోముల జయశ్రీ శ్రీనివాస్ గౌడ్,పంచాయతి కార్యదర్శి జవాజీ రాజు అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి జవాజీ రాజు,స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు నోముల శ్రీనివాస్ గౌడ్,పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శారదా,ఉపాధ్యాయులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.గా మందులు పంపిణి చేసి వైద్యులు తగు జాగ్రత్తలు,సూచనలు చేశారు.ఇందులో 23 మంది కంటి పరీక్షలు చేసుకోగా వారికీ కట్రాక్టు గుర్తించి వారికీ ఉచిత శస్త్ర చికిత్స నిమి త్తం బోధన్ లయన్స్ కంటి హాస్పిటల్ కి రిఫర్ చేయడం జరిగింది అని లయన్స్ క్లబ్ ప్రతినిధులు తెలిపారు.అం తేకాకుండా మంగల్ పాడ్ గ్రామంలో బిల్లా రామ్మోహన్ పుట్టిన రోజు సందర్భంగా లయన్స్ క్లబ్ తరపున పండ్ల పంపిణి కార్యక్రమం నిర్వహించడం జరిగింది అని తెలి పారు.ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ప్రతినిధులు బిల్లా రామ్మోహన్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ చైర్మన్ కె.సూర్యనారాయ ణ,కో –చైర్మన్ చక్రపాణి,లయన్స్ క్లబ్ ఆఫ్ అచన్ పల్లి అధ్యక్షులు దుర్గారావు,కార్యదర్శి రమణ రెడ్డి,కోశాధి కారి కైలాష్,లయన్స్ క్లబ్ ఆఫ్ ఎడపల్లి ప్రెసిడెంట్ ఎన్. రాకేష్ వర్మ,సెక్రటరీ అరుణ్ కుమార్ గౌడ్,క్లబ్ డిసి. గంగారెడ్డి,పుష్పలత,మెర్సీ,ప్రకాష్,మనోజ్ కుమార్, స్థానిక సర్పంచ్ చేపూర్ వీణా శ్రీనివాస్ గౌడ్,బిల్లా రామ్మోహన్ కుమారులు,డాక్టర్.బిల్లా మణి దీప్, యువ నాయకులు బిల్లా మణి తేజ్,డాక్టర్.అరుణ్, అజయ్,కృష్ణ,ల్యాబ్ టెక్నీషియన్ మెహ్రాజ్,వైద్య సిబ్బం ది హనుమంత్ రావు పటేల్,సీమ,సఫురా,రఫీక్,తది తరులు పాల్గొన్నారు.

# ఘనంగా బిల్లా రామ్మోహన్ జన్మదిన వేడుకలు

## లయన్స్ క్లబ్ ఆఫ్ ఎడపల్లి,ఆచన్ పల్లి క్లబ్ వారి సంయుక్త ఆధ్వర్యంలో మంగళ్ పాడ్ లో ఉచిత వైద్య శిబిరం... 152 మందికి ఉచిత వైద్యపరీక్షలు, 23 మందికీ కంటి పరీక్షలు,ఉచిత అవురేషన్ కై బోధన్ కు రిఫర్...

ఎడపల్లి,జూలై 29: (ప్రజా గళం)లయన్స్ క్లబ్ ఆఫ్ ఎడపల్లి అలాగే లయన్స్ క్లబ్ ఆఫ్ ఆచన్ పల్లి వారి సంయుక్త అద్వర్యంలో ఎడపల్లి మండలం మంగళ్ పాడ్ గ్రామంలో లయన్స్ ఐ హాస్పిట ల్ అలాగే లయన్స్ జనరల్ హాస్పిటల్ వారి సహకారం తో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.ఈ కార్యక్రమం లో ఒకే వేదిక పై గ్రామ పంచాయతి వద్ద 6 ప్రోగ్రాం లను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా కంటి పరీక్ష క్యాంపు,డయాబెటిక్ క్యాంపు,బీపీ,షుగర్ టెస్ట్ క్యాంపు,ఉచిత ఇసిజి పరీక్ష, ఉచిత మందుల పంపిణి చేశారు.పెద్దఎత్తున ఈ శిబిరా నికి గ్రామస్తులు విచ్చేసి సంబందించిన వైద్య పరీక్షలు చేయించుకున్నా రు.

ఈ శిబిరంలో 152 మందికి అన్ని రకాల వైద్య పరీక్షలు చేసి వారికీ ఉచితంగా మందులు పంపిణి చేసి వైద్యులు తగు జాగ్రత్తలు,సూచనలు చేశారు.ఇందులో 23 మంది కంటి పరీక్షలు చేసుకోగా వారికీ కట్రాక్టు గుర్తించి వారికీ ఉచిత శస్త్ర చికిత్స నిమి త్తం బోధన్ లయన్స్ కంటి హాస్పిటల్ కి రిఫర్ చేయడం జరిగింది అని లయన్స్ క్లబ్ ప్రతినిధులు తెలిపారు.అం తేకాకుం డా మంగల్ పాడ్ గ్రామంలో బిల్లా రామ్మోహన్ పుట్టిన రోజు సందర్భంగా లయన్స్ క్లబ్ తరపున వైద్య శిబిరం తో పాటు పండ్ల పంపిణి కార్యక్రమం నిర్వహించడం జరిగింది అని తెలిపారు.ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ప్రతినిధులు బిల్లా రామ్మోహన్ కు జన్మదిన శు భాకాంక్ష లు తెలిపారు.బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బిల్లా రామ్మోహన్ పుట్టినరోజు సందర్భంగా తాను జన్మించిన గ్రామంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసినందుకు వైద్యులను స్థానిక సర్పంచ్ చేపూర్ వీణ శ్రీనివాస్ గౌడ్ వారిని శాలువ కప్పి ఘనం గా సన్మానించారు.ఇటువంటి సేవ కార్యక్రమాలు ఇంకా అనేకం ప్రజలకు అందించాలని సర్పంచ్ వీణ శ్రీనివాస్ గౌడ్ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమం లో ఉపసర్పంచ్ బట్టు బాబయ్య,లయన్స్ క్లబ్ చైర్మన్ కె.సూర్యనారాయ ణ,కో–చైర్మన్ చక్రపాణి,లయన్స్ క్లబ్ ఆఫ్ అచన్ పల్లి అధ్యక్షులు దుర్గారావు,కార్యదర్శి రమణ రెడ్డి,కోశాధి కారి కైలాష్,లయన్స్ క్లబ్ ఆఫ్ ఎడపల్లి ప్రెసిడెంట్ ఎన్. రాకేష్ వర్మ,సెక్రటరీ అరుణ్ కుమార్ గౌడ్,క్లబ్ డిసి. గంగారెడ్డి,పుష్పలత,మెర్సీ,ప్రకాష్,మనోజ్ కుమార్, స్థానిక సర్పంచ్ చేపూర్ వీణా శ్రీనివాస్ గౌడ్,బిల్లా రామ్మోహన్ కుమారులు,డాక్టర్.బిల్లా మణి దీప్, యువ నాయకులు బిల్లా మణి తేజ్,అలాగే డాక్టర్. అరుణ్,అజయ్,కృష్ణ,ల్యాబ్ టెక్నీషియన్ మెహ్రాజ్, వైద్య సిబ్బంది హనుమంత్ రావు పటేల్,సీమ,సఫురా, రఫీక్,తదితరులు పాల్గొన్నారు.

# మూడవ శ్రేణి కార్యనిర్వహణాధికరిగా పదోన్నతి పొంది న జాన్కంపేట్ నృసింహ స్వామి ఆలయ జూనియర్ అసిస్టెంట్ రఘునాథ్....

## రాష్ట్ర మంత్రి కొండ సురేఖ చేత పదోన్నతి పత్రాన్ని అందుకున్న రఘునాథ్.... అంద రి ఆశీస్సులు,స్వామి వారి కృపాతో పదోన్నతి....రఘు



ఎడపల్లి,జూలై 29: (ప్రజా గళం)నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం జాన్కంపేట్ గ్రామ శివారులో గుట్టపై వెలసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ లక్ష్మినరసింహాస్వామి దేవస్థానంలో జూనియర్ అసి స్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న కులకర్ణి రఘు నాథ్ కు మూడవ శ్రేణి కార్యనిర్వహణాధికారిగా పదోన్నతి పొందారు.ఈ మేరకు హైదరాబాద్ లో బుధవారం రాష్ట్ర దేవాదాయ ధర్మదాయ శాఖ మంత్రి కొండ సురేఖ చేతుల మీదుగా పదోన్నతి పత్రాన్ని రఘు నాథ్ అందు కున్నారు.ఈ సందర్భంగా కులకర్ణి రఘునాథ్ మాట్లా డుతూ..జాన్కంపేట్ శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవస్థా నంలో 23 సంవత్సరాలుగా జూనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహించానని తెలిపారు.గ్రామస్తుల సహకా రంతో,అధికారుల ఆదేశాలమేరకు,ఆలయ కమిటీ సూచనలు,సలహాలతో విధులు నిర్వహించడం జరిగిం ది అని తెలిపారు.ఆలయ అభివృద్ధికీ దాతల సహకా రంతో తనవంతుగా కృషి చేశానని పేర్కొన్నారు.అందరి ఆశీస్సులు,స్వామి వారి కృపతో తనకు మూడవ శ్రేణి కార్యనిర్వహణ అధికారిగా పదోన్నతి లభించింది అని అన్నారు.తాను విధులు నిర్వర్తించిన కాలంలో ఉద్యోగ ధర్మంలో ఎవరికైనా ఇబ్బందులు కలిగిస్తే తనను క్షమిం చాలని కోరారు.జాన్కంపేట్ నరసింహ స్వామి ఆల యంలో జూనియర్ అసిస్టెంట్ గా పనిచేసిన కాలంలో నా పై గ్రామస్తులు,ఆలయ సిబ్బంది,కమిటీ సభ్యులు ఉంచిన ప్రమాభిమానాలు ఎప్పటికి ఇలాగే ఉండాలని, రఘునాథ్ కోరారు.

# ఎడపల్లి మండల సర్వసభ్య సమావేశంలో

# అధికారు లకు సమస్యల గోడు

## -గ్రామ సమస్యలు పరిష్కరించా లని వినతి

## -సర్వసభ్య సమావేశానికి మొదటిసారిగా సర్పంచ్ లు హాజరు



ఎడపల్లి,జూలై 29: (ప్రజా గళం)ఎడపల్లి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండ లప్రత్యేక అధికారి,డిఆర్డిఓ పిడి.సాయన్న అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిం చారు.నూతనంగా ఎన్నికైన సర్పంచ్ లు మొదటిసారి గా సర్వసభ్య సమావేశానికి హాజరయ్యారు.ఈ సమా వేశానికి గ్రామ పంచాయతీల కార్యదర్శులు,పలు శాఖ ల అధికారులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఇరిగేషన్ అధికారి కుషాల్ మాట్లాడుతూ..ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాభావ పరిస్థితులు నెలకొన్న దృష్ట్యా రిజర్వాయర్ లలో నీళ్లు లేక ఆందోళనకరంగా ఉందని అన్నారు.దీనివల్ల సాగునీటికి ఇబ్బందులు తలెత్తుతా యని,అలీసాగర్ రిజర్వాయర్ లో ఉన్న నీరు కేవలం నిజామాబాద్ పట్టణ ప్రజలకు త్రాగునీటికే సరిపోతా యని పేర్కొన్నారు.ఈ సందర్భంగా రైతులు వరి పంట కు బదులు ఆరుతడి పంటలు వేసుకోవాలని సూచిం చారు.ఎల్ నినో ప్రభావం వలన వర్షాలు సమృద్ధిగా కురిసే అవకాశం లేదని,ఒక వేళ నిజాంసాగర్ కాల్వల ద్వారా నీటిని వదిలితే సాగుకు వాడుకోవాలని తెలిపా రు.అంగన్ వాడీ కేంద్రాల్లో గుడ్లు అందించడం లేదని ఏఆర్పీ క్యాంపు గ్రామ సర్పంచ్ పురముల వినోద్ కు మార్ అధికారులను ప్రశ్నించారు.గుడ్ల ధరలు పెరగ డంతో నిర్వాహకులు నష్టపోతున్నారని దీనివల్ల అందించడం లేదని ఐసిడిస్ మండల సూపర్ వైజర్ సావిత్రి వివరణ ఇచ్చారు.వెటర్నరీ డాక్టర్.ప్రమోద్ రెడ్డి మాట్లాడుతూ..వర్షాభావ పరిస్థితుల్లో పశుగ్రాసంకు కొర త ఏర్పడే అవకాశాలున్నాయని,దీనిని అదిగమించడా నికి పశు గ్రాసం కోసం గడ్డి విత్తనాలు,జొన్న విత్తనాలు పాడి రైతులకు సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు.అలాగే నీటి తొట్టెలను సిద్ధం చేసుకొని ఉంచాలని అయన సర్పంచ్ లకు సూచించారు.జమ లం సర్పంచ్ దొడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ,గ్రామంలో సరైన పశువైద్య శిబిరాలు పెట్టడం లేదని,గ్రామంలో పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పశువులు,మేకలు, గొర్రెలకు చికిత్సలు చేయాలని అన్నారు.గ్రామం లో పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని స్పెషల్ ఆఫీసర్ సాయన్న వెటర్నరీ డాక్టర్ ని ఆదేశించారు. గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువైందని జనాలు ప్రమా దాల భారిన పడుతున్నారని జమలం,ఏఆర్పీ క్యాంప్, ఎడపల్లి,జైతాపూర్ గ్రామాల సర్పంచ్ లు అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు.అయితే కుక్కలను చంపడం చేయకూడదని,వాటికి కుటుంబ నియంత్రణ చేయాలని స్పెషల్ ఆఫీసర్ సూచించారు.వెటర్నరీ ఆసుపత్రి సిబ్బంది ఆధ్వర్యంలో శూనకాలకు కుటుంబ నియం త్రణ ఆపరేషన్లు చేయించడం జరుగుతుందని పేర్కొ న్నారు.గ్రామాల్లో ఐరన్ పోల్స్ వల్ల ఇబ్బందులు కలుగు తున్నాయని,వర్షాకాలంలో ప్రమాదాలు సంభవించే అవకాశాముందని సర్పంచులు సభ దృష్టికి తీసుకురా గా,గ్రామాల వారీగా ఐరన్ పోల్స్ తొలగించి వాటి స్థానా ల్లో సిమెంట్ పోల్స్ వేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ కిషోర్ రెడ్డి తెలిపారు.వర్షాభావ పరిస్థితులు ఎదుర్కొనేందుకు ప్రతీ ఇంటికి ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని ఏపీఓ రాజేందర్ తెలిపారు.ఇండ్లలో ఇంకుడు గుంతలు నిర్మించుకొంటే రూ.6,500 అలాగే కమ్యూనిటీ సోక్ పిట్ లను నిర్మిస్తే 13వేల చొప్పున, పామ్ పాండ్ లను నిర్మిస్తే 80వేల నుండి 4లక్షల వరకు నిధులు మంజూరు అవుతాయాని అన్నారు.అలాగే బోర్ వెల్స్ వద్ద రీఛార్జి గుంతలను నిర్మిస్తే 36వేలు, మేజిక్ డ్రైన్స్ నిర్మిస్తే రూ.లక్ష,రేయిన్ వాటర్ హార్వెస్టిం గ్ కు రూ.25 వేలు ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. అలాగే ఇంచార్జీ ఏఈ ల వల్ల ఇబ్బందులు ఏర్పడుతు న్నాయని,పనులు సరిగ్గా జరగడం లేదని,ఆయా శాఖ లకు పూర్తి స్థాయి బాధ్యతలతో అధికారులను నియ మించాలని జైతపూర్ సర్పంచ్ రాజుగౌడ్ సభ దృష్టికి తీసుకువచ్చారు.ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతా మని పిడి సభ్యులకు తెలిపారు.అలాగే ఎడపల్లి సర్పంచ్ కందగట్ల రాంచందర్ మాట్లాడుతూ..గ్రామం లో కొంతమందికి ఇండ్లు లేకున్నా ఇండ్లు ఉన్నట్లు వచ్చాయని,ఆధార్ లో పేరు ఒకటైతే లిస్టు ఒక పేరు ఉందని,దీనిని సవరించి ఇండ్లు లేని వారికీ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవకాశం కల్పించాలని కోరారు. ఎడపల్లి జడ్పి తెలుగు మీడియం ఉన్నత పాఠశాలలో పిఈటి లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నా యని,పూర్తి స్థాయి పిఈటి నియమించా లని కోరారు. గ్రామంలోని పలు అంగన్ వాడీ కేంద్రాల్లోని పై కప్పులు ఊడి పడే ప్రమాద ముందని వాటి మరమ్మాతు లకు చర్యలు తీసుకోవాలని కోరారు.పాత వెటర్నరీ ఆసుప త్రి కరెంట్ బిల్లులు ప్రస్తుతం వస్తున్నాయ ని వీటిని విద్యుత్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దత్తాత్రి,ఎంపీడీఓ శంకర్, ఎంపీవో మన్మోహన్ శాస్త్రి, ఆయా గ్రామాల సర్పంచు లు,ఆయా శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## నామినేటెడ్ పదవుల పై చిగురిస్తున్న ఆశలు.

# కార్పొరేషన్ చైర్మన్ పదవులు వారికే నా!

### ప్రయత్నాలు ముమ్మరం చేసిన ఆశవావులు.




నిజామాబాద్ జులై 29 (ప్రజాగళం ప్రతినిధి ) అధికార కాంగ్రెస్ పార్టీలో నామినేటెడ్ పదవుల భర్తీపై నాయకుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో సమావేశమైన తెలంగాణ పార్టీ నేతలు మంత్రివర్గ విస్తరణతో పాటు నామినేటెడ్ పదవుల పై నిర్ణయం తీసుకోనున్నారు. బుధవారం ఢిల్లీలో జరుగుతున్న సమావేశంలో పదవులపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే నామినేటెడ్ పదవులపై సీనియర్ కాంగ్రెస్ నాయకులతో పాటు కింది స్థాయి నాయకులు పదవుల కోసం ప్రయత్నాలను ముమ్మరం చేశారు. నిజామాబాద్ ఉమ్మడి జిల్లా నుండి నాలుగు కార్పొరేషన్ చైర్మన్ పదవులు ఖాళీ అయిన విషయం విధితమే. అయితే వారికే పదవులు అప్పగిస్తారా లేక కొత్తవారికి అవకాశం ఇస్తారా అనేదానిపై పార్టీలో ఉత్కంఠత నెలకొంది. కామారెడ్డి జిల్లా నుండి కార్పొరేషన్ పదవిలో ఇప్పటివరకు కొనసాగిన కాసుల బాలరాజ్ తో పాటు, నిజామాబాద్ జిల్లా నుండి ఈరవత్రి అనిల్, మానాల మోహన్ రెడ్డి, అన్వేష్ రెడ్డిల పదవులు ఖాళీ అయిన విషయం తెలిసిందే. మరోసారి హై కమాండ్ తమకు అవకాశం కల్పిస్తుందని సదరు నాయకులు పూర్తి భరోసాతో ఉన్నారు. దీంతో పాటు తమకున్న పరిచయాలతో పైరవీలు సాగిస్తున్నారు. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షునిగా మహేష్ కుమార్ గౌడ్ నిజామాబాద్ జిల్లాకు చెందిన వ్యక్తి కావడంతో ఆయన ద్వారా పదవుల కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. మహేష్ కుమార్ గౌడ్ తో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశీస్సుల కోసం ప్రయత్నాలు సాగుతున్నాయి. నిరంతరం పార్టీ కోసం పని చేసే సీనియర్ నాయకులు ఈసారి తమకు ఎలాగైనా నామినేటెడ్ పదవులు, కార్పొరేషన్ చైర్మన్ పదవులు వస్తాయన్న ధీమాను వ్యక్తం చేస్తున్నారు. నిజామాబాద్ జిల్లా నుండి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆకుల లలిత, అరికెల నర్సారెడ్డి, ఆర్మూర్ నియోజకవర్గ ఇన్చార్జి వినయ్ కుమార్ రెడ్డి, బాల్కొండ నియోజకవర్గ ఇన్చార్జ్ సునీల్ రెడ్డి, నరేందర్ రెడ్డి, నరాల రత్నాకర్ లు నామినేటెడ్ పదవుల కోసం ఆశిస్తున్నారు. బుధవారం ఢిల్లీలో జరుగుతున్న కీలక సమావేశంలో నామినేటెడ్ కార్పొరేషన్ చైర్మన్ ల పదవిపై కీలకమైన నిర్ణయం తీసుకోనున్నారు.

# ప్రజలకు స్నేహపూర్వక పోలీసింగ్ సేవలు అందించాలి.

## - ఫిర్యాదు వచ్చిన వెంటనే స్పందించాలి.- రూరల్ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన సీపీ సాయి చైతన్య.






నిజామాబాద్ క్రైమ్ జూలై 29 (ప్రజాగళం )ప్రజలకు స్నేహపూర్వక పోలీసింగ్ సేవలను అందించాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య సూచించారు. ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ మేరకు నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని రూరల్ పోలీస్ స్టేషన్ను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య బుధవారం వార్షిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్కు చేరుకున్న కమిషనర్ కు పోలీస్ అధికారులు , సిబ్బంది గౌరవ వందనం అందించగా , ఆయన వందనాన్ని స్వీకరించి అనంతరం , మొక్క నాటారు. స్టేషన్లోని వివిధ విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు.మొదటగా స్టేషన్లో సిబ్బందికి అందుబాటులో ఉన్న కిట్ ఆర్టికల్స్ , భద్రతా పరికరాలు , ఆయుధాల నిర్వహణ , రికార్డుల సంరక్షణ తదితర అంశాలను పరిశీలించి వాటి నిర్వహణపై అధికారులకు సూచనలు చేశారు. అనంతరం రిసెప్షన్ సెంటర్ను సందర్శించి అక్కడ నిర్వహిస్తున్న రిజిస్టర్లు , ఫిర్యాదుల నమోదు విధానం , ప్రజలకు అందిస్తున్న సేవలను సమీక్షించారు. పోలీస్ స్టేషన్కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుని గౌరవంతో స్వాగతించి , వారి సమస్యలను ఓర్పుతో విని వెంటనే స్పందించే విధంగా సిబ్బంది వ్యవహరించాలని సూచించారు.పోలీస్ స్టేషన్లో నిర్వహిస్తున్న అన్ని రకాల రికార్డులను పరిశీలించారు. కేసుల నమోదు , పెండింగ్ కేసుల దర్యాప్తు , బీట్ డ్యూటీ వ్యవస్థ , రౌడీషీటర్లు, నేర చరిత్ర కలిగిన వ్యక్తులపై పర్యవేక్షణ వంటి అంశాలను సమగ్రంగా తనిఖీ చేశారు. కేసుల దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్టేషన్లో అమలవుతున్న “5 ఎస్ విధానం” అమలు తీరును సమీక్షించి , ప్రజలకు స్నేహపూర్వక పోలీసింగ్ అందించడంలో ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. మహిళలు , వృద్ధులు , అత్యవసర సహాయం కోసం వచ్చే ప్రజల సమస్యలను ప్రాధాన్యతగా తీసుకొని స్పందించాలని తెలిపారు.. స్టేషన్ పరిసరాల పరిశుభ్రత , రికార్డుల డిజిటల్ నిర్వహణ , సిబ్బంది హాజరు , డ్యూటీ విధానాలు తదితర అంశాలపై కూడా పోలీస్ కమిషనర్ ఆరా తీశారు. ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసం పెరిగేలా క్రమశిక్షణతో , పారదర్శకంగా సేవలు అందించాలని సూచించారు. దర్యాప్తులో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అండర్ ఇన్వెస్టిగేషన్ కేసుల ఛేదనకు ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలని , ప్రతి కేసులో నాణ్యమైన , ఇన్వెస్టిగేషన్ చేయాలని సబ్ ఇన్స్పెక్టర్ కు సూచనలు చేశారు. ఈ పోలీస్ స్టేషన్ పరిధిలో సైబర్ నేరాల జరుగుతున్నాయని, సైబర్ క్రైమ్స్ గురించి వివిధ పాఠశాలలు , కళాశాలలో మరియు సోషల్ మీడియా ద్వారా అవగాహన కల్పించాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాలలో గల విలేజ్ పోలీస్ ఆఫీసర్ గా విధులు నిర్వహిస్తూ ప్రజలతో మమేకమై ఆ ప్రాంతాలలో ఉన్నటువంటి సమస్యలను పరిష్కరించే దిశగా ప్రతి ఒక్కరు కృషి చేసి ,ప్రాంతాలలో ఉ న్నటువంటి సమాచారము తమపై స్థాయి అధికారులకు ఎల్లప్పుడూ చేరవేయాలి అన్నారు. నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ సరిహద్దులో ఉన్నటువంటి అన్నీ ప్రధాన రహదారులపై నిఘా పటిష్టపరిచాలని అన్నారు.ప్రతి రోజు ట్రాఫిక్ సమస్య అధిగమించడానికి ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ ఎన్ఫోర్స్మెంట్ చేయాలని సూచించారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పలు సూచనలు చేశారు. సులభ మార్గంలో అధిక డబ్బులు సంపాధించాలనే అత్యాశతో యువత ఆన్లైన్ బెట్టింగ్స్ ఆన్లైన్ గేమ్స్ ఆడుతూ, సైబర్ మోసగాళ్ళ చేతిలో చిక్కి డబ్బులు కోల్పోతూ అప్పులు చేసి , చేసిన అప్పులను తీర్చలేక తనువును చాలిస్తున్నారని అన్నారు. గేమింగ్ యాప్ ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. డ్రగ్స్ నియంత్రణ కోసము యువతను ఎల్లప్పుడూ చైతన్యవంతులను చేయాలని మరియు అన్ని గ్రామాలలో డ్రగ్స్ వాడకం నిషేధము అని అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలియజేశారు. ప్రతీ కేసులో ఇన్వెస్టిగేషన్ నందు ప్రస్తుతం ఉన్నటువంటి టెక్నాలజీ పద్ధతులను ఉపయోగించుకోవాలని అన్నారు. అనంతరం సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ అధికారులు మరియు సిబ్బంది 24x7 తమ హెడ్ క్వార్టర్స్ లో అందుబాటులో ఉండాలని , దూర ప్రాంతాల నుండి ప్రయాణాలకు దూరంగా ఉండాలని , సిబ్బంది ప్రతి ఆరు నెలలకు ఒకసారి తమ హెల్త్ చెకప్ చేయించుకోవాలని, ముఖ్యంగా బైక్ నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని అన్నారు. ట్రాఫిక్ రూల్స్ ను పాటిస్తూ ఇతరులకు ఆదర్శంగా ఉ ండాలని సూచించారు. ఈ తనిఖీలో నిజామాబాద్ ఎ.సి.పి ప్రకాష్ యాదవ్ , సి.సి.ఆర్.బి ఎ.సి.పి గురు నాయుడు , నిజామాబాద్ రూరల్ ఎస్.హెచ్.ఓ సి. హెచ్. శ్రీనివాస్ , ఎస్.ఐ 1 ఎమ్.డి షరీఫ్ , ఎస్.ఐ 2 ఆనంద్ సాగర్ , ఎస్.ఐ 3 ఎ. మహేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సంపాదకీయం

## కనుమరుగవుతున్న కట్టడాలు..!

ప్రపంచ సాంస్కృతిక వారసత్వ దినోత్సవం ప్రతి ఏట ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిస్తారు. వారసత్వ పరిరక్షణ అంశాల ఆధారం గా 1984, జనవరి 27న నాటి భారతదేశ ప్రధాని ఇందిరా గాంధీ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ చైర్మన్‌గా భారత జాతీయ సంస్కృతి వారసత్వ సంస్థ (ఇండియన్ నేషనల్ ట్రస్టు ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ – ఇంటాక్) అనే సంస్థ ఏర్పాటు చేయబడింది. దీనికి తోడుగా, భారతదేశ వారసత్వ సంపద విలువ, వాటి పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కలిపించేందుకు 'భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ', 'రాష్ట్ర పురావస్తు శాఖ'లకు బాధ్యతలు అప్పగించ బడ్డాయి. అవి భక్త కరీంనగర్ జిల్లా గత కీర్తికి ప్రాచీన చరిత్రకు నిలువుటద్దంగా నిలిచి ఉంది. రాష్ట్ర పురావస్తు శాఖ విశ్రాంత డైరెక్టర్ డాక్టర్ వి. వి. కృష్ణ శాస్త్రి అపురూప పరిశోధనల ఫలితంగా, జిల్లా పాక్చరిత్ర 50వేల సంవత్సరాలకు పూర్వం ఉన్నదని రుజువైతే, అది సామాన్యమైన విషయమేమీ కాదు. గౌతమి నదీ దక్షిణ తీరమున పరి వ్యాప్తమై ఉన్న, కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో, ఉత్తర దక్షిణ భారతీయులకు, సేతువై నిలిచిన ఈ ప్రాంత నాగరికత, కాల ప్రవాహంలో కొట్టుకుని పోయినా, ఉత్సాహవంతులైన చారిత్రక పరిశోధకుల అవిరళ కృషి ఫలితంగా కథలుగా, గాథలుగా, నోళ్లలో, రాళ్లలో, ఆకులలో, రేకుల లో అక్కడక్కడ నిక్షిప్తమైయున్న చరిత్ర కొంతవరకు వెలుగులోనికి రాగలిగింది. చరిత్రలో ఆంధ్రులకు లభించినంత వరకు, శాతవాహనులు మొట్టమొదటి రాజ వంశం అనీ, అదీ మహారాష్ట్రలోని పైఠానో లేక నాసిక ప్రాంతము అనుకుంటే కాదని, అంతకుముందే పురాణాలలో పేర్కొనబడిన ఆంధ్ర భృత్యులని, తొలి ఆంధ్ర ప్రభువుల సేవకులనే విషయం, కోటిలింగాల తవ్వకాలలో బయల్పడడం విశేషం. కరీంనగర్ జిల్లాలోనే శాతవాహనుల మూలపురుషులకు ఆవాస స్థానమని చారిత్రక పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. శ్రీముఖుని కి చెందిన నాణాలను, ధర్మపురి వాస్తవ్యుడైన చారిత్రక పరిశోధకుడు కీర్తిశేషులు సంగనభట్ల నరహరిశర్మ కనుగొన్నాక, శాతవాహన వంశానికి మూల పురుషుడు అనదగిన శ్రీముఖుడు, కోటిలింగాల రాజధానిగా చేసుకొని పరిపాలించాడని రుజువైనాక, చరిత్రలో నూతన అధ్యాయానికి నాంది పలికింది. క్రీస్తుపూర్వం శతాబ్దాల క్రితమే ఆంధ్ర రాజ్యం, శాతవాహనుల ఏలుబడిలో వర్ధిల్లిన, వారి అభిమాన పాత్రమైన బౌద్ధమతం, ఈ ప్రాంత ప్రజల ఆరాధ్య మత మై విరాజిల్లింది. ప్రాచీనమైన ప్రతి గ్రామం పేరులో ప్రతి నిర్మాణ కౌశలంలో, ప్రతి కట్టడం లో వస్తువులు, మట్టి పాత్రలు, మతంతో పెనవేసుకున్న చరిత్ర పలుకుతుంది. శాతవాహన చక్రవర్తుల చత్రచ్ఛాయలలో, బౌద్ధమతం విస్తరించి, శాంతి అహింసలు, విశ్రమించిన ఈ ప్రాంతాల్లో, నాటి ప్రజల ఆరాధ్యాలైన స్థూపాలు, శిల్పాలు, కట్టడాలు, తవ్విన చోటల్లా దర్శనమిస్తూ, వెలకట్టలేని వేల సంవత్సరాల చరిత్రకు, మౌన సాక్షీ భూతాలుగా నిరాదరణ నీడలో మగ్గుతూ, తమ దుస్థితికి చింతిస్తూ, అనాసక్తులైన, అధికారుల, ప్రజాప్రతినిధుల అశ్రద్ధ, నిర్లక్ష్యానికి క్రుంగి కృశిస్తు, ఆయువు తీరకముందే అస్తమిస్తున్నాయి. నిన్నటి వరకు ఆలనా పాలనా కరువై "బుద్ధం శరణం గచ్ఛామి" అంటూ దీనంగా విలపించిన ధర్మపురి నియోజకవర్గంలోని పాషా యిగాం బౌద్ధ స్తూపం, ఒక కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా మూలమట్టం అయింది. క్రీస్తుపూర్వం ఆరవ శతాబ్దంలో గంగా మైదానం ప్రాంతాలలో బౌద్ధమత వ్యాప్తి జరిగినా, అశోకుని కాలం కన్నా ముందే ప్రవేశించిన బౌద్ధమతం, శాతవాహనుల హయాంలో విశేష ఆదరణ పొందింది. కరీంనగర్ జిల్లాలో మూడు ప్రాచీన బౌద్ధ కేంద్రాలు ఉండేవి. వాటిలోని ధర్మపురి సమీప క్రీస్తుపూర్వం 200 సంవత్సరాల సంబంధిత పాశాయిగాం బౌద్ధ స్థూపాన్ని కి విశేష ప్రాధాన్యత ఉండేది. దీనికి 6 వృత్తాకారపు పలకలు ఉండేవి. వీటిపై ఒక పద్మం, ఏనుగు బొమ్మలు, స్థూపానికి ఇరువైపులా, స్తం భాకృతులు కలిగియున్న ఆ స్తూపం రెండవ శతాబ్దానికి చెందినదిగా "దూళికట్ట స్థూపం కన్నా ప్రాచీనమైనదిగా", "జిల్లాలోని మొట్టమొదటి రాతి కట్టడం"గా చరిత్రకారులు రుజువు పరిచారు. క్రీస్తు పూర్వం రెండవ శతాబ్దం నాగ సింపీ యకాయ, జమజోరాగ బ్రహ్మ లేఖలు, స్తూపం వద్ద లభ్యమైనాయి. శాతవాహనుల తొలి రాజధాని అయిన కోటిలింగాలకు మూడు కిలోమీటర్ల దూరంలో, ప్రస్తుత రాయపట్నం – కరీంనగర్ రాష్ట్ర రహదారిని ఆనుకుని, పాశాయిగాం గుట్టపై చెన్నపూస అనే ఆచార్యుడు, బౌద్ధ స్థూపాన్ని నిర్మించినట్లు, సుప్రసిద్ధ బౌద్ధ ఆచార్యుడు దిజ్ఞాగుడు, ఈ ప్రాంతం వాడేనని, చైనా యాత్రికుడు హ్యూన్ త్సాంగ్ ఏడవ శతాబ్దంలో తన గ్రంథంలో పేర్కొన్నాడు. రాష్ట్ర పురావస్తు శాఖ మాజీ డైరెక్టర్ వి.వి. కృష్ణ శాస్త్రి శాతవాహన కళా ఉత్సవాల సందర్భంగా, 2002 జనవరి 21న కరీంనగర్లో ప్రధాన ప్రాసంగికునిగా ప్రకటించడాన్ని బట్టి, పాషాయిగాం బౌద్ధ స్తూప ప్రాధాన్యత స్పష్టమౌతుంది. ఇంతటి ప్రాచీన చారిత్రక ఆధారమైన బౌద్ధ స్తూపం, రాష్ట్ర రహదారి రోడ్డు నిర్మాణంలో, కాంట్రాక్టర్ అయిన ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ నిర్లక్ష్యానికి అనవసరంగా, అకారణంగా బలియై, 1999 డిసెంబర్ 25వ తేదీన నేల కూల్చ బడింది. ఆ తర్వాత ముక్కలైన ఆ స్తూప పలకలను చేర్చి, జిల్లా కేంద్ర పురావస్తుశాఖ మ్యూజియంలో భద్రపరిచి, తిరిగి స్థాపించడం జరిగింది. తత్ఫలితంగా పాశాయిగాంకు చెందిన బౌద్ధ స్తూపం, కనుమరుగై ఈ ప్రాంతం, చరిత్ర పుటల్లో నుంచి తొలగించబడి, ప్రాచీనత్వాన్ని కోల్పోయింది. అలాగే జూలపల్లి మండలంలోని క్రీస్తు పూర్వపు రెండవ శతాబ్ధికి చెందిన హుస్సే నియా వాగు – చిన్న వాగుల సంగమ స్థానంలో 47 శిల్పాలంకృత పలకలచే శోభితమై, ఐదు పడగల "ముచిలింద నాగం" బోధివృక్షం మహాభినిష్క్రమణం చెక్కబడిన దూళికట్ట స్థూపం విశేష ప్రాధాన్యతను కలిగి ఉంది. "కాలచక్ర నిర్వహణ"కై దూళికట్ట నుండి అపురూప ఫలకాలను, అమరావతికి కొద్దికాలం క్రితం తరలించారు. కోటిలింగాల ధూళికట్ట మరియు మీర్జంపేట మానేరు తీరాన చారిత్రక శిల్పాలను, స్తూపాలను, కోటలను, పరి రక్షించేందుకు నాటి రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన 38 లక్షలకు పైగా నిధులు అర్ధాంతరంగా మళ్లించ బడినాయి. ప్రాచీన కట్టడాలు, బౌద్ధ స్థూపాలు, ఆరామాలు, శిల్పీకరించిన అపురూప కళాకృతులు, ఈనాటి వారికి ప్రధానంగా చరిత్ర అంటే గౌరవం లేని సరైన అవగాహన లేని, పాలక అధికార వర్గాలకు తెలియక పోవచ్చు కాని, వాటి ప్రాశస్త్యానికి, వేల సంవత్సరాల వెలకట్టలేని, చారిత్రక నేపథ్యం ఉందన్న యతార్థాన్ని విస్మరించ రాదు. ఒకవైపు ప్రాచీనమైన బౌద్ధ వ్యాప్తికి సంబంధించిన, ఈ ప్రాంత చరిత్ర మరుగున పడుతుండగా... భారతీయ పురాతత్వ విభాగం ప్రపంచ పౌరుల ముందు తలదించుకోవాల్సిన దుస్థితి. గొప్పలు చెప్పుకోవడం కాదు గొప్పలు నిలబెట్టుకోవడమే గొప్ప తనం.

పబ్లిషర్ : కొక్కు రవికుమార్

# నీరు – ప్రాధాన్యతలు



ప్రతి ఎకరాకు సాగునీరందేలా సాగునీటి సంఘాలు కృషి చేయాలని అమరావతిలో నిర్వహించిన నీరు–ప్రగతి, జలహారతి సాగునీటి సంఘాల భాగస్వామ్యం కార్యక్రమంలో సిఎం చంద్రబాబు సూచించడం మంచిదే! అలాగే ఈ ఏడాది నుంచి ఖరీఫ్ సాగును ముందస్తుగా ప్రారంభించాలని తుపానుల వల్ల పంటలు దెబ్బతినకుండా రైతులను సన్నద్ధం చేయాలని, కాల్వలకు మే 15 కల్లా నీటిని విడుదల చేయాలని అధికారులను ఆదేశించడం స్వాగతించదగినది. 'వర్షపు నీటిని భూగర్భ జలాలుగా మార్చుకోవాలని, పరిగెత్తే నీటిని నడిపించాలి, నడిచే నీటిని నిలబెట్టాలి, నిలిచిన నీటిని భూగర్భ జలాలుగా మార్చి భూమినే జలాశయంగా మార్చాలి×' అని చెప్పడం బాగానే వుంది. రాష్ట్రంలో గోదావరి, కృష్ణా, పెన్నా, వంశధార, నాగావళి వంటి 40 నదులు, 38 వేల చెరువులు ఉన్నాయని, వీటన్నిటిలో 1,300 టిఎంసిలకు పైగా నీటిని నిల్వ చేసుకోగలమనీ, ఈ ఏడాది 862 టిఎంసిల నీళ్లు మన జలాశయాల్లో నిల్వ ఉన్నాయని వాస్తవాలు వివరించారు. పై అంశాలతోపాటు ముఖ్యమంత్రి ప్రస్తావించిన కొన్ని విధానపరమైన విషయాలూ, మీడియాలో వచ్చిన వార్తలూ రైతాంగాన్ని, రాష్ట్ర ప్రజలను కలవరపరుస్తున్నాయి. వరిసాగు తగ్గించి ఎక్కువ మంది రైతులు ఉద్యాన పంటలు, తృణ ధాన్యాల (మిల్లెట్స్) వైపు దృష్టి సారించాలనడం పంటల సరళిని ఏకపక్షంగా మార్చడమే! పంటల సరళిలో మార్పు ఎంతో ప్రణాళికాబద్ధంగా జరగాలే తప్ప హడావుడిగా చేయరాదు. ఆయా పంటల సాగుకు భూసార అనుకూలతలు, నీటిపారుదల సౌకర్యాల లభ్యత లేదా కొరత, పంటల ఉత్పత్తుల వినియోగం, నిల్వ అవకాశాలు, మార్కెట్ పరిస్థితులు వగైరా అనేక అంశాలను శాస్త్రీయంగా అధ్యయనం చేశాకనే నిర్ధారించుకొని, అవసరమైన ప్రోత్సాహకాలిచ్చి అన్నదాతలను అటువైపు మళ్లించవలసి వుంటుంది. కానీ ఆ తరహా ఆలోచనలు, తగిన సన్నాహాలు చేయకుండా ఇటువంటి సలహాలివ్వడం రా(ష్టానికి శ్రేయస్కరం కాదు. అలాగే 2027 జూన్ కంటే ముందే పోలవరం జాతికి అంకితం చేస్తామంటూనే ఆ ప్రాజెక్టు పూర్తి చేశాక నదుల అనుసంధానం చేపడతామని, పోలవరం నుంచి నీటిని నల్లమల సాగర్‌కు తీసుకెళ్తామని పేర్కొన్నారు. పెండింగ్ ప్రాజెక్టులపై కదా ప్రాధాన్య? అంతేగాక వివాదాస్పదంగావున్న నల్లమల సాగర్ మాట ఇప్పుడు చెప్పడం ద్వారా తెలుగు రా(ష్టాల మధ్య సఖ్యత, సౌభ్రాతృత్వానికి ఇబ్బందులు తెచ్చుకోవడమే అవుతుంది. అంతేగాక తక్కువ ఖర్చుతో సత్వర ఫలితాలిచ్చే పెండింగ్ ప్రాజెక్టుల్ని పూర్తి చేయడం విజ్ఞతగా ఉంటుంది. రాష్ట్రంలో నీటి వినియోగానికి సంబంధించి కొత్త పాలసీ తీసుకువస్తున్నట్టు, దాన్ని గురువారంనాడు ప్రకటిస్తారనీ విశ్వసనీయమైన ఆంగ్ల మీడియాలో కథనాలొచ్చాయి. ప్రస్తుతం విద్యుత్ రంగంలో అమల్లో ఉన్న రెగ్యులేటరీ కమిషన్‌లా నీటి వినియోగానికి కూడా ఒక కమిషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు కూడా వచ్చింది. గతంలోనే ప్రపంచబ్యాంకు సాగు నీటికి రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటు చేయాలని ఆదేశించడం, అందులో భాగంగా సాగునీటి మీటర్ల ఏర్పాటుకు ఆనాటి (చంద్రబాబు నాయుడు) ప్రభుత్వం విఫలయత్నం చేసిన విషయాలు ప్రజల స్మృతి పథం నుండి ఇంకా తొలగిపోలేదు. మళ్లీ అలాంటి ప్రయత్నం చేయడం అన్నదాతలతో సర్కారు కయ్యం తెచ్చుకోవడమే అవుతుంది. నీటి సరఫరాకు చేస్తున్న ఖర్చుకు తగ్గట్టుగా ప్రజల నుండి వసూలు చేసే పన్నులు ఉండేలా చూడటం కూడా పాలసీలో భాగమంటున్నారు. యూజర్ ఛార్జీలు వసూలు చేయకపోతే భవిష్యత్ నిర్వహణ కష్టం అవుతుందని తొలుత పరిశ్రమలతో ప్రారంభించి, ఆ తరువాత అందరికీ దీనిని విస్తరించే అవకాశం ఉందని సమాచారం. అంతకన్నా ముఖ్యంగా నీటి వినియోగ ప్రాధాన్యతల్లోనూ సర్కారు మార్పులు చేయబోతున్నదని వస్తున్న వార్తలు ఆందోళనకరం. ఇప్పటికే ప్రభుత్వం పంటలకంటే పరిశ్రమలకు, జెన్‌కో అధ్వర్యంలోని జల విద్యుత్ కన్నా కార్పొరేట్లు తెస్తున్న పంప్డ్ హైడ్రో ప్రాజెక్టులకూ మొగ్గు చూపుతున్న వైనం ద్యోతకమవుతోంది. ఈ నేపథ్యంలో కొత్తగా తెచ్చే జల విధానం పై ఎవరికైనా సందేహాలు కలగడం సహజం. ఏదిఏమైనా అంతర్జాతీయ జల సూత్రాల ప్రకారం ప్రజలకు తాగు నీరు, పంటలకు సాగు నీరు, జల విద్యుత్, ఆ తరువాతనే పరిశ్రమలు, ఇతర అవసరాలనే ప్రాధాన్యత క్రమానికి లోబడి ప్రభుత్వం వ్యవహరించడం సబబుగా ఉంటుంది.

# ఆత్మహత్యల నివారణపై పిహెచ్‌డి చేసిన న్యాయమూర్తి

తీవ్రమైన పోటీ, ఒత్తిడి, ఒంటరితనం, నిరాదరణ, ఆర్థిక సమస్యలు చాలామందిని, బాధించే సమస్యలు. వీటిని ధైర్యంగా ఎదుర్కొనడానికి వాళ్లకి శక్తి చాలదు. అలాంటప్పుడే వారికి కుటుంబాల నుండి, సమాజం నుండి, విద్యాసంస్థల నుండి కావాల్సిన మద్దతు అందించాలి. ఆవిధమైన బాధ్యతాయుత, సంస్థాగత చర్యలు తక్షణం తీసుకుంటే ఆత్మహత్యలని నివారించ గలుగుతాం. మద్రాసు హైకోర్టు సిట్టింగ్ జడ్జి ఆర్.ఎన్ మంజుల ఈ ఏడాది జనవరిలో 'ఆత్మహత్యల నివారణ'పై చేసిన థీసిస్‌కి పిహెచ్‌డి పట్టా అందుకున్నారు. న్యాయమూర్తిగా ఉన్న ఆమె తిరిగి విద్యార్థిగా మారి ఈ అంశంపై అధ్యయనం చేశారు. భారతీదశన్ యూనివర్శిటీ మహిళా అభివృద్ధి కేంద్రం ద్వారా నిర్వహించిన ఈ పరిశోధన చెన్నైలోని ఉన్నత విద్యసంస్థల విద్యార్థుల్లో ఆత్మహత్య ఆలోచనల ప్రాబల్యంపై దృష్టి సారించింది. ఈ ధోరణులలో లింగ ఆధారిత అంశాలని కూడా విశ్లేషించింది. జిల్లా కోర్టు జడ్జిగా ఉన్నప్పుడు మంజుల ఎన్నో ఆత్మహత్యల కేసులపై విచారణలు జరిపారు. అవన్నీ ఆమెని తీవ్రంగా కదిలించాయి. ఆ సమయంలో వారికి 'ఎవరూ ఎందుకు సహాయంగా' లేరనే ప్రశ్న ఆమెని ఎంతో బాధించింది. ఆ ఆవేదన నుండే విద్యార్థుల్లో 'ఆత్మహత్య ఆలోచనల వ్యాప్తి, లింగ దృక్పథం'పై అధ్యయనం చేసేలా చేసింది. ఈ అంశంపై తనకి ఎందుకు ఆసక్తి ఏర్పడిందో ఆమె ఇలా చెప్పారు. 'సాధారణంగా కోర్టుల్లో తీర్పులు వెలువడి నప్పుడు వ్యక్తిగత కేసులు పరిష్కారమైనట్లు భావిస్తారు. అక్కడితో వాటిని విడిచిపెట్టేస్తారు. కానీ వాటి వెనుక 'లోతైన సామాజిక అవగాహన చాలా అవసరమని నేను భావించాను. జిల్లా న్యాయవ్యవస్థ నుండి పదోన్నతి పొందిన తరువాత ఈ అంశంలో పరిశోధన చేయాలని నిశ్చయించుకున్నాను.

గత తొమ్మిదేళ్లుగా జిల్లాల్లో ఎన్నో ఆత్మహత్యల కేసులు, వరకట్న మరణాల కేసులు నా ముందుకు వచ్చాయి. వాటిలో చాలామంది మహిళలు తాము తీవ్రమైన కష్టాల్లో ఉన్నప్పుడు తమ కుటుంబాలని సహాయం కోరారు. కానీ చాలా సందర్భాల్లో ఆ కుటుంబ పరిస్థితులే వారి సమస్యలకి కారకాలుగా మారినట్లు తేలింది. న్యాయమూర్తిగా నేను తీర్పులు మాత్రమే చెప్పగలను. విచారణకి వచ్చిన ఆత్మహత్యల కేసులు నన్ను తీవ్రంగా కలవరపెట్టేవి. ఆ వ్యక్తి చుట్టూ ఉన్న వ్యక్తులు సకాలంలో తనకి కావాల్సిన భావోద్వేగ మద్దతుని అందించడంలో



ఎందుకు విఫలమయ్యారో' అని తీవ్రంగా ఆలోచించేదాన్ని. ఆ కేసుల వెనుక ఉన్న సామాజిక సమస్యని అర్థం చేసుకోవాలనే పిహెచ్‌డి చేశాను. దీని కోసం చెన్నైలోని 20 ప్రముఖ విద్యాసంస్థల్లో 2000 మంది విద్యార్థులతో మాట్లాడాను. వారిలో 10.8 శాతం మంది ఆత్మహత్య ఆలోచనల్లో ఉన్నట్లు చెప్పారు. వీరిలో పురుషులు 69.3 శాతం, మహిళలు 30.7 శాతం మంది ఉన్నారు. ఈ ఫలితాల వల్ల ఉన్నత విద్యాసంస్థల్లో ఆత్మహత్యల నివారణకై పాటించాల్సిన మార్గదర్శకాలపై ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రాధాన్యతని సంతరించుకుంది' అని ఆమె అన్నారు. ఈ సందర్భంగా సుప్రీం ఇచ్చిన మార్గదర్శకాలని ఒకసారి గుర్తు చేసుకుందాం.

సుప్రీం ఇచ్చిన మార్గదర్శకాలలో ఈ అంశాన్ని కేవలం వ్యక్తిగత వైఫల్యంగా పరిగణించలేదు. దీన్ని ప్రధాన ప్రజారోగ్య సమస్యగా అభివర్ణించారు. 2025–26ని మానసిక ఆరోగ్య మద్దతు, సంస్థాగత జవాబుదారీతనం, విద్యాసంస్థల్లో ఆత్మహత్యల నివారణపై దృష్టి సారించే మైలురాయిగా పేర్కొంది. సుప్రీంకోర్టు వెలువరించిన కొన్ని ముఖ్య మార్గదర్శకాల: ఉన్నత విద్యాసంస్థలు, కోచింగ్ సెంటర్లలో పెరుగుతున్న ఆత్మహత్యలు 'కలతపెట్టే విషయాలు'. తీవ్రమైన పోటీ, విద్యా ఒత్తిడి, మద్దతు లేకపోవడం వల్ల ఏర్పడిన సంక్షోభం ఇది. ఆత్మహత్యాయత్నాన్ని నేర రహితం చేయడం : ఐపిసి సెక్షన్ 309 (ఆత్మహత్యకి ప్రయత్నించడం నేరం) ఉన్నప్పటికీ కోర్టు దీన్ని చారిత్రాత్మకమైనదిగా సూచించింది. మానసిక ఆరోగ్య సంరక్షణ చట్టం 2017 ప్రకారం ఆత్మహత్యకి ప్రయత్నించే వ్యక్తులు తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారు. కాబట్టి వారికి శిక్ష కాదు. సంరక్షణ, పునరావాసం అవసరం. నూతన భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్)2023 ప్రకారం ఆత్మహత్యాయత్నాన్ని నేరపూరితంగా పరిగణించడం పూర్తిగా తొలగించింది. పాన్–ఇండియా నివారణ మార్గదర్శకాలు (జులై 2025) : ఆత్మహత్యలని అరికట్టడానికి అన్ని విద్యా సంస్థలకి సమగ్రమైన కట్టుబడి ఉండే మార్గదర్శకాలని జారీ చేసింది. తప్పనిసరి నివేదిక : సంస్థలు, విద్యార్థుల ఆత్మహత్యలు లేదా అసహజ మరణాలని వెంటనే పోలీసులకి నివేదించాలి. సహాయక వ్యవస్థలు : 100 మంది కంటే ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న సంస్థలు కనీసం ఒక అర్హత కలిగిన మానసిక కౌన్సిలర్‌ని నియమించాలి. పాఠ్యాంశాలు, పర్యావరణం :

విద్యా ఒత్తిడిని తగ్గించేలా సౌకర్యవంతమైన పాఠ్యాంశాలని అభ్యాసంలో చేర్చాలి. మౌలిక సదుపాయాల భద్రత : హాస్టళ్లలో హఠాత్తు చర్యలని నివారించడానికి మెష్ నెట్‌లు లేదా ప్రత్యేకంగా రూపొందించిన సీలింగ్ ఫ్యాన్‌లు వంటి 'ఆత్మహత్య నిరోధక' పరికరాలని తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. పబ్లిక్ షేమింగ్‌పై నిషేధం :

మార్కులు, పబ్లిక్ అవమానం, కఠినమైన విద్యా లక్ష్యాల ఆధారంగా బ్యాచ్ విభజన నిషేధం. సిబ్బంది శిక్షణ : బాధ, స్వీయ హాని వంటి హెచ్చరికసంకేతాలని గుర్తించడంలో సిబ్బందికి తప్పనిసరి శిక్షణ ఇవ్వాలి. సంస్థల బాధ్యత : సంస్థలు తల్లిదండ్రుల వలె వ్యవహరించాలి. విద్యార్థులు ఒత్తిడికి గురైనప్పుడు చర్య తీసుకోవడంలో ఏదేని సంస్థ వైఫల్యం చెందితే దాన్ని 'సంస్థాగత అపరాధం'గా పరిగణించాలి.

– ఆత్మహత్యకి ప్రేరేపించడం (సెక్షన్ 306) : ఆత్మహత్యకి ప్రేరేపించడం కేసుల్లో పరిస్థితుల ఒత్తిడి మాత్రమే కాకుండా, ఒకరిని దోషిగా నిర్ధారించే 'సానుకూల చర్య' వంటి ప్రత్యక్ష ఆధారాలు ఉండాలని స్పష్టం చేసింది. జీవించే హక్కుల్లో మానసిక ఆరోగ్యం కూడా ఒకటి : రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం మానసిక ఆరోగ్య హక్కు జీవించే హక్కుల్లో అంతర్భాగమని సుప్రీం కోర్టు గుర్తించింది. జాతీయ టాస్క్ ఫోర్స్ (2025):మానసిక ఆరోగ్య సమస్యలని పరిష్కరించడానికి, విద్యార్థుల ఆత్మహత్యలని నివారించడానికి మాజీ న్యాయమూర్తి ఎస్.రవీంద్ర భట్ నేతృత్వంలో జాతీయ టాస్క్ ఫోర్స్ (ఎన్‌టిఎఫ్)ని ఏర్పాటు చేశారు.

# విశాఖపట్నం టు రాయ్‌పూర్ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే

విశాఖపట్టణం, : ఏపీ మీదుగా విశాఖపట్నం నుంచి రాయ్‌పూర్‌కు గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం జరుగుతోంది. ఈ మేరకు విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో పులు వేగవంతం చేశారు. చిన్నయ్యపాలెం దగ్గర ఇంటర్ ఛేంజ్, సూరెడ్డి పాలెం దగ్గర డబుల్ ట్రంపెంట్ కూడా నిర్మాణం చేస్తున్నారు. ఈ పనుల్ని వేగవంతం చేసి వచ్చే ఏడాది నాటికి పనులు పూర్తి చేయాలని భావిస్తున్నారు. ఈ హైవే అందుబాటులోకి వస్తే రాయ్‌పూర్ 6 గంటల్లో వెళ్లొచ్చంటున్నారు. ఆంధ్రప్ర దేశ్ మీదుగా నిర్మిస్తున్న మరో గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే పనులపై కీలక అప్డేట్ వచ్చింది. విశాఖపట్నాన్ని రాయపూర్‌తో కనెక్ట్ చేసే ఈ ఆరు లైన్ల ఈ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే పనులు సబ్బవరం– షీలానగర్ మధ్య వేగవంతం అయ్యాయి. ఈ హైవే పనుల్లో భాగంగా చిన్నయ్యపాలెం దగ్గర ఇంటర ఛేంజ్ నిర్మాణం జరుగుతోంది. అలాగే సూరెడ్డిపాలెం సమీపంలో డబుల్ ట్రంపెట్ కూడా నిర్మాణం చేస్తున్నారు. అక్కడ భూమిని చదును చేసి ల్యాండ్ ఫిల్లింగ్, డ్రైనేజీల నిర్మాణానికి కాలువల్ని తవ్వుతున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా పెద్ద, పెద్ద మెషిన్ల సాయంతో కార్మికులు పనుల్ని చేపట్టారు. సబ్బవరం–షీలానగర్ మధ్య చేపట్టిన హైవే పనుల్లో భాగంగా.. అమృతపురం శివారు సూరెడ్డిపాలెం నుంచి షీలానగర్ మొత్తం 12.66 కిలోమీటర్ల మేర నిర్మాణం జరుగుతోంది. అయితే 8 కిలోమీటర్లు ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తున్నారు. ఈ ఎలివేటెడ్ కారిడార్‌తో షీలానగర్ దగ్గర ఎన్‌హెచ్–16, విశాఖపట్నం పోర్టు రోడ్డుకు కనెక్ట్ చేస్తారు. గతంలోనే ఈ రోడ్డుకు నిధులు మంజూరైనా భూసేకరణ ఆలస్యం కావడంతో పనుల్లో కూడా జాప్యం జరిగింది. ఇప్పుడు అన్ని సమస్యలు పరిష్కారం కావడంతో పనులు మరింత ఊపందుకున్నాయి. విశాఖపట్నం–రాయ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ హైవేను నాలుగు ప్యాకేజీలుగా పనులు చేపట్టారు. విజయనగరం జిల్లా కంటకాపల్లి నుంచి అనకాపల్లి జిల్లా సబ్బవరం వరకు నాలుగో ప్యాకేజీ కింద పనులు పూర్తి చేశారు. ఈ హైవే చిన్నయ్యపాలెం దగ్గర అనకాపల్లి–ఆనందపురం హైవేలో కలిసేలా ప్లాన్ చేశారు. రాయ్‌పూర్ వైపు నుంచి వచ్చే వాహనాలు కిలోమీటరు దూరంలో ఉండే సూరెడ్డిపాలెం వరకు అనకాపల్లి–ఆనందపురం హైవేలోనే ప్రయాణించాల్సి ఉంటుంది. అక్కడ డబుల్ ట్రంపెట్ నిర్మాణం జరుగుతోంది.. షీలానగర్ వైపు నుంచి వచ్చే వాహనాలు అనకాపల్లి, ఆనందపురం, రాయపూర్ వైపు వెళ్లేలా ఈ డబుల్ ట్రంపెట్ నిర్మాణం చేపట్టారు. 2027 చివరికి సబ్బవరం–షీలానగర్ మధ్య ఈ హైవే అందుబాటులోకి వస్తుందని భావిస్తున్నారు. ఈ హైవే అందుబాటులోకి వస్తే విశాఖలోని నేషనల్ హైవేపై భారీ వాహనాల రద్దీ తగ్గుతుందని అంచనా వేస్తున్నారు. అంతేకాదు ఈ హైవే మొత్తం అందుబాటులోకి వస్తే విశాఖపట్నం నుంచి రాయ్‌పూర్ 6 గంటల్లో వెళ్లొచ్చంటున్నారు. ఫ్రీ సిగ్నల్ జర్నీ: విశాఖపట్నంలో ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టే దిశగా మరో ముందడుగు పడింది. నగరంలో కీలకమైన ఎన్ఏడీ కూడలి దగ్గర కాకానినగర్ దగ్గర ఆర్వోబీ ప్రారంభానికి సిద్ధమైంది. ఎయిర్‌పోర్టుకు వెళ్లేందుకు ఇబ్బందులు తొలగిపోతాయని చెబుతున్నారు. ఈ పనునలు ముగింపు దశలో ఉండగా.. ఈ ఆర్వోబీని ఈ నెలలోనే ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కాకానినగర్ కూడలికి సమీపంలో అండర్ గ్రౌండ్ బ్రిడ్జి కూడా నిర్మించాలని నిర్ణయం తీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్రం సాయంతో హైవేలు, రైల్వే ప్రాజెక్టుల్ని వేగవంతం చేసింది. విశాఖపట్నంలో కీలకమైన ఆర్వోబీ (రైల్ ఓవర్ బ్రిడ్జి) అందుబాటులోకి రాబోతోంది. నగరంలో కీలకమైన ఎన్ఏడీ కూడలికి వెళ్లేందుకు.. అక్కడి నుంచి ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లేందుకు ఈజీగా ఉంటుంది. ఎన్ఏడీ ఫ్లై ఓవర్ నుంచి కాకానినగర్ కూడలికి వెళ్లేందుకు ఈ ఆర్వోబీ పనులు ముగింపు దశకు వచ్చాయి.. త్వరలో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్లాన్ చేస్తున్నారు. నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు కూడా తొలగిపోతాయంటున్నారు. వాస్తవానికి ఎన్ఏడీ ఫ్లై ఓవర్ నిర్మాణం చేపట్టిన సమయంలోనే ఆ ఆర్వోబీ కూడా రెండేళ్ల క్రితమే పూర్తి చేయాల్సింది. ఈ ఆర్వోబీని 18 మీటర్ల ఎత్తులో 210 మీటర్ల పొడవుతో రైలు పట్టాలపై నిర్మాణం చేశారు. ఆ ఆర్వోబీకి రెండు పక్కల అప్రోచ్ రోడ్లు కూడా ఉన్నాయి. ఎన్ఏడీ కూడలి నుంచి 200 మీటర్లు.. అటు ఎయిర్‌పోర్టు నుంచి రోడ్డులో 300 మీటర్ల పొడవుతో లింక్ చేస్తున్నారు. ఈ పనులు చివరి దశలో ఉన్నాయి.. ప్రస్తుతం ఎన్ఏడీ వైపు నుంచి మట్టి తవ్వి రోడ్డు నిర్మాణం, రెయిలింగ్ పనులు నిర్వహిస్తున్నారు. ఎయిర్‌పోర్ట్ వైపు తారు రోడ్డు పనుల చేస్తున్నారు. ఇక్కడ మొత్తం ఆరు రోడ్లు అందుబాటులోకి వస్తాయి. ఎన్ఏడీ ఫ్లై ఓవర్ కింద, పై నుంచి రాకపోకలకు అవకాశం ఉంటుంది. ఈ నెల 15 నుంచి ఆర్వోబీ అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నారు. దీని కోసం 24 గంటలూ పనులు కొనసాగుతు న్నాయి.. అయితే కాకాని నగర్ కూడలి దగ్గర విప్ గణబాబు సూచనలతో అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మిస్తున్నారు. కాకానినగర్ కూడలికి 100 మీటర్ల ముందు ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులు కూడా త్వరలోనే మొదలవుతాయని అధికారులు చెబుతున్నారు. ఈ బ్రిడ్జి కూడా పూర్తి చేస్తే సిగ్నల్ లేకుండానే రాకపోకలు సులభంగా ఉంటాయి అంటున్నారు. మొత్తం మీద నగరంలో ట్రాఫిక్ ఫ్రీ జర్నీకి ఈ ఆర్వోబీ కీలకంగా మారనునంది.

# ప్రత్యేక ఓటరు జాబితా సవ రణలో బీఎల్ఏలు కీలకంగా పనిచేయాలి..

## బిజెపి జిల్లా అధ్యక్షులు నీలం చిన్నరాజులు.

బాన్సువాడ, జూలై 29, ప్రజాగళం. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితాసవరణకార్యక్రమాన్ని విజయవంతం చేయ డంలో పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) కీలక పాత్ర పోషించాలని భారతీ య జనతా పార్టీ జిల్లా అధ్య క్షులు నీలం చిన్నరాజులు పిలుపునిచ్చారు.బుధవారం బాన్సువాడ పట్టణంలో పార్టీ బీఎల్ఏ ఇన్‌చార్జిలతో నిర్వహించిన ప్రత్యేక సమా వేశంలో ఆయన మాట్లాడా రు. ఎన్నికల సంఘం నిర్వ హిస్తున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్ర మంలో అర్హులైన ప్రతి ఒక్క రి పేరును ఓటరు జాబితా లో నమోదు చేయించడం, వివరాల్లోని తప్పులను సరిదిద్దడం, కొత్తగా అర్హత పొందిన వారిని ఓటర్లుగా చేర్చడం వంటి అంశాల్లో బీఎల్ఏలు చురుకుగా పనిచేయాలనిసూచించారు. ఎన్యుమరేషన్ ఫారాలను తీసుకుని ఇప్పటివరకు సమర్పించని ప్రతి ఓటరిని గుర్తించి, వ్యక్తిగతంగా ఫారా లను పూర్తిగా నింపించి సంబంధిత బీఎల్ఓలకు అందజేసేలా చర్యలు తీసు కోవాలని అన్నారు. కేవలం ఫారాల పంపిణీకే పరిమితం కాకుండా, ప్రతి ఫారం డిజి టలైజేషన్ జరిగిందా లేదా అన్న విషయాన్ని కూడా బీఎల్ఏలునిర్ధారించుకోవాలని సూచించారు.మరో నాలుగు రోజుల్లో ప్రత్యేక సవరణ కార్యక్రమం ముగి యనున్న నేపథ్యంలో గ్రామా ల్లో ప్రతి ఇంటికి వెళ్లి కొత్తగా అర్హత పొందిన ఓటరులను గుర్తించి వారి పేర్లు జాబితా లో



నమోదు అయ్యేలా చూడాలని కోరారు. అలాగే ఇప్పటికే ఉన్న ఓటర్ల పేర్లు అనవసరంగా తొలగించ బడకుండా,ఎలాంటి తప్పు లు లేకుండా ఓటరు జాబి తా ఉండేలా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. 100 శాతం ఓటరు జాబితా సవరణ పూర్తయ్యేలా ప్రతి బీఎల్ఏబాధ్యతాయుతం గా పనిచేసి ఎన్నికల సంఘం నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలన్నారు.సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, పట్టణ అధ్యక్షులు కోణాల గంగారెడ్డి, జిల్లా ఉపాధ్య క్షులు చిదురు సాయిలు, జిల్లా కార్యదర్శి శంకర్ గౌడ్, నసురుల్లాబాద్ మండల అధ్యక్షులు హనుమాన్లు, పట్టణ ప్రధాన కార్యదర్శి పాశం భాస్కర్ రెడ్డి, భూమేష్, మండల నాయ కులు,బూత్ లెవల్ ఏజెంట్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# డిమాండ్ల సాధన కోసం ఆగస్టు 4న చలో బస్ భవన్

## -ఆర్టీసి విశ్రాంత ఉద్యోగుల సంఘం వెల్లడి

నిజామాబాద్ సిటీ జూలై 29( ప్రజాగళం ) ఆర్టీసీ సంస్థలో పనిచేసి పదవి విరమణ పొందిన ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 4వ తేదీన బస్ భవన్ ముట్టడి కార్యక్రమాన్ని చేపడుతున్నామని ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆనందం వెల్లడించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ సమస్యలు 2013 నుండి పెండింగ్లో ఉన్నాయని,తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన మా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని వాపోయారు. తెలంగాణ ఉద్యమ సాధనలో ఆర్టీసీ ఉద్యోగులు చురుకుగా పాల్గొని అనేకమంది చనిపోయార న్నారు. బతుకున్నప్పుడే రావాల్సిన బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఒక్కొక్కరికి పది నుండి పదిహేను లక్షల వరకు బకాయిలు రావాల్సి ఉందన్నారు.ఆగస్టు మూడవ తేది వరకు తమ సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా 17వేల విశ్రాంత ఉద్యోగులు బస్ భవన్ ముట్టడిస్తామని హెచ్చరించారు. జిల్లా అధ్యక్షులు రాజన్న మాట్లాడుతూ మా సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రంలోని వివిధ జిల్లాలలో ఎంపీలను, ఎమ్మెల్యేలను కలిసి వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందన్నారు. సంస్థలో





పనిచేసి చనిపోయిన వారి కుటుంబాలకు అండగా నిలవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామ్మన్నారు. స్టేట్ జనరల్ సెక్రెటరీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సంస్థలో సుదీర్ఘకాలం సేవలందించి పదవీ విరమణ పొందిన తర్వాత అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామన్నారు. వేతన సవరణ జరిగిన ఇప్పటివరకు డబ్బులు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షులు పి రామచందర్, కార్యదర్శి ఎస్ పోశెట్టి, కోశాధికారి సుదర్శన్ గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్ఎల్ నారాయణ, డి ఎస్ బి రాజు, జీవి చారి, ఆర్. నర్సింలు, జిల్లాలోని అన్ని డిపోల అధ్యక్షా కార్యదర్శులు పాల్గొన్నారు.

# జాన్కంపేట్ లో మట్కా ఆడుతున్న స్థావరంపై ఎడపల్లి పోలీసులు దాడి

## .ఇద్దరి అరెస్ట్..రూ:6780 లు,ఒక ద్విచక్ర వాహనం, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం... ఎస్ఐ ముత్యాల రమ వెల్లడి...

ఎడపల్లి,జూలై 29: (ప్రజా గళం) నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం జాన్కంపేట్ గ్రామంలో ఆన్ లైన్ మట్కా ఆడుతున్న ఇద్దరు వ్యక్తు లను బుధవారం ఎడపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ ముత్యాల రమ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నెహ్రూనగర్ గ్రామానికి చెందిన షేక్. ముఖీమ్,షేక్.గులాం అనే ఇద్దరు జాన్కంపేట్ గ్రామం లోని వైన్స్ షాప్ సమీపంలో ఆన్ లైన్ లో మట్కా ఆడు తున్నారని తెలిపారు.కాగా ఎడపల్లి పోలీసులు జాన్కం పేట్ గ్రామంలో మంగళవారం సాయంత్రం వాహనాలు తనిఖీ చేస్తున్నారని తెలిపారు.స్థానికులు అందించిన సమాచారం మేరకు పోలీసులు మట్కా ఆడుతున్న స్థావరం పై దాడి చేసి మట్కా నిర్వాహకులు ఇద్దరిని పట్టుకున్నట్లు చెప్పారు.మట్కా ఆడుతున్న



ఇద్దరి వద్ద నుండి 6780 రూపాయలు నగదు,ఒక ద్విచక్ర వాహ నం,రెండు సెల్ పోన్ లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రమ తెలిపారు.

# బిట్‌కాయిన్ పేరుతో రూకోట్లకు కుచ్చు టోపీ? ఆర్మూర్ కేంద్రంగా డిజిటల్ దోపిడీ

## పోలీస్ లను ఆశ్రయించిన బాధితులు.?

ఆర్మూర్, జులై 29 (ప్రజాగళం):ఆర్మూర్ డిజిటల్ బిట్ కాయిన్ కోట్లకు కుచ్చుటోపి పెట్టిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. కరెన్సీ పేరుతో అమాయక ప్రజలను భారీగా మోసం చేసిన ఘటన ఆర్మూర్ డివిజన్‌లో కలకలం రేపుతోంది. బిట్‌కాయిన్‌లో పెట్టుబడి పెడితే తక్కువ సమయంలోనే భారీ లాభాలు వస్తాయని ఆశ చూపిస్తూ కోట్ల రూపాయలు వసూలు చేసిన నిర్వాహకులు చివరకు బాధితులను నట్టేట ముంచినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బిట్ కాయిన్ నిర్వాహకులు అధిక డబ్బులు ఆశ చూపి ఒక్కో సభ్యుడు వద్ద నుండి మొదట, డిజిటల్ ఐడీని పొందేందుకు రూ.50 వేల చొప్పున సభ్యత్వం చేయిస్తారు. రూ.లక్ష పెట్టుబడిపై నెలకు రూ.16 వేల వరకు ఆదాయం రావడంతో సభ్యత్వం చేయించిన వారికి ఐడి రూపంలో ఇన్సెంటివ్ రాబడి వస్తుంది.. ప్రారంభంలో కొంతమందికి లాభాలు వచ్చినట్లు తెలుస్తోంది. ఐడి పొందిన సభ్యులు లాభాలు ఏరచూపి మరింత మంది ఆకర్షితులను చేసినట్లు తెలుస్తోంది. లాభాలు రావడంతో తిరిగి లక్షల రూపాయలు పెట్టుబడులు పెట్టినట్లు తెలుస్తోంది. ఆర్మూర్ డివిజన్‌లో ఇద్దరితో ప్రారంభమైన ఈ డిజిటల్ పెట్టుబడి వ్యవహారం క్రమంగా 25 మందికి పైగా విస్తరించినట్లు సమాచారం. అధిక డబ్బుల ఆశతో ఆర్మూర్ ప్రాంతంతో పాటు జగిత్యాల, కరీంనగర్ జిల్లాలకు చెందిన వారు ఇందులో పెట్టుబడులు పెట్టినట్లు తెలిసింది. ఆగు ఆర్మూర్ డిజైన్ లో, జగిత్యాల్ లో ప్రధాన సూత్రధారులు ఇందుకు కారణమని తెలుస్తుంది. కొత్తగా పెట్టిన పెట్టుబడులు లాభాలు తిరిగి రాకపోవడంతో తాము బిట్ కాయిన్ లో పెట్టి మోసపోయి నట్లు బాధితులు లబో దిబో మంటున్నారు. కొందరు బాధితులు అప్పుచేసి మరి పెట్టుబడులు పెట్టగా, మరికొందరు కమిషన్ పేరుతో ఇతరులకు ఐడి ఇచ్చినట్లు కూడా తెలుస్తుంది. పోగొట్టుకున్న సొమ్ము కోట్లల్లో ఉ ండొచ్చని బాధితులు వాపోతున్నారు.కొన్ని నెలల తర్వాత చైన్ సిస్టమ్ తరహాలో వ్యవహారం నిలిచిపోవడంతో కొత్తగా పెట్టిన పెట్టుబడులు తిరిగి రాకపోవడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది.

ప్రస్తుతం బాధితులు తమ పెట్టుబడి, వడ్డీతో సహా తిరిగి ఇవ్వాలని ప్రధాన నిర్వాహకులపై ఒత్తిడి తెస్తున్నారు. ప్రధాన నిర్వాహకుల్లో ఒకరు ఆర్మూర్ డివిజన్‌కు చెందిన వ్యక్తి కాగా, మరొకరు జగిత్యాల కు చెందిన వ్యక్తిగా ప్రచారం సాగుతుంది. ఆర్మూర్ మండలంలో సదరు వ్యక్తి వద్ద బిట్కాయిన్ లో పెట్టిన డబ్బులు తిరిగి రాకపోవడంతో సదరు వ్యక్తిని నిలదీసినట్లు తెలిసింది.డబ్బులు తిరిగి ఇవ్వాలని పలుమార్లు కోరినా ఫలితం లేకపోవడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై పోలీసులు ఫిర్యాదులు స్వీకరించి విచారణ చేపట్టే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది.బిట్ కాయిన్, క్రిప్టోకరెన్సీ, లావాదేవీలకు పూర్తి స్థాయి అధికారిక గుర్తింపు లేకపోవడంతో పాటు, అధిక లాభాల పేరుతో జరుగుతున్న మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ భారీ డిజిటల్ మోసంపై పోలీసు ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఇప్పుడు పట్టణంలో సర్వతుల చర్చనీ అంశంగా మారింది. ఈ సంఘటన పై పోలీసులు దర్యాప్తు ఎలా ఉండబోతుంది, బాధితులకు న్యాయం జరుగుతోందా, బాధితులకు డబ్బులు వస్తాయా? లేక గేమర్స్ చేతులెత్తెస్తారా? వేచి చూడాలి..!

# అక్రమ కేసులు ఎత్తివేయాలని ప్రభుత్వ సలహాదారులు కలిసిన వామపక్ష పార్టీల నాయకులు



నిజామాబాద్,జూలై 29,ప్రజాగళం: వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేసేలా చర్యలు తీసుకోవాలని సీపీఐ సీపీఎం సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్, న్యూడెమోక్రసీ పార్టీల నాయకులు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి గారిని కలవడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీట్ పరీక్ష లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి రాజీనామా చేయాలని ఈనెల 24న దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్ పిలుపులో పాల్గొన్న జిల్లాలోని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులపై పోలీసులు అక్రమ కేసులు పెట్టారన్నారు. నీట్ లీకేజీకి వ్యతిరేకంగా జరిగిన విద్యార్థి ఉద్యమంలో నమోదైన కేసులను ఎత్తివేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని విద్యార్థులు, ప్రజలు, అన్ని రాజకీయ పార్టీలు డిమాండ్ చేశాయన్నారు. ఉద్యమానికి దిగివచ్చిన కేంద్రం కేసులను ఎత్తివేస్తూ ప్రకటన చేసిందన్నారు. కానీ దీనికి పూర్తి భిన్నంగా జిల్లాలో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులపై పోలీసులు అక్రమ కేసులు నమోదు చేసి, వేధిస్తున్నారన్నారు. పోలీసులు రియాన్స్ హోటల్ మేనేజ్మెంట్ కాలేజీకి వత్తాసు పలుకుతూ విద్యార్థి సంఘాల నాయకులపై కక్షపూరితంగా వ్యవహరించారన్నారు. ఇది రాష్ట్ర ప్రభుత్వానికి నష్టంచేసే చర్య అవుతుందన్నారు. విద్యార్థి సంఘాల నాయకులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి గారు , పోలీసు కమిషనర్ గారితో మాట్లాడి కేసులను ఎత్తివేసేలా చూడాలన్నారు. నీటి లీకేజీ ఘటనలపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని దుయ్యబట్టారు. సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య, మాస్ లైన్ పార్టీ నగర కార్యదర్శి ఎం.సుధాకర్, పి డి ఎస్ యు జిల్లా అధ్యక్షులు కే.గణేష్ ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం తదితరులు పాల్గొన్నారు.

# నీట మునిగిన జర్నలిస్ట్ కాలనీ.... రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు

## - జర్నలిస్ట్ కాలానికి రాకపోకలు బంద్-సత్వరమే స్పందించి సమస్య పరిష్కరించాలి- మున్సి పల్ ఛైర్ పర్సన్,కమిషనర్ లకు జర్నలిస్టులు వినతి

బోధన్ ప్రతినిధి.జూలై 29: (ప్రజా గళం) బోధన్ పట్టణంలోని ఆచన్‌పల్లి జర్నలిస్ట్ కాలనీ వర్షపు నీటిలో మునిగిపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు.కాలనీలో వర్షపు నీరు నిలిచిపోవ డంతో కాలనీలోకి రాకపోకలు నిలిచిపోయాయి.ము ఖ్యంగా పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు,అత్యవసర న్యూస్ కవరేజ్ కు వెళ్లే జర్నలిస్టులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు.గత ఏడాది ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ కృష్ణ జాదవ్,అధికారు లు సమస్యను పరిశీలించినప్పటికీ,ఇప్పటికీ శాశ్వత పరిష్కారం లభించలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రతి వర్షానికి ఇదే పరిస్థితి పునరావృతమ వుతుండటంతో,వెంటనే స్పందించి కాలనీలో నిల్వ నీటి ని తొలగించి శాశ్వతంగా సమస్య పరిష్కారం చూపాల ని జర్నలిస్టులు,కాలనీవాసులు మున్సిపల్ ఛైర్ పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి,కమిషనర్ జాదవ్ లను కోరుతున్నారు.



# గురువు స్థానం దైవంతో సమానం. పాద పూజ చేసిన అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్

నిజామాబాద్ సిటీ జూలై 29 (ప్రజాగళం ) భారతీయ సాంప్రదాయంలో గురువు స్థానం దైవంతో సమానమని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. గురు పూర్ణిమను పురస్కరించుకొని బుధవారం నగరంలోని బింగి కళ్యాణ మండపంలో గురువు కోన సముందర్ శ్రీనాథ్ శర్మ దంపతులకు కుటుంబసమేతంగా పాద పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...గురువులు జీవితంలోని అజ్ఞానాంధకారాన్ని తొలగించి జ్ఞాన వెలుగును ప్రసాదిస్తారని పేర్కొన్నారు. వేల సంవత్సరాలుగా భారతదేశంలో కొనసాగుతున్న గురు శిష్య సంప్రదాయానికి ఈరోజు ప్రతీకగా నిలుస్తుంది అన్నారు. అనేకమంది సన్యాసులు, యోగులు ఈ రోజున కొత్త దీక్షలు, జపాలు, సాధనలు ప్రారంభిస్తారని తెలిపారు. గురువే బ్రహ్మ, గురువే విష్ణువు, గురువే మహేశ్వరుడు. గురువే పరబ్రహ్మ స్వరూపుడన్నారు. గురువులకు పాదపూజ చేయడం, తోచిన దక్షిణ, వస్త్రాలు, పండ్లు, పుస్తకాలు, సమర్పించడం ఆనవాయితీ అన్నారు. తల్లిదండ్రులు జన్మనిస్తే, గురువు జీవితానికి అర్థాన్ని నేర్పుతారని అన్నారు. జ్ఞానం, వినయం, సంస్కారం, ధర్మం విలువలను గుర్తు చేసే పవిత్ర పర్వదినం అని వివరించారు. అంతకుముందు మల్లారంలోని దత్త ఆశ్రమాన్ని దర్శించుకున్నారు.



# లయన్స్ క్లబ్ ఆఫ్ ఎడపల్లి,ఆచన్ పల్లి క్లబ్ వారి సంయుక్త ఆధ్వర్యంలో మంగళ్ పాడ్ లో ఉచిత వైద్య శిబిరం

ఎడపల్లి,జూలై 29: (ప్రజా గళం)లయన్స్ క్లబ్ ఆఫ్ ఎడపల్లి అలాగే లయన్స్ క్లబ్ ఆఫ్ ఆచన్ పల్లి వారి సంయుక్త అద్వర్యంలో మంగళవారం ఎడపల్లి మండలం మంగళ్ పాడ్ గ్రామంలో లయన్స్ ఐ హాస్పిటల్ అలాగే లయన్స్ జనరల్ హాస్పిటల్ వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఒకే వేదిక పై గ్రామ పంచాయతి వద్ద 6 ప్రోగ్రాం లను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా కంటి పరీక్ష క్యాంపు,డయాబేటిక్ క్యాంపు,బీపీ,షుగర్ టెస్ట్ క్యాంపు,ఉచిత ఇసిజి పరీక్ష, ఉచిత మందుల పంపిణి చేశారు.పెద్దఎత్తున ఈ శిబిరా నికి గ్రామస్తులు విచ్చేసి సంబందించిన వైద్య పరీక్షలు చేయించుకున్నారు.ఈ శిబిరంలో 152 మందికి అన్ని రకాల వైద్య పరీక్షలు చేసి వారికీ ఉచితంగా మందులు పంపిణి చేసి వైద్యులు తగు జాగ్రత్తలు,సూచనలు చేశారు.ఇందులో 23 మంది కంటి పరీక్షలు చేసుకోగా వారికీ కట్రాక్టు గుర్తించి వారికీ ఉచిత శస్త్ర చికిత్స నిమి త్తం బోధన్ లయన్స్ కంటి హాస్పిటల్ కి రిఫర్ చేయడం జరిగింది అని లయన్స్ క్లబ్ ప్రతినిధులు తెలిపారు.అం తేకాకుండా మంగల్ పాడ్ గ్రామంలో బిల్లా రామ్మోహన్ పుట్టిన రోజు సందర్భంగా లయన్స్ క్లబ్ తరపున పండ్ల పంపిణి కార్యక్రమం నిర్వహించడం జరిగింది అని తెలి పారు.ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ప్రతినిధులు బిల్లా రామ్మోహన్ కు జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ చైర్మన్ కె.సూర్యనారాయ ణ,కో -చైర్మన్ చక్రపాణి,లయన్స్ క్లబ్ ఆఫ్ అచన్ పల్లి అధ్యక్షులు దుర్గారావు,కార్యదర్శి రమణ రెడ్డి,కోశాధి కారి కైలాష్,లయన్స్ క్లబ్ ఆఫ్ ఎడపల్లి ప్రెసిడెంట్ ఎన్. రాకేష్ వర్మ,సెక్రటరీ అరుణ్ కుమార్



గౌడ్,క్లబ్ డిసి. గంగారెడ్డి,పుష్పలత,మెర్సీ,ప్రకాష్,మనోజ్ కుమార్, స్థానిక సర్పంచ్ చేపూర్ వీణా శ్రీనివాస్ గౌడ్,బిల్లా రామ్మోహన్ కుమారులు,డ ాక్టర్.బిల్లా మణి దీప్, యువ నాయకులు బిల్లా మణి తేజ్,డాక్టర్.అరుణ్, అజయ్,కృష్ణ,ల్యాబ్ టెక్నీషియన్ మెహ్రాజ్,వైద్య సిబ్బం ది హనుమంత్ రావు పటేల్,సీమ,సఫురా,రఫీక్,తది తరులు పాల్గొన్నారు.

# రోటరీ ఇన్నర్ వీల్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ గా అనుపమ సుబేదార్ ఎన్నిక....

నిజామాబాద్,జూలై 29, ప్రజాగళం:రోటరీ ఇన్నర్ వీల్ క్లబ్ డిస్ట్రిక్ట్ 315 చైర్మన్ గా నిజామాబాద్ నగరానికి చెందిన అనుపమ సుబేదార్ ఎన్నిక అయ్యారు, ఇటీవల హైదరాబాద్ తాజ్ హోటల్ లో జరిగిన ఎన్నికల్లో మొత్తంగా35 తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర లకు సంబంధించిన ఇన్నర్ వీల్ క్లబ్ 22 క్లబ్ ల అధ్యక్షులు ఇతర 190 మంది కార్యవర్గ సభ్యులు ఈ ఎన్నికలో పాల్గొనగా , ప్రమాణ స్వీకార కార్యక్రమం హైదరాబాద్ క్లబ్ ప్రధినిధులు సృజన,స్వందన ఆధ్వర్యంలో నిర్వహించగా క్లబ్ పద్మ శర్మ కన్వీనర్ గా కో కన్వీనర్ గా రమా దేవి ,ఉమ రాణి క్లబ్ అధ్యక్షులు లక్ష్మీ మాధవి లత లు బాధ్యతలు స్వీకరించారు ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఇన్నర్ వీల్ క్లబ్ చైర్మన్ అనుపమ సుబేదార్ మాట్లాడుతూ నాపైన నమ్మకం ఉంచి ఈ పదవి అప్పగించడానికి మరింత బాధ్యతను పెంచిందని ప్రజల్లో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ ముఖ్యంగా మహిళ సాధికార సాధించడం, ఆడపిల్లల విద్య పై ప్రత్యేక దృష్టి సాధించి ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని తెలిపారు



అనుపమసుబేదారి నియామకం పట్ల నిజామాబాద్ ఇన్నర్ మిల్క్ క్లబ్ అధ్యక్షురాలు సులక్షణ కార్యదర్శి ప్రసన్న పిడిసి శైలజ , స్వరూప రెడ్డి సౌందర్య రోటరీ క్లబ్ ప్రతినిధులు అభినందనలు తెలిపారు

# అప్పుడు వద్దు... ఇప్పుడు ముద్దా..?

కడప, : షిరిడి సాయి ఎలక్ట్రికల్స్ అనే కంపెనీ పేరు వింటే తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు జగన్ గుర్తుకు వస్తారు. వైఎస్ఆర్‌సీపీ హయాంలో ఈ కంపెనీకి ఏపీలో అగ్ర తాంబూలం దక్కింది. పవర్ రంగానికి చెందిన కాంట్రాక్టులు, ట్రాన్స్ ఫార్మర్ల సరఫరా చేసే కాంట్రాక్టులు అన్నీ ఈ కంపెనీకే దక్కేవి. టీడీపీ నేతలు కూడా తీవ్రంగా ఆరోపణలు చేసేవారు. టీడీపీ రాగానే ఆ కంపెనీ అక్రమాలన్నీ బయటకు తీస్తారని అనుకున్నారు. కానీ ఆ కంపెనీకి టీడీపీ ప్రభుత్వంలోనూ ప్రాధాన్యత లభిస్తోంది. తాజాగా వంద కోట్లకుపైగా స్టాంప్ డ్యూటీని మినహాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం షిరిడీసాయి ఎలక్ట్రికల్స్ అనుబంధ సంస్థ అయిన సూర్యచక్ర డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కు భారీ స్టాంప్ డ్యూటీ మినహాయింపు ఇచ్చింది.

ఈ మినహాయింపు మొత్తం రూ. 104.51 కోట్లు. ఈ మేరకు జీవోలు జారీ అయింది. షిరిడీసాయి ఎలక్ట్రికల్స్ ఇప్పటికే శ్రీసిటీ లో రూ. 3,000 కోట్లకు పైగా పెట్టుబడి పెట్టి సోలార్ ప్యానల్స్ ఫ్యాక్టరీ పెట్టాలనుకుంటోంది. ఇప్పుడు కంపెనీ తన అనుబంధ సంస్థ సూర్యచక్ర డెవలపర్స్ ద్వారా కొత్తగా మరో రూ. 2,000 కోట్ల పెట్టుబడి పెడతామని మినహాయింపులు కోరింది. ప్రభుత్వం డిసెంబర్ 2025లో జారీ చేసిన ఉూ ఓబ. ఔసీ. 9 ప్రకారం.. 5,000 ఎకరాలకు పైగా కాకుండా కొనుగోలు చేసే భూమికి 100 శాతం స్టాంప్ డ్యూటీ మినహాయింపు ఇస్తున్నారు. సూర్యచక్ర డెవలపర్స్ కొనుగోలు చేసిన భూమి విలువ రూ. 1,045 కోట్లు కాగా, దానిపై వచ్చే స్టాంప్ డ్యూటీ పూర్తిగా మాఫీ చేశారు. దీని వల్ల ఆ కంపెనీకి రూ. 105 కోట్ల లాభం ఉంటుంది. షిరిడీసాయికి ఇది మొదటిసారి కాదు.

గతంలోనూ 2021?23 మధ్య అంటే జగన్ హయాంలోనూ ఈ కంపెనీకి సుమారు రూ. 200 కోట్లకు పైగా స్టాంప్ డ్యూటీ, ల్యాండ్ కన్వర్షన్ ఛార్జీలు మాఫీ చేశారు. మొత్తం మీద ఈ కంపెనీకి ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ. 300 కోట్లకు పైగా ప్రోత్సాహకాలు వచ్చాయి.టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత షిరిడి సాయి ఎలక్ట్రికల్స్ కు 8,365 ఎకరాల భూమి కేటాయించారు. పదేళ్ల కిందట షిరిడి సాయి ఎలక్ట్రికల్స్ ట్రాన్స్ ఫార్మర్లు తయారు చేసే కంపెనీ. తర్వాత భారీ విద్యుత్ కంపెనీగా మారింది. విద్యుత్ ప్రాజెక్టులు, పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులు కడతామని ఒప్పందాలు చేసుకుంది. ఈ కంపెనీ నర్రెడ్డి విశ్వేశ్వర్ రెడ్డి అనే వ్యక్తికి చెందినది.

రామయపట్నం వద్ద సోలార్ ప్లేట్లు తయారు చేస్తామంటూ ఓ కంపెనీ షిరిడి సాయి ఎలక్ట్రికల్స్ ఇండో సోల్ పేరుతో ప్రారంభించింది. పది లక్షల అథరైజ్డ్ క్యాపిటల్‌తో ప్రారంభమైన ఈ కంపెనీ పెద్ద ఎత్తున భూముల్ని తీసుకుంది. వైసీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు షిరిడిసాయి ఎలక్ట్రికల్స్‌కు కడప నగరానికి ఆనుకుని ఉన్న ఐటీ సెజ్ భూములు.కానీ డీ నోటిఫై చేసి 49.8 ఎకరాలను కేటాయించారు. సోమశిల వద్ద కూడా షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ సోమశిల వద్ద 900 మెగావాట్ల ప్రాజెక్టులకు అనుమతి ఇచ్చింది. అల్లూరి సీతారామరాజుజిల్లా ఎర్రవరం వద్ద 1200 మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టును షిరిడి సాయి సంస్థకు ప్రభుత్వం నామినేషన్ పద్దతిలో జగన్ ప్రభుత్వం కేటాయించింది. ఇది చట్ట విరుద్ధమని టీడీపీ ఆరోపించింది.ఈ కంపెనీ తీరుపై పవన్ కల్యాణ్ విచారణకు కూడా ఆదేశించారు. శేషాచలం వైల్డ్ లైఫ్ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోని భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడుతోందని ఫిర్యాదులు ఉన్నాయి. తమ హయాంలో తమ బినామీ అని ప్రచారం చేసినా.. ఇప్పుడు ఆ సంస్థకు పెద్ద ఎత్తున భూములు, రాయితీలు కల్పించడాన్ని వైసీపీ కూడా ప్రశ్నించడం లేదు. ఆ సంస్థకు మద్దతుగానే వైసీపీఉంది. అంటే.. రెండు పార్టీలకూ షిరిడిసాయి దగ్గర సంస్థ అని అర్ధమవుతోంది. కానీ ఆరోపణలు చేసిన టీడీపీ ప్రజలకు సమాధానం చెప్పాల్సి ఉంటుందన్న అభిప్రాయం వినిపిస్తోంది.

# భారీగా పెరిగిన ఫారెక్స్ నిల్వలు

ముంబై: మనరూపాయి విలువ కొన్ని రోజులుగా ఆల్‌టైమ్ కనిష్టస్థాయి పడిపోయింది. 90 మార్కును తాకింది. దీంతో మన ఎగుమతులపై ప్రభావం పడుతోంది. అయితే ఇదే సమయంలో మన ఫారెక్స్ నిల్వలు పెరిగాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకారం, డిసెంబర్ 5తో పూర్తయిన వారంలో విదేశీ మారక నిల్వలు 1.033 బిలియన్ డాలర్ల వృద్ధితో 687.26 బిలియన్ డాలర్లకు చేరాయి. ముఖ్య కారణం బంగారం నిల్వలు 1.19 బిలియన్ డాలర్లు కలుపుకుని 106.98 బిలియన్ డాలర్లకు చేరాయి. అయితే, ప్రధాన భాగమైన విదేశీ కరెన్సీ ఆస్తులు 151 మిలియన్ డాలర్లు క్షీణించి 556.88 బిలియన్ డాలర్లకు తగ్గాయి.

# కాపు సామాజికవర్గం కోసం..

ఏలూరు, : 2024 ఎన్నికల్లో వైసీపీ ఎందుకు పరాజయం పాలైందనే ప్రశ్నకు ఆ పార్టీ నేతలు, అనుచరులు వివిధ కారణాలు చెబుతున్నారు. కొందరు ఈవీఎంలు కారణమంటూ వ్యాఖ్యానించగా, మరికొందరు కూటమి పార్టీల ఐక్యత వల్ల ఓటమి వచ్చిందని అంటున్నారు. ఇంకొందరు సరైన ప్రచారం చేయలేకపోయామని స్వయంగా ఒప్పుకుంటున్నారు. బలమైన మీడియా ప్రభావం, చంద్రబాబు రాజకీయ వ్యూహాలే కారణమని విమర్శించే వర్గం కూడా ఉంది. ఇవన్నీ కొంతవరకు నిజమే కావచ్చు. కానీ అంతకంటే లోతైన సామాజిక, రాజకీయ అంశాలు కూడా ఈ ఓటమికి కారణమయ్యాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సామాజిక వర్గాల ప్రభావం ఎప్పటినుంచో కీలకం. ముఖ్యంగా గోదావరి జిల్లాలు రాష్ట్ర రాజకీయ దిశను నిర్ణయించే స్థాయిలో ఉంటాయి. 2024 ఎన్నికల్లో అదే జరిగింది. ఈ ప్రాంతంలో బలమైన కాపు సామాజిక వర్గం ఈసారి వైసీపీకి వ్యతిరేకంగా నిలిచింది. వారు పెద్ద ఎత్తున జనసేన వైపు మొగ్గు చూపారు. దీనికి ప్రధానంగా పవన్ కళ్యాణ్ ఆకర్షణ ఒక కారణంగా చెబుతున్నారు. అయితే వైసీపీ నేతలు అవసరానికి మించి పవన్‌పై విమర్శలు చేయడం వల్ల న్యూట్రల్ ఓటర్లు కూడా దూరమయ్యారని రాజకీయ వర్గాల్లో చర్చ జరిగింది. దాని ఫలితంగా ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో వైసీపీకి ఒక్క ఎమ్మెల్యే లేదా ఎంపీ సీటు కూడా దక్కలేదు.చరిత్రను చూస్తే కాంగ్రెస్? టీడీపీ ( పోటీ ఉన్న రోజుల నుంచే గోదావరి ప్రాంతాల్లో టీడీపీకి బలమైన పట్టు ఉంది. అప్పట్లో కొంతవరకు కాంగ్రెస్‌కు కూడా ఆధారం ఉండేది. ఇప్పుడు జనసేన కలిసి రావడంతో ఈ రెండు పార్టీల కలయిక మరింత బలపడింది. యాభై శాతానికి మించిన ఓటు బ్యాంకుతో ఈ జిల్లాలు కూటమికి కంచుకోటలుగా మారాయని అంటున్నారు. ప్రభుత్వం ఏర్పడి దాదాపు 20 నెలలు గడిచినా, అక్కడ వైసీపీ గ్రాఫ్ ఆశించిన స్థాయిలో పెరగలేదన్న మాట వినిపిస్తోంది.

ఎన్నికల అనంతరం కాపు వర్గానికి చెందిన పలువురు కీలక నేతలు వైసీపీని వీడడం కూడా పార్టీకి దెబ్బగా మారింది. మాజీ ఉప ముఖ్య మంత్రి ఆళ్ల నాని టీడీపీలో చేరారు. భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పార్టీకి గుడ్‌బై చెప్పారు. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబుజనసేనలో చేరారు. ఇలాంటి పరిణామాలతో పార్టీ శ్రేణుల్లో అసంతృప్తి పెరిగిందని అంటున్నారు.ఇటీవల రామచంద్రాపురం కు చెందిన రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ ( పార్టీ మారతారన్న ప్రచారం ఊపందుకుంది. తన కుమారుడికి భవిష్యత్తులో టికెట్‌పై స్పష్టత లేకపోవడం, అలాగే వైసీపీలో గెలుపు అవకాశాలపై సందేహాలు కారణాలుగా చెబుతున్నారు. ఇదే సమయంలో వంగా గీత (, ముద్రగడ కుటుంబం వంటి నేతల విషయంలో కూడా పుకార్లు వినిపిస్తున్నాయి. గోదావరి జిల్లాల్లో కూటమి ఐక్యత బలంగా ఉండటంతో ఎదురీదడం కష్టమని భావిస్తున్న కొందరు నేతలు కొత్త దారులు వెతుకుతున్నారని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. రానున్న రోజుల్లో వైసీపీ ఈ పరిస్థితిని ఎలా మార్చుకుంటుందో చూడాల్సి ఉంది.

# పొల్యూషన్ రాజధానిగా హైదరాబాద్..?



హైదరాబాద్, : దేశరాజధాని ఢిల్లీ వాయు కాలుష్యానికి కేరాఫ్ అడ్రస్ గా మారింది. అక్కడున్న ప్రజలు.. వాయు కాలుష్యం బారిన పడి ఆరోగ్యాన్ని పోగొట్టుకుంటున్నారు. వీవీఐపీలు ఢిల్లీ వదిలి శివారు ప్రాంతాలకు మకాం మార్చేస్తున్నారు. అదే బాటలో ముంబై, చండీగఢ్ నడుస్తున్నాయి. అయితే వీటి బాటలోనే సౌత్ లో కీలక కేపిటల్ హైదరాబాద్ తయారైంది. హైదరాబాద్ లోని పలు ప్రాంతాల్లో కాలుష్యం ఎయిర్ పొల్యూషన్ ఇండెక్స్ నిర్దేశిత ప్రమాణాలను దాటేసింది.భాగ్యనగరం వాయు కాలుష్య కోరల్లో చిక్కుకుంటోంది. దేశ రాజధాని ఢిల్లీ, ముంబై వంటి నగరాలతో పోలిస్తే గాలి నాణ్యత మెరుగ్గా ఉన్నట్లు కనిపిస్తున్నప్పటికీ, దక్షిణాది రాష్ట్రాల మెట్రో నగరాలతో పోల్చితే హైదరాబాద్‌లోనే పరిస్థితి అత్యంత దారుణంగా ఉందని కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) వెల్లడించింది.హైదరాబాద్‌లో నిర్వహించిన 'ఎయిర్ పొల్యూషన్ ఇండెక్స్' సదస్సులో పీసీబీ విడుదల చేసిన గణాంకాలు నగరవాసులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిబంధనల ప్రకారం గాలిలో సూక్ష్మ ధూళికణాలు (ఖఓ-10) 40 మైక్రోగ్రాములు ఉండాలి. కానీ, హైదరాబాద్‌లో ఇది 82 నుంచి 88 ఎంజీల వరకు ఉంటోంది. అంటే ఉండాల్సిన దానికంటే రెట్టింపు కాలుష్యాన్ని మనం పీలుస్తున్నాం. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) పరిమితి 60 ఎంజీతో పోల్చినా, హైదరాబాద్‌లో 35 శాతం అధిక కాలుష్యం ఉన్నట్లు స్పష్టమైంది.గత ఏడాది పొడవునా నగరంలో ఒక్క రోజు కూడా 'స్వచ్ఛమైన గాలి' ఉన్నట్లు రికార్డు కాలేదు. గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) కేవలం 'మధ్యస్థం' లేదా 'సంతృప్తికరం' స్థాయిలకే పరిమితమైంది. ఈ ఏడాది జనవరిలో పీఎం-10 స్థాయి గరిష్ఠంగా 105 ఎంజీ వరకు వెళ్లడం నగర గాలిలో పెరుగుతున్న విషతుల్యతకు నిదర్శనం.నగరంలో వాహనాల రద్దీ పెరగడంతో ఏడు ప్రధాన ప్రాంతాలను 'కాలుష్య హాట్‌స్పాట్లు'గా అధికారులు గుర్తించారు. అవి ఖైరతాబాద్-కోఠి, జీడిమెట్ల, బీహెచ్ఈఎల్-అమీర్‌పేట, నాంపల్లి-చార్మినార్, మెహిదీపట్నం-హైటెక్‌సిటీ-కూకట్‌పల్లి, సికింద్రాబాద్-సైనిక్‌పురి, ఎల్‌బీనగర్-కోఠి. ఈ ప్రాంతాల్లో గాలి నాణ్యతను మెరుగుపరిచేందుకు ప్రత్యేక చర్యలు అవసరమని పీసీబీ స్పష్టం చేసిందివాయు కాలుష్యం పెరగడానికి కేవలం వాహనాలే కాకుండా, నగర శివార్లలో జరుగుతున్న నిర్మాణ పనులు, పరిశ్రమల ఉద్గారాలు కూడా ప్రధాన కారణమవుతున్నాయి. పీఎం-10 స్థాయి పెరగడం వల్ల శ్వాసకోశ వ్యాధులు, ఊపిరితిత్తుల సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

# యాంటీ బయోటిక్స్ అవసరానికి మించితే ఆరోగ్యముప్పు..!

జలుబు.. దగ్గు.. జ్వరాలు.. ఇలా అన్నింటికీ అవసరం ఉన్నా.. లేకపోయినా యాంటీ బయోటిక్స్ వాడడం మంచిది కాదు. సాధారణంగా తగ్గిపోయే వాటికి కూడా మందులు వాడేస్తుండటంతో శరీరం రోగ నిరోధక శక్తిని కోల్పోయి జీవచ్ఛవంలా మారుతోంది. అధిక ఉత్పత్తి కోసం కోళ్లు, చేపలు, రొయ్యలు పెంపకంలో యాంటీ బయోటిక్స్‌ను అధికంగా వినియోగిస్తున్నారు. వీటిని ఆహారంలోకి తీసుకున్నప్పుడు యాంటీబయోటిక్స్ కూడా మన శరీరంలోకి చేరుతున్నాయి. ప్రజారోగ్యం బాగుపడాలన్నా, శరీర రోగాలను తట్టుకుని, ఎదుర్కొనే సామర్థ్యం ఉండాలన్నా యాంటీబయాటిక్స్ వాడకం తగ్గించాలి. యాంటీబయోటిక్స్ రెసిస్టెన్స్ ప్రపంచంలో ఆరోగ్యానికి పెరుగుతున్న పెను ముప్పుగా గుర్తించాలి. దశాబ్దాలుగా యాంటీమైక్రోబయల్ రెసిస్టెన్స్ (ఎఎంఆర్) ప్రపంచ ఆరోగ్యానికి గణనీయమైన ముప్పుగా ఉంది. యాంటీబయాటిక్స్ అనేవి ప్రాణాధార మందులు. అవి ఇన్ఫెక్షన్ కల్గజేసే సూక్ష్మజీవులపై పనిచేస్తేనే ప్రాణాలను కాపాడతాయి. వైద్యచికిత్సలో ఔషధాలు మోతాదు మించి వాడితే అనర్థాలు చోటుచేసుకుంటాయి. యాంటీబయాటిక్ వాళ్లకు తోచిన విధంగా ఉపయోగించడం వల్ల సూక్ష్మక్రిములు నిరోధకతను పెంచుకుని ప్రాణాంతకంగా మారుతుంటాయి. యాంటీబయాటిక్ మందులు వేసినా కూడా సూక్ష్మజీవులు చనిపోవడానికి బదులు ఇంకా పెరుగుతూనే ఉండే పరిస్థితిని ఎఎంఆర్‌గా చెబుతాం. ఎంఆర్‌కి రాజధానిగా మనదేశం ఉందంటే ఆశ్చర్యం కలుగకమానదు.

2019లో ప్రపంచవ్యాప్తంగా 5 మిలియన్లు, మనదేశంలో పది లక్షల మంది వరకూ చనిపోయారు. రోజుకు 3500 మంది మరణిస్తున్నారనేది అంచనా. 2025 నుంచి 2050 నాటికి 40 మిలియన్ల మరణాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. 2050 తర్వాత ఏడాదికి 1.91 మిలియన్ మంది చనిపోయే ప్రమాదం ఉంది. యాంటీబయాటిక్స్ మన ఆరోగ్యానికి అత్యంత ప్రమాదంగా మారుతున్నాయి. కరోనా తర్వాత పరిణామాల్లో ప్రస్తుత సమాజంలో వీటి వినియోగం విపరీతంగా పెరిగింది. జలుబు, దగ్గు, జ్వరం వంటి చిన్న అనారోగ్య సమస్యలకు కూడా వీటిని ఉపయోగిస్తున్నారు. సాధారణంగా వ్యాధికారక బాక్టీరియా, వైరస్‌లు మొదలైన వాటి వల్ల కలిగే వ్యాధుల చికిత్సకు యాంటీబయాటిక్స్



ఉపయోగిస్తారు. 'సూపర్ బగ్స్' యాంటీబయాటిక్స్‌ను నిరోధిస్తాయి. యాంటీ బయాటిక్స్ ఎక్కువగా, అనవసరంగా తీసుకునే వ్యక్తుల శరీరంలో ఈ రకమైన సూపర్‌బగ్స్ కనిపిస్తాయి. ఎందుకంటే శరీరం నిరంతరం యాంటీబయాటిక్స్‌కు గురైనప్పుడు, మన శరీరం క్రమంగా దానితో పోరాడటానికి ఒక రక్షణ యంత్రాంగాన్ని అవలంబిస్తుంది. దీంతో ఎంత యాంటీబయాటిక్స్ వాడినా శరీరం వాటికి సరిగా పనిచేయదు. గ్రామీణ ప్రాంతాల్లో యాంటీబయోటిక్స్ వినియోగం అనేక అనారోగ్య సమస్యలకు, ఆరోగ్య ప్రమాదాలకు కారణంగా మారుతోంది. సరైన ప్రిస్క్రిప్షన్ లేకుండా యాంటీబయాటిక్స్ కొనుగోలు చేసి, వాటిని ఉపయోగిస్తుండటంతో దుష్పరిణామాలు వస్తున్నాయి. యాంటీబయోటిక్స్ డోసు తెలియకుండా చిన్న అనారోగ్యాలకు సైతం చాలా ఎక్కువగా వాడేస్తుండటం ఏమాత్రం సరికాదు. ఇది కూడా వారిలో రెసిస్టెన్స్‌కు కారణమౌతోంది. దీనివల్ల భవిష్యత్తులో యాంటీబయాటిక్స్ ఉపయోగిస్తే పనిచేయని పరిస్థితి (ఎఎంఆర్) చోటు చేసుకుంటుంది. మనకు తెలియకుండానే శరీరంలో వివిధ సైడ్ ఎఫెక్ట్స్‌కు కారణమవుతున్నాయి.

**మితిమీరితే ప్రజారోగ్యానికీ ప్రమాదం:**

యాంటీమైక్రోబయాల్ రెసిస్టెన్స్ అనేది సహజమైన అంశం. మానవులు, జంతువులు, మొక్కల్లో యాంటీబయాటిక్స్ మితిమీరిన వినియోగం, దుర్వినియోగం సమస్యను మరింత తీవ్రతరం చేసింది. వినియోగం వల్ల వచ్చే సమస్యలను క్లిష్టంగా మారిన తర్వాత పరిష్కరించడం కష్టమవుతుంది.

యాంటీబయాటిక్ మందులు వేసినా కూడా సూక్ష్మజీవులు చనిపోవడానికి బదులు ఇంకా పెరుగుతూనే ఉండే పరిస్థితి (ఎఎంఆర్) ఉంటుంది. వైద్యులు సరైన యాంటీబయాటిక్, సరైన డోసులో,సరైన కాలం పాటు, సరైన సమయంలో ఇవ్వాలి. వీలైనంత తక్కువకాలం పాటు యాంటీబయాటిక్స్ వాడడమే సరైన వ్యూహం. ఇన్ఫెక్షన్లకు సరైన చికిత్స చేయడం వల్ల యాంటీబయాటిక్స్ వల్ల కలిగే దుష్ప్రభావాలు తగ్గుతాయి, యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్ రాదు. మల్టీ డ్రగ్ రెసిస్టెన్స్, ప్యాన్ డ్రగ్ రెసిస్టెన్స్, ఎక్స్‌డెంటెడ్ రెసిస్టెన్స్ వల్ల ఎక్కువ మరణాలు సంభవిస్తాయి.

**దుష్పరిణామాలు అనేకం:** కొన్ని రకాల యాంటీబయాటిక్స్ సైడ్ ఎఫెక్ట్స్ కారణమవుతాయి. వాంతులు, విరోచనాలు, వికారం, ఎలర్జీ వంటి ఇతర సమస్యలకు కూడా కారణమవుతాయి. ఇక అవసరం లేనప్పుడు యాంటీబయాటిక్స్ వాడడం అనవసరమైన ఆరోగ్య సమస్యలకు కారణమవుతుంది. నిజంగా అవసరమైనప్పుడు సరిగ్గా పనిచేయని పరిస్థితి వస్తుంది. ఇది అనవసరమైన వైద్య ఖర్చులకు కారణంగా మారుతుంది.

**అవగాహన ముఖ్యం:**


గ్రామీణ ప్రాంతాల్లో యాంటీబయాటిక్స్ వాడకంపై ప్రజలను చైతన్యవంతుల్ని చేయాలి. ఆయా ప్రాంతాల్లో వైద్య సేవలను మెరుగుపరిచి, మెడికల్ షాపుల్లో నేరుగా మందులు ఇచ్చే విధానాన్ని అరికట్టాలి. వైద్య సలహా లేకుండా యాంటీబయాటిక్స్ వాడకుండా నిరోధించేలా చర్యలు తీసుకోవాలి.

**శృతిమించితే ప్రమాదం:**

మందులు సమర్థంగా ఇన్ఫెక్షన్లను నియంత్రించలేకపోతే ప్రాణాధార చికిత్సలైన కేన్సర్ చికిత్స,అవయవ మార్పిడి లాంటి వాటిపై ఎఎంఆర్ ప్రభావం చూపుతుంది. చెప్పిన డోస్ కంటే తక్కువ కాలం వాడడం,లేదా తగిన డోసేజిలో వాడకపోవడం ఒక వ్యాధికి సరిపడని మందు వాడడం లాంటివే. వైద్యులుచెప్పినట్లే వీటిని వాడాలి. వేరేవారికి రాసిన మందులు వాడితే నయమైపోతుందని అనుకోకూడదు. ఆయా వ్యక్తులు ఆరోగ్యరీత్యా తగిన మందులను సరైన డోసులోనే తీసుకోవాలి. మన దేశంలో నేరుగా దుకాణాలకు వెళ్లి ఏదిపడితే ఆ యాంటీబయాటిక్ కొనుక్కునే అవకాశంఉండడం కూడా వీటి దుర్వినియోగానికి కారణం అవుతోంది. కొత్త యాంటీబయాటిక్స్ తయారీ చాలా సమస్యాత్మకం. ఖర్చుతో కూడుకున్నది. మార్కెట్లోకి రావడానికి చాలా సమయం పడుతుంది. దీనివల్ల కొత్త రకాల యాంటీబయాటిక్స్ తగ్గుతున్నాయి. అందుకని ఉన్నవాటినే జాగ్రత్తగా కాపాడుకోవాలి. చాలావరకు టీకాలు బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లను నిరోధిస్తాయి ఎఎంఆర్ సమస్య పరిష్కారానికి పిల్లలు, పెద్దలు, వృద్ధులు టీకాలు తీసుకోవడం చాలా ముఖ్యం. ఎవరికైనా ఇన్ఫెక్షన్ రాకపోతే యాంటీ బయాటిక్స్ వాడాల్సిన అవసరమే ఉండదు.


## జననాల రేటు తగ్గడానికి స్మార్ట్ ఫోన్‌లూ కారణమే..

# పలు అధ్యయనాల్లో వెల్లడి..!



ప్రపంచవ్యాప్తంగా జనాభా పెరుగుదల తీరు మందగించింది. మూడు దశాబ్దాల క్రితం భారత్ లో ఒక మహిళ సగటున 3.4 మంది పిల్లలకు జన్మనిచ్చేది. కానీ ఇప్పుడు ఆ సంఖ్య 2.0 కి పడిపోయింది. ఇది జనాభా స్థిరంగా ఉండటానికి అవసరమైన 2.1 కంటే తక్కువ. అయితే ఈ ధోరణి కేవలం భారతదేశానికే పరిమితం కాలేదు. ప్రపంచవ్యాప్తంగా చాలాదేశాల్లో జననాల రేటు తీవ్రంగా పడిపోతున్నది. కొన్ని దేశాల్లో అయితే మహిళలు సగటున ఒక్క బిడ్డకు కూడా జన్మనివ్వడం లేదు. పెరుగుతున్న జీవన వ్యయం, ఖరీదైన గృహ వసతి, ఆలస్యంగా పెళ్లిళ్లు చేసుకోవడం, కెరీర్‌పై ఒత్తిడి, మారుతున్న సామాజిక పోకడలు లాంటివే సంతానలేమికి కారణాలని ఇప్పటివరకు అంతా భావించారు. కానీ ఇటీవలి కాలంలో పరిశోధకులు మరో కొత్త కోణాన్ని వెలుగులోకి తెచ్చారు. అదే స్మార్ట్‌ఫోన్లు, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల ప్రభావం..! స్మార్ట్‌ఫోన్‌లు, కంప్యూటర్‌లు, టాబ్‌లు మొదలైన టెక్నాలజీ మానవ సంబంధాలను మార్చిపారేస్తున్నది. ఈ మార్పే పిల్లల్ని కనే వారి సంఖ్య తగ్గడానికి కారణమవుతున్నదని అనేక అధ్యయనాలు సూచిస్తున్నాయి. సిన్సినాటి విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకులు నాథన్ హడ్సన్, హెర్నాన్ మోస్కోసో-బోడో ఇటీవల అమెరికా, బ్రిటన్‌లలో 4జీ మొబైల్ ఇంటర్నెట్ రాకకు, జననాల రేటుకు మధ్య ఉన్న సంబంధంపై అధ్యయనం చేశారు. హై-స్పీడ్ మొబైల్ కనెక్టివిటీ ముందుగా వచ్చిన ప్రాంతాల్లో జననాల రేటు వేగంగా తగ్గినట్టు వారి పరిశోధనలో తేలింది. స్మార్ట్‌ఫోన్లు యువత ఒకరితో ఒకరు గడిపే విధానాన్ని ప్రాథమికంగా మార్చేశాయని, ముఖాముఖిగా కలుసుకోవడం తగ్గి, ఆన్‌లైన్‌లో ఎక్కువ సమయం గడపడంవల్ల సంతానోత్పత్తిపై ప్రభావం పడి ఉండవచ్చని వారు విశ్లేషించారు. ఫైనాన్షియల్ టైమ్స్ విశ్లేషణ ప్రకారం కూడా అనేక దేశాల్లో స్మార్ట్‌ఫోన్‌ల వాడకం విస్తృతమైన తర్వాతే జననాలరేటు గణనీయంగా క్షీణించడం ప్రారంభమైంది. ముఖ్యంగా అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో 2007 తర్వాత ఈ మార్పు స్పష్టంగా కనిపించింది. స్మార్ట్‌ఫోన్లను ఎక్కువగా వినియోగించే యువతలో ఈ తగ్గుదల మరింత ఎక్కువగా ఉంది. ఫిన్లాండ్‌కు చెందిన జనాభా నిపుణురాలు అన్నా రోట్‌కిర్చ్ ప్రకారం.. యువతలో సోషల్ మీడియా వాడకం పెరగడంవల్ల జంటల మధ్య లైంగిక సమస్యలు కూడా పెరుగుతున్నాయని తెలుస్తోంది. సోషల్ మీడియాలో కనిపించే ఆడంబరమైన జీవనశైలి, ఆర్థికపరమైన ఆందోళనలు, ఇతరులతో పోల్చుకోవడం వంటివి యువతలో అభద్రతా భావాన్ని, అస్థిరతను పెంచుతున్నాయని, దీనివల్ల వారు పిల్లల్ని కనేందుకు సిద్ధపడటం లేదని ఆమె వాదిస్తున్నారు. గతంలో టీవీ సీరియళ్లలో చిన్న కుటుంబాలను చూసి మహిళలు తక్కువ మంది పిల్లల్ని కన్నట్టు కొన్ని అధ్యయనాలు తెలిపాయి. ఇప్పుడు టీవీ కంటే ఎన్నో రెట్లు ప్రభావవంతమైన స్మార్ట్‌ఫోన్లు ఈ మార్పును మరింత వేగవంతం చేస్తున్నాయని నిపుణులు భావిస్తున్నారు.

# కిడ్నీలను కాపాడుకుందాం




2026లో వాతావరణం.. సాధారణం కంటే అధిక వేడిగా ఉంటుందని భారత వాతావరణ శాఖ అంచనా వేస్తున్నది. ఈ క్రమంలో వడగాలుల ప్రభావం కూడా ఎక్కువే ఉండనున్నది. అయితే, వేడి గాలులు కిడ్నీల ఆరోగ్యాన్ని దెబ్బతీయస్తాయని ఆరోగ్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ నెఫ్రాలజీ పరిశోధకులు.. 2023లో ప్రపంచవ్యాప్తంగా 78.8 కోట్ల మంది దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధులతో బాధపడుతున్నారని తేల్చింది. మన దేశం విషయానికి వస్తే.. 13.8 కోట్ల మందిలో కిడ్నీ సమస్యలు ఉన్నాయట. ఈ క్రమంలో హీట్ స్ట్రోక్, డీహైడ్రేషన్.. మూత్రపిండాల ఆరోగ్యాన్ని మరింత దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం అవుతున్నది. మన శరీరంలో కిడ్నీలు చాలా కీలకమైన పనులు నిర్వహిస్తాయి. రక్తాన్ని శుద్ధి చేయడమే కాకుండా, శరీర సమతుల్యతను కాపాడతాయి. రక్తం నుంచి వ్యర్థ పదార్థాలను బయటికి పంపిస్తాయి. శరీరంలో నీటి శాతాన్ని క్రమబద్ధీకరిస్తాయి. రక్తపోటు నియంత్రణ, ఎముకల ఆరోగ్యం, ఎర్రరక్త కణాల ఉత్పత్తిలోనూ కీలక పాత్ర పోషిస్తాయి. అయితే, తీవ్రమైన వేడి.. సున్నితమైన కిడ్నీల వ్యవస్థను గందరగోళంలోకి నెట్టేస్తుంది. ఫలితంగా, మూత్రపిండాల పనితీరు మందగించి.. ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుంది. ఇటీవలి కొన్ని అధ్యయనాలు బహిరంగ కార్మికులలో అధిక శాతం మంది దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించాయి. ఎక్కువ సమయంపాటు వేడికి గురవ్వడం, ఒత్తిడితోపాటు రీహైడ్రేషన్ లేకపోవడమే వారిలో కిడ్నీల సమస్యకు కారణమని నిపుణులు వెల్లడించారు. కాబట్టి, ఎండలు ముదరక ముందే.. కిడ్నీలను కాపాడుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సలహా ఇస్తున్నారు.

దాహం వేసినప్పుడే కాకుండా.. సమయానుకూలంగా నీళ్లు తాగాలి. అప్పుడే శరీరం హైడ్రేటెడ్‌గా ఉంటుంది. బహిరంగ ప్రదేశాల్లో పనులు చేసేవాళ్లు.. ఉప్పు కలిపిన మజ్జిగ, నిమ్మకాయ షర్బత్, ఓరల్ రీహైడ్రేషన్ సాల్ట్స్ వంటివి ఎక్కువగా తీసుకోవాలి. శరీరం కోల్పోయిన లవణాలను భర్తీ చేయడానికి ఇవి అద్భుతంగా పనిచేస్తాయి. నీటి శాతం అధికంగా ఉండే ఆహార ఉత్పత్తులను తీసుకోవాలి. పుచ్చకాయ, కర్బూజా, ద్రాక్ష, దోసకాయ, సొరకాయ వంటివి ఎక్కువగా తినాలి. వేడి ఎక్కువగా ఉన్నప్పుడు అధిక ప్రొటీన్ కలిగిన భోజనాన్ని నివారించాలి.

ఎందుకంటే.. ప్రొటీన్ శరీరంలోనీటి నష్టాన్నిపెంచుతుంది. మూత్రపిండాలను మరింత ఒత్తిడికి గురి చేస్తుంది. టీ/కాఫీలతోపాటు ఆల్కహాల్ తీసుకోవడం తగ్గించాలి. శరీరం వేడెక్కినట్లు అనిపిస్తే.. పాదాలను చల్లటి నీటిలో ముంచాలి. దీనివల్ల కోర్ ఉష్ణోగ్రత వేగంగా తగ్గుతుంది. వాతావరణం మారుతున్న కొద్దీ.. ఆరోగ్య వ్యూహాలను కూడా మార్చాలి. అప్పుడే మూత్రపిండాలు క్షేమంగా ఉంటాయి.

# సీఎంలతోనే హోం-శాఖలు

హైదరాబాద్, : ఈ దేశంలో కొత్త ట్రెండ్ పాలనలో సాగుతోంది. ముఖ్యమం త్రులే హోం వంటి పవర్ ఫుల్ శాఖలను స్వయంగా చూస్తున్నారు. నిజానికి రాష్ట్రాలలో కానీ కేంద్రంలో కానీ కీలకమైన శాఖగా నంబర్ టూగా హోం శాఖ ఉంటుంది. లా అండ్ ఆర్డర్ తో ముడి పడి ఉన్న ఈ శాఖ ఎంతో ఇంపార్టెంట్ గా ఉంటుంది. రాజకీయంగా కూడా ఈ శాఖకు ఉన్న గ్లామర్ వేరుగా ఉంటుంది. ఒక విధంగా చెప్పాలీ అంటే హోం మంత్రి అంటే వెయిటింగ్ చీఫ్ మినిస్టర్ అని గతంలో చెప్పుకునే వారు. సీనియర్ మోస్ట్ లీడర్ కి ఈ శాఖ కట్టబెట్టేవారు. అయితే మారిన ట్రెండ్ లో చూస్తే ముఖ్యమంత్రులే ఇంతటి బరువైన శాఖను చూస్తున్నారు. తామే ఆ భారాన్ని మోస్తున్నారు. ముందే చెప్పినట్లుగా లా అండ్ ఆర్డర్ ఇపుడు రాజకీయాలను ప్రభుత్వాల తలరాతను శాసిస్తోంది. దాంతో పాటు ప్రభుత్వంలో నంబర్ టూ గా వేరెవరికో చాన్స్ ఇచ్చి తలనొప్పులు తెచ్చుకోవడం ఎందుకు అదేదో వన్ టూ రెండూ తామే ఉండాలన్న ఆలోచన కూడా ఇటీవల కాలంలో ఎక్కువగా వస్తోంది. అందులే దేశంలో సగం రాష్ట్రాలలో ముఖ్యమంత్రులే హోం మంత్రులుగా ఉంటున్నారు. దళపతిగా వెండి తెరను ఏలిన విజయ్ ముఖ్యమంత్రి అయ్యాక కీలక శాఖలను మంత్రులకు కేటాయించారు. ఆయనతో పాటు తొమ్మిది మంది మాత్రమే ఈ నెల 10న ప్రమాణం చేశారు. వారందరికీ తాజాగా ఆయన శాఖలు ప్రకటించారు. అందులో కీలకమైన హోం శాఖను విజయ్ తన వద్దనే ఉంచుకోవడం విశేషం. దాంతో ఆయన హోం, పోలీస్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ శాఖల ప్రత్యక్ష బాధ్యతలను స్వయంగా నిర్వహించనున్నారు. ఒక విధంగా ముఖ్యమంత్రిగా బాధ్యలతో పాటు హోం శాఖ కూడా కీలకమే కానీ విజయ్ మాత్రం ప్రతిష్టగా తీసుకుని తమిళనాడులో లా అండ్ ఆర్డర్ కి తానే పూర్తి బాధ్యత వహించాలని అనుకుంటున్నారు. : ఇక తెలంగాణా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అయితే మొదటి నుంచి తన వద్దనే హోం శాఖను ఉంచుకున్నారు. తెలంగాణా కాంగ్రెస్ లో ఎంతో మంది సీనియర్లు ఉన్నారు. కానీ ముఖ్యమంత్రి ప్రత్యేక ఆసక్తితో శ్రద్ధతో ఈ శాఖను రెండున్నరేళ్ళుగా చూస్తున్నారు. ఆయన స్వయంగా హోం శాఖను నిర్వహిస్తూ రాష్ట్రంలోని శాంతిభద్రతలు సాధారణ పరిపాలన విభాగాలను పర్యవేక్షిస్తున్నారు. అలా గట్టి హోం మంత్రిగానే పేరు తెచ్చుకున్నారు. ఇక మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ మహారాష్ట్ర హోం మంత్రిగానూ కొనసాగుతున్నారు. ఆయన ముఖ్యమంత్రిగా తన విధులతో పాటు ఈ పదవిని కూడా నిర్వహిస్తున్నారు. ఒక చాలెంజ్ గా ఆయన స్టేట్ లో లా అండ్ ఆర్డర్ ని నడిపిస్తున్నారుమమతా బెనర్జీని దించేసి పశ్చిమ బెంగాల్ కి తొమ్మిదవ ముఖ్యమంత్రిగా తాజాగా ప్రమాణం చేసిన సువేందు అధికారి హోం మంత్రిగా కూడా వ్యవహరిస్తున్నారు. ఆయన రాష్ట్ర హోం కొండ ప్రాంతాల వ్యవహారాల విభాగ శాఖలను చూస్తున్నారు. బెంగాల్ లో లా అండ్ ఆర్డర్ కత్తి మీద సాము లాంటిది. దాంతో పాటు ఢీ అంటే ఢీ గా రాజకీయం సాగుతుంది. దాంతో సువేందు అధికారి ఈ అతి ముఖ్య బాధ్యతలను తానే భుజాల మీద వేసుకున్నారు. మంత్రి షేర్ చేసిన క్రేజీ వీడియో వైరల్ ఇక దక్షిణాన కేరళం రాష్ట్రానికి నిన్నటిదాకా ముఖ్యమంత్రిగా పనిచేసిన పినరయి విజయన్ మొదటి రెండవ ఎల్‌డిఎఫ్ ప్రభుత్వాలు రెండింటిలోనూ హోం మంత్రిగా తానే పనిచేశారు. ఆయన హోం శాఖతో పాటు సాధారణ పరిపాలన, నిఘా సమాచార సాంకేతిక శాఖలను కూడా తన వద్దే ఉంచుకుని రాష్ట్రాన్ని ముందుకు నడిపారు. ఇదే తీరున చూస్తే మధ్యప్రదేశ్‌కు ప్రత్యేకంగా హోం మంత్రి ఎవరూ లేరు. ముఖ్యమంత్రి డాక్టర్ మోహన్ యాదవ్ స్వయంగా హోం శాఖను నిర్వహిస్తూ వస్తున్నారు. అలాగే ఉత్తర ప్రదేశ్‌కు ప్రత్యేకంగా హోం మంత్రిని తీసుకోలేదు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్వయంగా హోం శాఖను నిర్వహిస్తున్నారు. వీరంతా అదే దారిలో : అంతే కాదు పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ ప్రస్తుతం హోం వ్యవహారాలు న్యాయ శాఖలను నిర్వహిస్తున్నారు. ఆయన మార్చి 2022 లో మంత్రివర్గాన్నిఏర్పాటు చేసినప్పటి నుంచి హోం మంత్రిత్వ శాఖ తన వద్దనే ఉంచుకున్నారు. బీహార్ కి కొత్త ముఖ్యమంత్రి అయిన సామ్రాట్ చౌదరి హోం, సాధారణ పరిపాలన, క్యాబినెట్ సెక్రటేరియట్, విజిలెన్స్, పౌర విమానయానం, ఎన్నికలు వంటి కీలకమైన, అత్యంత ప్రాధాన్యత గల పోర్ట్‌ఫోలియోలను పర్యవేక్షిస్తున్నారు బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వంలో ఇతర క్యాబినెట్ మంత్రులకు ప్రత్యేకంగా కేటాయించని అన్ని శాఖలను కూడా ఆయన తన వద్దే ఉంచుకున్నారు. ఇలా అనేక మంది ముఖ్యమంత్రులు హోం శాఖ తమ వద్దనే ఉంచుకున్నారు.

# అయ్యో... ఆక్వా



ట్రంప్ సుంకాలు, ధరల పతనం, వ్యాధులు, మేత రేట్ల మోత, పెట్రో ఛార్జీల పెంపు.. ఆక్వా రైతును ఒకదాని వెంట మరొక సమస్య చుట్టుముట్టి గుక్కతిప్పుకోనీయడంలేదు. మరోవైపు రూ.వేల కోట్ల విదేశీ మారకద్రవ్యం, పన్ను ఆదాయాలను తమ బొక్కసంలో వేసుకుంటున్న కేంద్ర ప్రభుత్వానికి, ఇబ్బందులతో సతమతమవుతున్న ఆక్వా రైతులకు ఆదుకోడానికి అస్సలు చేతులు రావట్లేదు. ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధిలో గణనీయ స్థాయిలో భాగస్వామ్యమవుతున్న చేపల, రొయ్యల రైతులకు ఆపన్నహస్తం అందించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖలు రాసి సరిపెడుతోంది. తన పరిధిలోని సమస్యల పరిష్కారానిక్కూడా చిత్తశుద్ధి చూపించట్లేదు. డబుల్ ఇంజిన్ సర్కార్ ఈ నిర్వాకం ఆక్వా రైతులను అధోగతి పట్టిస్తోంది. ట్రంప్ అమెరికా అధ్యక్షుడు కాగానే మోదిన సుంకాలతో మొట్టమొదట నష్టపోయింది ఎ.పి.లోని రొయ్య రైతులు. మన రొయ్యలపై అమెరికా 60 శాతం వరకు దిగుమతి సుకం బాదింది. ఇక్కడ ధరలు 20-30 శాతం పడిపోయాయి. అమెరికా సుంకాల ప్రభావం మన రాష్ట్రం నుంచి ఏటా జరుగుతున్న రూ.25 వేల కోట్ల విలువైన ఆక్వా ఎగుమతులపై పడింది. సుంకాలు తగ్గించేలా మోడీ ప్రభుత్వం ట్రంప్‌తో చర్చలు జరిపి చర్యలు తీసుకోవాలని రైతులు ఆందోళనలు చేస్తున్నారు.

కేంద్రంలో మోడీ ప్రభుత్వం మనగలగడానికి ఆక్సిజన్ ఇస్తున్న టిడిపి గట్టిగా కేంద్రంపై ఒత్తిడి చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఒకటికి రెండు సార్లు లేఖలు రాయడం తప్ప టిడిపి ప్రభుత్వం చేసిందేమీ లేదు. అంతలోనే ఫీడ్ కంపెనీలు ఇష్టానుసారం ఏకపక్షంగా ధరలు పెంచేందుకు తెగబడగా రైతాంగం నుంచి తీవ్ర నిరసనలు రావడంతో రాష్ట్ర ప్రభుత్వం రంగంలోకి దిగి తాత్కాలికంగా ఆపించింది. ఫిబ్రవరిలో ఒకసారి ఫీడ్ ధరలను కిలోపై రూ.4 పెంచాయి. కేంద్రం కొన్ని రకాల పన్నులు తగ్గించిన సందర్భంలో కంపెనీలు నామమాత్రంగా ధరలు తగ్గించి, కొన్ని రోజులకే పెంచాయి. తిరిగి కిలోపై రూ.10 వరకు పెంచుతున్నట్లు ప్రకటించి వెనక్కి తగ్గాయి. ఎపి ఆక్వా డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం ప్రకారం ఫీడ్ ధరలను కంపెనీలు తమకు తాము పెంచడానికి వీల్లేదు. ప్రభుత్వం సమక్షంలో రైతులు, కంపెనీల మధ్య సంప్రదింపులతో జరగాలి. శనివారం సర్కార్ నిర్వహించిన ఉమ్మడి సమావేశంలో కిలోకు రూ.31 వరకు పెంచాలని కంపెనీలు డిమాండ్ చేశాయి. రైతులు ససేమిరా అంగీకరించలేదు. బంతి సిఎం కోర్టుకు చేరింది.

రాష్ట్ర విభజన తర్వాత ఆక్వా, అందులోనూ రొయ్యల సాగు విస్తరణకు టిడిపి, వైసిపి, ప్రస్తుత కూటమి ప్రభుత్వాలు ప్రత్యేక ప్రణాళికలతో అధిక ప్రాధాన్యమిచ్చాయి. వరి, ఆహార ధాన్యాల కంటే చేపలు, రొయ్యల సాగుతో అధిక ఆదాయం వస్తుందని ఊదరగొట్టాయి. దాంతో రొయ్యల సాగు 4.7 లక్షల ఎకరాలకు విస్తరించింది. అనధికారిక సాగు ఇంకా ఎక్కువే ఉంటుంది. ఆక్వా సాగు రోజు రోజుకూ కాస్ట్లీ అయింది. రైతులు ఆ వైపు మళ్లడంతో గాలివాటుగానూ తయారైంది. వ్యాధులు, ప్రకృతి విపత్తులు తరచు నష్టాలు కలిగిస్తున్నాయి. తరచు ధరల పతనం, అదనంగా ట్రంప్ సుంకాల ప్రభావం, తాజాగా యుద్ధం కారణంగా పెట్రోలు, డీజిల్‌కు కొరత. అంతలోనే వాటి ధరల పెంపు రైతులను బెంబేలెత్తిస్తున్నాయి. కూటమి సర్కార్ తాము ఫీడ్ ధరలు తగ్గించామని, యూనిట్ విద్యుత్‌ను రూ.1.50కే ఇస్తున్నామంటోంది. పెరిగిన ఫీడ్ ధరలతో పోల్చితే ప్రభుత్వం తగ్గించింది చాలా తక్కువ. విద్యుత్ సబ్సిడీకి సైతం పలు ఆంక్షలు అమలవుతున్నాయి. ఆక్వా రైతు శ్రేయస్సు దృష్ట్యా మోడీ సర్కార్ అమెరికాపై ఒత్తిడి తెచ్చి సుంకాలు తగ్గించాలి. 'పెట్రో' ఛార్జీలు తగ్గించాలి. అందుకు టిడిపి కూటమి సర్కార్ కేంద్రంపై ఒత్తిడి చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం తన పరిధిలోని ఫీడ్ ఛార్జీలు సహా ఇతర సమస్యలను పరిష్కరించి ఆక్వారైతులను, ఆ రంగంపై ఆధారపడ్డ లక్షలాది మందిని ఆదుకోవాలి.

# సంక్షోభాల సృష్టికర్తలు...మన పాలకులు !

ప్రపంచంలో ఎప్పుడూ ఏదో ఓ సంక్షోభం వస్తూనే ఉంటుంది. ఇరాన్ సంక్షోభం ఇంకా ముగియలేదు. ట్రంప్ మరోమారు రంకెలు వేస్తున్నారు. బాంబులు వేస్తామని బెదిరిస్తున్నారు. ఇదే జరిగితే మరింత ఆర్థిక సంక్షోభం తప్పేలా లేదు. ఈ సంక్షోభాలకు భయపడి సంసారం చేద్దామ లేక ఇల్లు చక్కబెట్టుకుందామా అన్నది పాలకులు ఆలోచన చేయాలి. ముఖ్యంగా ప్రధాని మోడీ ఆర్థిక చర్యలు దిద్దుబాటు లాగా లేవు. కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన వేళ కేవలం కాన్వాయ్‌లో కార్లు తగ్గించడంతో సరిపెట్టేస్తున్నారు. దేశ ఆర్థిక వ్యవస్త చిన్నాభిన్నం అవుతోంది. ప్రజల్లో కొనుగోలు శక్తి తగ్గుతోంది. సంక్షేమ పథకాల పేరిట ప్రభుత్వాలు అప్పులు చేస్తున్నాయి. వేలకోట్లు వడ్డీలు కట్టడానికే వెచ్చిస్తున్నాయి. ఇందులో తెలుగు రాష్ట్రాలు ముందు న్నాయి. అప్పులు చేసి మరీ పథకాలు అమలు చేస్తున్నారు.

ఇంట్లోకి వెళ్లి వండిపెట్టడమే తరువాయి అన్నట్లుగా పథకాలను వండి వారుస్తున్నారు. దీంతో ప్రభుత్వాన్ని నడపడానికి నిత్యం అప్పులు చేయడం, ఉన్న భూములను అమ్మేయడం అలవాటు చేసుకున్నారు. ఓట్ల కోసం నానాగడ్డి కరుస్తారనడానికి ఈ పథకాలే నిదర్శనం. ఇకపోతే పొదుపు విషయంలో ప్రజాప్రతినిధులకు లెక్కేలేదు. గతంలో మంత్రులు, ముఖ్యమంత్రులు సాధారణ ప్రజల్లాగా విమానాల్లో వెళ్లేవారు. ఇప్పుడు ఏకంగా ప్రత్యేక విమానాలను వాడుతున్నారు. హెలికాప్టర్లకు కొదవే లేదు. మంత్రులు, ఇతర ప్రముఖులు కూడా చీటికీ మాటికీ ప్రత్యేక విమానాలు, హెలికాప్టర్లు వాడుతున్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు అత్యవసరంగా వెళ్లడానికి వేరు. కానీ ప్రతి కార్యక్రమం కోసం విమానాలు, హెలికాప్టర్లు విచ్చలవిడిగా వాడేస్తున్నారు. చంద్రబాబు అయితే స్వచ్ఛాంధ్ర, పెన్షన్ల పంపిణీకి చేస్తున్న ఆర్భాటం అంతాఇంతాకాదు. వీటికి వెళ్లకుండా కార్యక్రమాలను నడిపించేవచ్చు. కానీ ఆయన నిత్యం ఏదో ఒక కార్యక్రమంతో ప్రజల్లో ఉండడం కోసం నానా తంటాలు పడుతుంటారు. ముందుగా ఏర్పాటు చేసుకున్న కార్యక్రమాలకు ప్రత్యేక విమానాల అవసరం ఏమిటన్నది బాబు చెప్పాలి. అంతెందుకూ, ఇదివరకు మంత్రులు రైళ్లలో ప్రయాణించేవారు. ఇప్పుడు ఎంతమంది రైలెక్కుతున్నారన్నది తెలియదు. అయితే విమానం లేదా భారీ కాన్వాయ్‌లు వేసుకొని ఊరేగుతున్నారు. మంత్రులు, అధికారులు వారాంతం వచ్చిందంటే చాలు హైదరాబాద్‌లో వాలిపోతున్నారు. ముఖ్యమంత్రి, మాజీ ముఖ్యమంత్రి కోసం అమరావతి, హైదరాబాద్, బెంగళూరులో ప్రత్యేకంగా భద్రతా సిబ్బంది ఉంటున్నారు. ఇలా చెప్పుకొంటూ పోతే ప్రభుత్వాలలో దుబారాకు అంతే ఉండదు.

ఒకప్పుడు ప్రధానమంత్రి, ముఖ్యమంత్రుల కాన్వాయ్‌లలో ఇన్ని వాహనాలు ఉండేవి కావు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి సైతం మూడు వాహనాలే వినియోగించేవారు. వారి భద్రతను నలుగురైదుగురు సిబ్బంది మాత్రమే చూసేవారు. ఇప్పుడు పదుల సంఖ్యలో వాహనాలను కాన్వాయ్‌లో చేర్చారు. ముఖ్యమంత్రుల బహిరంగ సభలు, సమావేశాలకు వందలమంది పోలీసులను నియమిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నక్సలైట్ల ప్రభావం అధికంగా ఉన్నప్పుడు మంత్రులు, ముఖ్యమంత్రులకు అదనపు భద్రత అవసరమయ్యేది. ఇప్పుడు నక్సలైట్లు దాదాపుగా అంతరించిపోయారని కేంద్రమే ప్రకటించింది. అయినా భద్రతను కుదించడం లేదు. ఈ విషయంలో చంద్రబాబు ఆదర్శమని చెప్పాల్సిందే. హంగూ ఆర్భాటంలో ఆయన ముందుంటారు. ఆయిల్ సంక్షోభంతో ప్రధాని మోదీ పిలుపుతో దేశవ్యాప్తంగా ముఖ్యమంత్రులు తాము వినియోగించే వాహనాల సంఖ్యను తగ్గించుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఓ అడుగు ముందుకేసి మరింత జాగ్రత్తలు చేపట్టారు. మహానాడును సైతం వర్చువల్‌గా నిర్వహించాలని నిర్ణయించారు. ఏకంగా మంత్రివర్గ సమావేశంలోనే పొదుపు చర్యలపై చర్చలు జరిపారు. అయితే తమ కార్యక్రమాల్లో పొదుపు పాటించి, దుబారా ఖర్చులు తగ్గించుకోగలిగితే మంచిదే. కానీ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలలో దుబారా సర్వసాధారణం అయింది. ముఖ్యమంత్రులు పాల్గొనే కార్యక్రమాలకు హంగూ ఆర్భాటం పెరిగింది. దుబారా అని ఆలోచించకుండా మన సొమ్ము కాదు కదా అని మంచినీళ్ల ప్రాయంగా ఖర్చు చేస్తుంటారు. ఖర్చుల నియంత్రణ, పొదుపు అనేది ప్రజలకు ఆదర్శంగా ఉండాలన్నది కనిపించడం లేదు. మితిమీరిన ఖర్చులతో రాష్ట్రాలను అప్పుల ఊబిలోకి నెట్టేసారు. జగన్ ఉండగా అంతకు మించి అన్నట్లుగా డబ్బులను మంచినీళ్ల ప్రాయంగా ఖర్చు చేశారు. విశాఖలో అత్యాధునిక గెస్ట్ హౌజ్‌లు కట్టుకున్నారు. ఇప్పటికీ ఎక్కడికి వెళ్లినా మందీ మార్బలంతో పాటు, భారీ కాన్వాయ్‌లతో వెళు తుంటారు. ఇలా అప్పులు కావడానికి పాలకులు తీరు కారణం. ప్రజల జీవన ప్రమాణాలు పెరిగినా సంక్షేమ పథకాలతో వారిని నిర్వీర్యులను చేస్తున్నారు. రూపాయికే కిలో బియ్యం, ఉచిత సిలిండర్, ఉచిత కరెంట్, ఉచితంగా చీరలువంటి సంక్షేమ పథకాల అవసరమా అని ఆలోచించడం లేదు. ఉత్పాదక సాధించి, ప్రజలను స్వయం సమృద్ధి వైపు నడిపించాల్సింది పోయి అనుత్పాదక వ్యయం వైపు దేశంతో పాటు ప్రజలను మళ్లించడం ఏ తరహా అభివృద్ధి అన్నది పాలకులు చెప్పాలి. ప్రభుత్వాలు లక్షల కోట్ల అప్పులు చేస్తూ సంక్షేమ పథకాలు అమలు చేయడం ఎందుకో ప్రజలకు జవాబు ఇవ్వాలి. బడా పారిశ్రామికవేత్తలు అప్పులు ఎగవేస్తున్నా ఎందుకు చోద్యం చూస్తున్నారో చెప్పాలి. ఇవన్నీ సవరించుకో నంతవరకు దేశంలో అప్పులమీద ఆధారపడాల్సిందే. పాలకుల తీరు మారాలి. ప్రజలతీరూ మారాలి. కాన్వాయ్‌లలో కార్లు తగ్గించడం కాదు అని గుర్తించాలి. అప్పలుఉ చేయడం, దేశాన్ని అధోగతి పాలు చేయకుండా పాలన చేయడం అలవాటు చేసుకుంటే మంచిది.

### రోడ్డెక్కిన రైతులు.. వరి ధాన్యం బస్తాలకి నిప్పు

వనపర్తి రూరల్: వనపర్తి జిల్లాలో ఎక్కడ చూసినా వరి ధాన్యం కుప్పలు కనిపిస్తున్నాయి. రైతుల ధాన్యం అమ్ముకోవడానికి మార్కెట్ యార్డుతో పాటు కొనుగోలు సెంటర్ల దగ్గర పడిగాపులు కాస్తూ ఎన్నో కష్టాలు పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వరి ధాన్యం విషయంలో తన మొండివైఖరిని విడలని రైతులు కోరుతున్నారు. వనపర్తి మండలం రాజపేట గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు చేయడం లేదని వనపర్తి నుండి కొత్తకోటకు వెళ్లే రోడ్డుపై వరి ధాన్యం పోసి ధాన్యానికి నిప్పు పెట్టి ధర్నా నిర్వహించిన రైతులు.. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 45 రోజులు అవుతున్నా ఒక్క బస్తా తూకం చేయడం లేదని రైతులు కన్నెర్ర చేశారు. అనంతరం రాజపేట రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. వరి ధాన్యం బస్తాలను రోడ్డు పైకి తీసుకొచ్చి రోడ్డుకు అడ్డంగా వేసి ఖాళీ బస్తాలకు నిప్పంటించి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రాస్తారోకోలో సింగల్ విండో అధ్యక్షులు రఘువర్ధన్ రెడ్డి, గ్రామ సర్పంచ్ ఎల్లయ్య, ఉప సర్పంచ్ చిన్నారెడ్డి, మాజీ సర్పంచ్ జయరాములు, నాయకులు సుదర్శన్ రెడ్డి, మాధవ రెడ్డి, రైతులు తిరుపతయ్య, తెలుగు నారాయణ, మోహన్ రెడ్డి, సత్యా రెడ్డి, శంకర్ రెడ్డి, మహిళా రైతులు తదితరులు పాల్గొన్నారు.



# జంతు పరిరక్షణ అందరి బాధ్యత



హక్కులు కేవలం మనిషికే కాదు జంతువులకూ ఉండాలన్న ఉద్దేశ్యంతో యూనివర్సల్ డిక్లరేషన్ ఆఫ్ అనిమల్ రైట్స్‌ని ప్రకటించారు. ఈ డిక్లరేషన్‌ని 1998లో ప్రపంచ దేశాలు ఆమోదించాయి. మానవ హక్కుల దినమైన డిసెంబర్ 10న జంతువుల హక్కుల దినంగా చేయడం ద్వారా మనుషులు, జంతువులు ఒకటేనన్న సందేశం అందరికీ అందించడమే ఈ దిన ప్రధాన లక్ష్యం. మాంసం కోసం, వినోదం కోసం మానవులు అనేక రకాలుగా జంతువుల ప్రాణాలు తీస్తున్నారు. తమ వృత్తులకు, అవసరాలకు జంతువులను ఉపయోగించు కుంటూ వాటిని హింసిస్తున్నారు. ఆవు, మేక, గేదె మొదలైన జంతువులు ఎక్కువ పాలు ఇవ్వడం కోసం రసాయనాల ఇంజెక్షన్లు ఇస్తూ వానిని హింసిస్తున్నారు. జంతు సంక్షేమానికి సంబంధించి 1960లో పార్లమెంటులో చట్టం రూపొందింది. ఈ చట్టం ప్రకారం జంతువులను ఉద్దేశ్యపూర్వకంగా గానీ, నిర్లక్ష్యంగా గానీ బంధించినా, ఇబ్బంది కలిగించినా శిక్షార్హులు అవుతారు. 1960 డిసెంబర్ 26 నుంచి ఈ చట్టం అమలులో ఉంది. భూమి మీద మనుషులతో పాటు ఎన్నో రకాల జంతువులూ ఉన్నాయి.

వాస్తవానికి మనిషి కంటే ముందే జంతువులు భూమి మీద జీవించాయని సైన్స్ చెబుతోంది. జీవం నుండి జీవం రావడం మాత్రమే కాదు. ఒక జీవ జాతి అదే జీవ జాతి నుండి మాత్రమే ఉత్పన్నం అవుతుంది. అయితే భూమి ఆవిర్భవించిన తరవాత పుట్టిన చాలా జంతు జాతులు ఇప్పుడు లేవు. ఈ ఆధునిక యుగంలోనూ మనకు తెలిసిన ఎన్నో జంతు జాతులు కనుమరుగై పోతున్నాయి. మానవ మనుగడకు అనివార్యమైన జంతు సంపదను పరిరక్షించడం, వృద్ధి చేయడం, ప్రధానంగా జంతువుల హక్కులను కాపాడటం ఈ దినోత్సవ ప్రధాన లక్ష్యం. మానవుడికి, జంతువులకు మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని ఈ దినోత్సవం తెలియజేస్తుంది. భారత దేశంలో పశ్చిమ కనుమలు, నల్లమల కొండలు, శేషాచలం కొండలు, హిమాలయాలు, దేశ ఈశాన్యప్రాంతం విభిన్న జంతు జీవ జాలానికి నిలయంగా ఉన్నాయి. దేశంలో అడవులు అన్యాక్రాంత మవుతున్నాయి. ఒకప్పుడు విశాలంగా ఎక్కడ చూసినా పచ్చదనంతో బాసిల్లే అటవీ ప్రాంతాలు రాను రాను కనుమరుగై పోతున్నాయి. వన్యప్రాణి సంరక్షణ చట్టానికి తూట్లు పొడుస్తూ అటవీ ప్రాణుల వేట యధేచ్ఛగా జరుగుతుంది. వాస్తవానికి మనం జంతువుల ఆవాసాలను నాశనం చేస్తున్నాం. విచక్షణా రహితంగా అడవులు నరుకుతూ వాటి తావులను, మంచినీటి వనరులను ధ్వంసం చేస్తున్నాం. అందుకే అడవి జంతువులు గ్రామాల్లోకీ, పట్టణాల్లోకి వస్తున్నాయి. ఆహారం కోసం మనుషులపై దాడులు చేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితిని మార్చడం కూడా ఈ జంతు దినోత్సవం లక్ష్యాల్లో ఒకటి.

జంతువులకు సహజ సిద్ధమైన ఆవాసాలను కల్పించడం, జంతు జాతులను రక్షించడం, వాటి సంక్షేమాన్ని కాపాడటం ఇవే ప్రధానం. జంతు సంరక్షణ కోసం మన ప్రభుత్వాలు ఏటా కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నాయి. అయితే స్మగ్లర్లు, వేటగాళ్లు.. వన్యప్రాణులు, అరణ్యాల పాలిట శాపంలా తయారయ్యారు. వీళ్ల దెబ్బకు కీకరారణ్యాలు సైతం మైదానాలుగా మారుతున్న పరిస్థితి. పరిశ్రమల స్థాపన పేరిట పెద్ద ఎత్తున అటవీ భూముల్లో పారిశ్రామిక కార్యకలాపాలు నిర్వహిస్తుండటం కూడా వన్యప్రాణుల మనుగడకు ముప్పుగా మారింది. దీంతో గూడు చెదిరిన వన్యప్రాణుల జనారణ్యం లోకి వస్తున్న పరిస్థితి. దేశంలోని జంతు సంపదను పరిరక్షించడానికి మొట్టమొదటి సారిగా 1898లో ఆనాటి బ్రిటీష్ ప్రభుత్వం మొదటి పక్షుల అభయారణ్యాన్ని తమిళనాడు లోని వేదాంతంగల్‌లో ఏర్పాటు చేసింది. ఆ తర్వాత 1935లో మొదటి వన్య ప్రాణి జాతీయ పార్కు 'హేలీ'ని ఉత్తరప్రదేశ్‌లో ఏర్పాటు చేశారు. ఇదే పార్కును ఇప్పుడు జిమ్ కార్బెట్ పార్కు అని పిలుస్తున్నారు. ప్రస్తుతం దేశంలో ఉన్న మొత్తం జాతీయ పార్కుల సంఖ్య 102.

1976లో జరిగిన రాజ్యాంగ సవరణలోని ఆర్టికల్ 51(ఎ) ప్రకారం వన్యప్రాణి సంరక్షణ పౌరుల ప్రాథమిక విధి. ఆదేశిక సూత్రాల్లో కూడా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విధిగా వన్యప్రాణులను సంరక్షించాలని పేర్కొన్నారు. జాతీయ వన్యప్రాణి చట్టం 1972, వన్యప్రాణులను వేటాడటాన్ని పూర్తిగా నిషేధించింది. ఆనాటి ప్రధాని స్వర్గీయ ఇందిరా గాంధీ 1972లో వన్యప్రాణుల సంరక్షణ చట్టాన్ని ప్రవేశపెట్టారు. ఈ చట్టం ప్రకారం వన్య ప్రాణుల వేట నిషేధం. జంతువులపట్ల జాలి, పరితాపములను చూపాలని భారత రాజ్యాంగం 51 ఎ అధికరణం పౌరుల ప్రాధమిక బాధ్యతలను నిర్వచిస్తున్నది. భారత రాజ్యాంగపు 21వ అధికరణం వ్యక్తిగత స్వేచ్ఛ, జీవన హక్కులను ధృవపరుస్తున్నది. భారత పౌరులకు జంతువులను పెంచి పోషించే హక్కును ఈ అధికరణం ధృవపరుస్తున్నది. భారత పార్లమెంటు రూపొందించిన జంతువులపట్ల క్రూరత్వం నివారణ చట్టం సెక్షన్ 11 (1) నుండి (ఓ), ప్రకారం జంతువులను వేటాడటం, స్వాధీనం లేదా పట్టుకోవడం, ఏ జంతువునైనా అవయవమును తొలగించడం లేదా చంపడంవంటి అనేక ఇతర క్రూర చర్యలకు బాధ్యులైన వారిని చట్టం ద్వారా శిక్షిసారు. జంతు రవాణాలో అనవసర హింసకు పాల్పడే వారికి, జంతువులను కిక్కిరిసినట్టుగా వాహనాల్లో నింపేవారికి, జంతువుల కాళ్ళు కట్టేసి వాహనాలపై తీసుకువెళ్ళే వారికి రూ 100 లేదా మూడు నెలల కారాగార శిక్ష లేదా రెండు శిక్షలూ కలిపి విధించవచ్చు. భారత శిక్షా స్మృతి సెక్షను 428 మరియు 429 కింద జంతువులను భయపెట్టడం గాయ పరచడం చట్టవిరుద్ధం. జంతువులను లేదా జంతు సంరక్షకులను భయ కంపితులను చేయడాన్ని 1860 భారత శిక్షాస్మృతి సెక్షన్ 503 ప్రకారం తెలిసి లేదా స్పృహతో చేస్తున్న నేరంగా పరిగణిస్తారు. ఇటువంటి వారిని ఎటువంటి వారంటు లేకుండా అదుపులోకి తీసుకోవచ్చు. జంతుసంపదను పరిరక్షించడం, వాటిని వృద్ధి చేయడంతోపాటు జంతువుల హక్కులను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత. మానవ మనుగడకు అనివార్యమైన జంతు సంపదను పరిరక్షించడం, వృద్ధిచేయడం, జంతువులకూ తగిన గౌరవాన్ని అందజేయడం అందరి బాధ్యత. జంతువులపట్ల మరింత మానవీయంగా ప్రవర్తించడం, ఈ స్ఫూర్తిని భావితరాలకు తెలియజేయడం అవసరం. వన్యప్రాణి సంరక్షణ చట్టానికి తూట్లు పొడుస్తూ అటవీ ప్రాణుల వేట యధేచ్ఛగా జరుగుతుంది. వాస్తవానికి మనం జంతువుల ఆవాసాలను నాశనం చేస్తున్నాం. విచక్షణా రహితంగా అడవులు నరుకుతూ వాటి తావులను, మంచినీటి వనరులను ధ్వంసం చేస్తున్నాం.

## సాఫ్ట్ గా మాధవ్...?

విశాఖపట్టణం, : దక్షిణాదిలో ఏపీలో మాత్రమే బీజేపీకి చెప్పుకోదగ్గ ట్రెంథ్ లేదు. ఒంటరిగా పోటీ చేస్తే ఒక్క సీటు కూడా వచ్చే సీన్ లేదు. అందుకే కూటమిలో భాగంగా ఉంటూనే..నవ్యాంధ్రలో కమల వికాసం కోసం ఎత్తులు వేస్తున్నారు జాతీయ పార్టీ ఇచ్చిన కార్యక్రమాలను నిర్వహించడం తప్ప.. గ్రామస్థాయి నుంచి పార్టీ నిర్మాణం కోసం, క్యాడర్ బలోపేతం కోసం అధ్యక్షుడిగా మాధవ్ కొత్తగా చేస్తున్నదేమి లేదన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. అధ్యక్షుడు చేపడుతున్న కొద్దిపాటి యాక్టివిటీకి కూడా పార్టీ నేతలు, ప్రజాప్రతినిధుల నుంచి కోఆపరేషన్ లేదని క్యాడర్ ఆవేదన వ్యక్తం చేస్తోంది. 2019లో ఒంటరిగా పోటీ చేసి ఓట్లు తెచ్చుకోవడం తప్ప..ఒక్క సీటు కూడా గెల్వలేకపోయింది బీజేపీ. 2024కు వచ్చే సరికి కూటమిగా జత కట్టి..అసెంబ్లీతో పాటు పార్లమెంట్ ఉభయ సభల్లో ఏపీ నుంచి ప్రాతినిధ్యం దక్కించుకుంది. కమలనాథులు. ఇప్పటికంటే ఇంకింత బలంగా..మరింత స్ట్రాంగ్‌గా నిలబడేందుకు సరికొత్త స్ట్రాటజీస్ ప్లే చేస్తున్నారు. అందుకే ఓ చేతిలో బీజేపీ జెండా.. ఇంకో చేతిలో కూటమి అజెండాతో..కలిసి నడుద్దామ్. పార్టీ కోసం కష్టపడుదామంటూ ఏపీ బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ పిలుస్తున్నారు. కానీ సీనియర్ లీడర్లలో మాత్రం ఆ దూకుడు కనిపించట్లేదట.అదే కూటమిలో భాగస్వామిగా ఉన్న టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు దూసుకెళ్తున్న స్పీడుగా..కమలనాథులు ప్రజల్లోకి వెళ్లలేకపోతున్నారట. దీంతో ఏపీలో బీజేపీ మినహా మిగతా రాజకీయ పార్టీలన్నీ యాక్టీవ్ గానే ఉన్నాయన్న చర్చ జరుగుతోంది. అధికార కూటమి కీలకంగా ఉన్న టీడీపీ..మళ్లీ పవర్‌లోకి రావాలని ఎత్తులు వేస్తున్న వైసీపీ..ఎక్కడా తగ్గట్లేదు. రేపే ఎలక్షన్స్ ఉన్నాయన్నట్లుగా ఆ రెండు పార్టీలు ఎప్పుడూ సూపర్ యాక్టీవ్‌గా ఉంటున్నాయి.జనసేన కూడా అటు పార్టీ నిర్మాణంలోనూ ఇటు పొలిటికల్‌గాను దూకుడు మీదుంది. చివరికి కాంగ్రెస్ పార్టీ కూడా ఏదొక హడావుడి చేస్తూనే ఉంటుంది. పార్టీకి క్యాడర్,లీడర్లు లేకపోయినా షర్మిల చేసే పొలిటికల్ కామెంట్స్ నిత్యం ప్రజల్లో చర్చనీయాంశం అవుతున్నాయి. కానీ ఏపీలో బీజేపీ మాత్రం అంత యాక్టీవ్‌గా కనిపించట్లేదన్న చర్చ ఉంది.ఏపీలో కూటమిలో భాగస్వామిగా ఉన్నా అటు ప్రభుత్వంలోనూ ఇటు పొలిటికల్ గాను పార్టీ యాక్టివిటీ చాలా తక్కువ. ఇక పార్టీ బలోపేతం కోసం, పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బలమైన ప్రయత్నాలేమి జరగడం లేదని కార్యకర్తలే చర్చించుకుంటున్న పరిస్థితి. దీనికి కారణం బీజేపీ కీలక నేతలు సైలెంట్ మోడ్‌లో ఉండటమే అంటున్నారు.కేంద్రంలో అధికారంలో ఉంటూ..చాలా రాష్ట్రాల్లో పవర్‌లో కొనసాగుతూ..ఏపీ ప్రభుత్వంలో కీరోల్ ప్లే చేస్తున్నప్పటికీ..ఏపీలో మాత్రం ఆశించినంతగా కమలం లీడర్లు దూకుడు ప్రదర్శించడం లేదంటున్నారు

# కొత్తజిల్లాల ఆశలపై నీళ్లు

వరంగల్,: తెలంగాణలో జిల్లాల పునర్విభజన, ప్రస్తుత జిల్లాల భవిష్యత్తుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన కీలక వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జిల్లాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకోబోతోందనే ఉత్కంఠకు సీఎం తెరదించారు. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న ఏ ఒక్క జిల్లాను కూడా రద్దు చేసే ఉద్దేశం తమ ప్రభుత్వానికి లేదని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా భూపాలపల్లి జిల్లా రద్దు అవుతుందనే ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యక్తిగత ఇష్టాయిష్టాలు, సెంటిమెంట్లు, ఆయన లక్కీ నంబర్ ఆధారంగానే జిల్లాల విభజన చేపట్టిందని కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచీ విమర్శిస్తూ వస్తోంది. పరిపాలనా సౌలభ్యం కంటే రాజకీయ ప్రయోజనాలే పరమావధిగా జిల్లాల ఏర్పాటు జరిగిందని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. అయినప్పటికీ,

ప్రజలకు ఇబ్బంది కలిగిం చేలాఉన్న జిల్లాలనుతొలగించడం కంటే,ఉన్నవాటిని పటిష్టం చేయడ మే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.జయశంకర్ భూపాలపల్లి జిల్లా చెల్పూర్ అభివృద్ధి పనుల శంకుస్థాపనలో పాల్గొన్న సీఎం, అక్కడి బహిరంగ సభలో జిల్లా ఉనికిపై భరోసా ఇచ్చారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు ఎంతో గొప్ప చరిత్ర ఉందని, భూపాలపల్లి ఒక చిన్న కుగ్రామంగా ఉన్న దశ నుంచి నేడు మున్సిపాలిటీగా, జిల్లా కేంద్రంగా ఎదగడం వెనుక ఎందరో కృషి ఉందని రేవంత్ రెడ్డి కొనియాడారు. దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారా వు భూపాలపల్లిని మండల కేంద్రంగా మార్చడం ద్వారానే ఈ ప్రాంత అభివృద్ధికి బీజం పడిందని ఆయన గుర్తు చేశారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తికి పునాది ఇక్కడే పడిందని, ఈ ప్రాంత అభివృద్ధిలో సింగరేణి కార్మికుల పాత్ర వెలకట్టలేనిదని ఆయన ప్రశంసించారు.జిల్లాల పునర్విభజన లేదా మార్పులపై భవిష్యత్తులో ఏదైనా నిర్ణయం తీసుకోవాల్సి వస్తే, అది ఏకపక్షంగా ఉండదని సీఎం తేల్చిచెప్పారు. ప్రజల అభిప్రాయాలను సేకరించిన తర్వాత, అసెంబ్లీలో సమగ్రంగా చర్చించి, ప్రతిపక్షాల సూచనలు తీసుకున్న తర్వాతే ముందుకెళ్తామని ప్రకటించారు. రహస్య నిర్ణయాలు లేదా రాజకీయ కుట్రలకు తమ ప్రభుత్వంలో తావులేదని ఆయన కుండబద్ద లు కొట్టారు.ప్రభుత్వంపై బురదజల్లేందుకు కొంతమంది కావాలనే జిల్లాల రద్దుపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ పబ్బం గడుపుకోవడం కోసం ఇలాంటి విషం చిమ్మే ప్రయత్నాలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మెడికల్ బోర్డు విషయంలో కొందరు చేస్తున్న చిల్లర రాజకీయాలను తిప్పికొడతామని,

కార్మికుల వల్లే రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని ఆయన కృతజ్ఞత చాటుకున్నారు. అసత్య ప్రచారాలు చేసే వారిని మోకాళ్లపై కూర్చోబెడతామని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రజలను తప్పుదోవ పట్టించే శక్తులకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటనతో జిల్లాల భవిష్యత్తుపై నెలకొన్న సందిగ్ధత వీడిపోయింది. పాలనలో పారదర్శకత, ప్రజాస్వామ్యబద్ధమైన చర్చల ద్వారానే ఏ నిర్ణయమైనా ఉంటుందని చెప్పడం ద్వారా ఆయన ప్రజల్లో విశ్వాసాన్ని నింపారు. భూపాలపల్లి జిల్లా ఉనికిపై ఆయన ఇచ్చిన హామీ ఆ ప్రాంత ప్రజలకు పెద్ద ఊరటనిచ్చింది.

# బర్డ్ ఫ్లూ పై ఆందోళన వద్దు.!




రాయచోటి,: బర్డ్ ఫ్లూ పై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ స్పష్టం చేశారు. సోమవారం అన్నమయ్య జిల్లాలోని పుంగనూరు ,మదనపల్లె జిల్లాలోని బర్డ్ ఫ్లూ సోకిన పలు కోళ్ల ఫారాలను పశుసంవర్ధక శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు .కోళ్ల ఫారం యజమానులతో జిల్లా కలెక్టర్ వారి కష్టాలను బర్డ్ ఫ్లూ పై తీసుకుంటున్న చర్యలను ఈ బర్డ్ ఫ్లూ భవిష్యత్తులో రాకుండా పూర్తిస్థాయిలో నివారించేందుకు ఎలాంటి చర్యలు చేపట్టాలో విపులంగా చర్చించారు .అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూబర్డ్ ఫ్లూ వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లిస్తా మనీ హామీ ఇచ్చారు.అంతేకాకుండా మదనపల్లెలో బర్డ్ ఫ్లూ పై కంట్రోల్ రూమ్ ఏర్పాటు. చేశామని చెప్పారు.కోళ్ల నుండి మనుషులకు బర్డ్ ఫ్లూ సోకే అవకాశాలు దాదాపు శూన్య మనీ వివరించారు100 డిగ్రీలకు పైగా వేడి చేసిన మాంసంలో బర్డ్ ఫ్లూ వైరస్ ఉండదనితెలిపారు.అన్నమయ్య జిల్లాలోని పుంగనూరు నియోజకవర్గంలోని సదుం మండలంలోని రెండు కోళ్ల ఫారాలలో గుర్తించిన బర్డ్ ఫ్లూ పై ప్రజలు ఎవరు ఆందోళన చెందవలసిన అవసరం లేదని, బర్డ్ ఫ్లూ వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లిస్తామని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సదుం మండలంలోని పుత్తవారిపల్లె, అమ్మగారి పల్లె గ్రామాలలోని రెండు కోళ్ల ఫారాలలో కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకిన నేపథ్యంలో కోళ్లను ఖననం చేయడానికి జిల్లా కలెక్టర్ పశు సంవర్ధక శాఖకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.సదుం మండలంలో గుర్తించిన బర్డ్ ఫ్లూ పై చర్యలు తీసుకునేందుకు పశుసంవర్ధక శాఖకు తగిన ఆదేశాలు జారీ చేశామని పేర్కొన్నారు. పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్యశాఖ తదితర శాఖల సమన్వయంతో.సదుం మండలం నుండి ఇతర ప్రాంతాలకు కోళ్ల సరఫరా జరగకుండా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ప్రజలు ఎవరు బర్డ్ ఫ్లూ పై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించారు. బర్డ్ ఫ్లూ వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లిస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. సదుం మండలం మినహా మిగతా ఏ మండలాలలో అసాధారణ కోళ్ళ మరణాలు సంభవించలేదని పేర్కొన్నారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి కార్యాలయానికి ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ అధికారి గుణశేఖర్ మాట్లాడుతూ.అన్నమయ్య జిల్లా సదుం మండలం పుత్తవారిపల్లె, అమ్మగారి పల్లె, కంభం వారి పల్లె, గ్రామాలకు చెందిన ముగ్గురు రైతుల కోళ్ల ఫారాలలో అనూహ్యమైన సంఖ్యలో కోళ్ల మరణాలు సంభవించగా అప్రమత్తమైన పశుసంవర్ధక శాఖ మొదటి రెండు కోళ్ల ఫారాల నుండి చనిపోయిన కోళ్ల శాంపుల్స్ ను మధ్యప్రదేశ్ భోపాల్ లోని హై సెక్యూరిటీ ల్యాబ్ కు పంపగా చనిపోయిన కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకినట్లుగా నిర్ధారణ అయిందని పేర్కొన్నారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో... పుత్తవారిపల్లె మరియు అమ్మగారి పల్లె గ్రామాలలోని రెండు కోళ్ల ఫారాల లోని కోళ్లను స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ద్వారా బ్లీచింగ్ పౌడర్ సున్నం లను ఉపయోగించి కోళ్లను ఖననం చేసినట్లుగా పేర్కొన్నారు. కంభం వారి పల్లె గ్రామంలోని కోళ్ల ఫారానికి చెందిన కోళ్ల శాంపిల్స్ యొక్క నివేదిక భోపాల్ నుండి రావాల్సి ఉందని నివేదిక వచ్చిన వెంటనే దానిపై తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ మరియు అన్నమయ్య జిల్లా కలెక్టర్ అదేశాల మేరకు తగిన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. బర్డ్ ఫ్లూ పై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు ఆటోల ద్వారా టామ్ టామ్ వేయిస్తున్నామని పేర్కొన్నారు. కోళ్ల నుండి మనుషులకు బర్డ్ ఫ్లూ సోకే అవకాశాలు చాలా చాలా తక్కువ అని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# టూ టైర్ సిటీస్ లో రియల్

హైదరాబాద్, : తెలంగాణ , ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన టైర్-2 నగరాల్లో రియల్ ఎస్టేట్ రంగం అనూహ్యమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. వరంగల్, కరీంనగర్, తిరుపతి వంటి నగరాల్లో ఓపెన్ ప్లాట్ల వ్యాపారం గత ఏడాదితో పోలిస్తే ఏకంగా 15 శాతం వృద్ధిని నమోదు చేసింది. హైదరాబాద్ వంటి మెట్రో నగరాల్లో ధరలు సామాన్యులకు అందుబాటులో లేకపోవడం, ఐటీ , పారిశ్రామిక రంగాలు ద్వితీయ శ్రేణి నగరాలకు విస్తరిస్తుండటంతో పెట్టుబడిదారులు ఇప్పుడు ఈ ప్రాంతాల వైపు మొగ్గు చూపుతున్నారు.ముఖ్యంగా మధ్యతరగతి వర్గాల వారు భవిష్యత్తు అవసరాల కోసం ఈ నగరాల శివార్లలో ప్లాట్లు కొనడానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. తెలంగాణలో హైదరాబాద్ తర్వాత అతిపెద్ద నగరంగా ఎదుగుతున్న వరంగల్‌లో రియల్ ఎస్టేట్ బూమ్ కనిపిస్తోంది. స్మార్ట్ సిటీ ప్రాజెక్టులు, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ,వరంగల్ ఎయిర్‌పోర్ట్ పునరుద్ధరణ వార్తలు ఇక్కడి భూముల ధరలకు రెక్కలు తెచ్చాయి. కరీంనగర్‌లో ఐటీ టవర్లు, పర్యాటక రంగ అభివృద్ధి వల్ల పట్టణ సరిహద్దులు వేగంగా విస్తరిస్తున్నాయి. గతంలో కేవలం వ్యవసాయ భూములుగా ఉన్న ప్రాంతాలు నేడు డీటీసీపీ అనుమతి పొందిన లేఅవుట్లుగా మారుతున్నాయి. ఇక్కడ గత ఏడాదితో పోలిస్తే ప్లాట్ల అమ్మకాల్లో సుమారు 14 నుంచి 16 శాతం వరకు ధరల పెరుగుదల కనిపించడం గమనార్హం. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో కూడా ఇదే విధమైన ట్రెండ్ కొనసాగుతోంది. ప్రపంచ ప్రఖ్యాత ఆధ్యాత్మిక కేంద్రం కావడంతో పాటు, అక్కడ ఏర్పాటవుతున్న కొత్త టౌన్‌షిప్‌లు ,పారిశ్రామిక కారిడార్లు రియల్ ఎస్టేట్ వృద్ధికి ప్రధాన కారణమయ్యాయి. తిరుపతి-మదనపల్లి , తిరుపతి-చెన్నై హైవేల వెంట వెలుస్తున్న ఓపెన్ ప్లాట్ వెంచర్లకు డిమాండ్ భారీగా పెరిగింది.ఈ నగరాల్లో 15 శాతం వృద్ధి నమోదు కావడానికి మెరుగైన కనెక్టివిటీ ప్రధాన కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. కొత్తగా నిర్మిస్తున్న బైపాస్ రోడ్లు, అండర్ పాస్లు ,మెరుగైన డ్రైనేజీ వ్యవస్థలు పెట్టుబడిదారుల్లో నమ్మకాన్ని పెంచాయి. అపార్ట్‌మెంట్ల కంటే ఓపెన్ ప్లాట్లపై పెట్టుబడి పెడితే తక్కువ కాలంలోనే ఎక్కువ లాభం వస్తుందని భావించడం కూడా ఈ రంగం పుంజుకోవడానికి కారణం.

# యాప్‌లపై టెక్ నిపుణులేమంటున్నారంటే..?!



దేశ భద్రత పేరుతో పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛకు కేంద్ర ప్రభుత్వం భంగం కలిగిస్తోందా?! ఎందుకంటే పార్లమెంటు సమావేశాల సందర్భంగా మోడీ సర్కార్ సంచార్ సాథీ యాప్‌ను ప్రవేశపెట్టేందుకు ప్రయత్నించింది. అయితే ప్రతిపక్షాల నిరసనలతో ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నట్టు ప్రకటించింది. ఇదే కాదు.. నవంబర్ 24 కేంద్రం డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ (డిపిడిపి) చట్టం 2023లో నోటిఫై చేసిన నిబంధనలు పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించేలా ఉన్నాయని జర్నలిస్టు సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇటీవల కాలంలో కేంద్రం అమలు చేయాలనుకున్న ఈ విధానాలు పూర్తిగా సమాచారానికి సంబంధించినవే కావడం గమనార్హం. కేంద్రం తేవాలని ప్రయత్నించిన సంచార్ సాథీ యాప్ ద్వారా పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛకు ముప్పు వాటిల్లుతుందనేది బహిరంగ సత్యం. అయితే దీనిపై కేంద్రం చెబుతున్న మాటలు మరోలా ఉన్నాయి. పొరపాటున పోగట్టుకున్న లేదా దొంగిలించిన స్మార్ట్‌ఫోన్‌లను బ్లాక్ చేయడానికి, వాటిని ట్రాక్ చేయడానికి ఈ సంచార్ సాథీ యాప్ ఉపయోగపడుతుందని.. అందుకే ఈ యాప్‌ని తేవడానికి ప్రయత్నించినట్లు కేంద్రం చెప్పింది. అయితే అసలు ఈ యాప్‌పై టెక్ నిపుణులు ఏమంటున్నారంటే.. ప్రస్తుత కాలంలో స్మార్ట్‌ఫోన్లు ప్రతి ఒక్కరి జీవితంలో భాగమైపోయాయి. ఇవి వ్యక్తిగత విషయాలను చాలా గోప్యంగా ఉంచుతాయి. అందుకే..స్నేహితులకు, కుటుంబ సభ్యులకు, సన్నిహితులకు చెప్పుకోలేని సమాచారాన్ని కూడా ఇవి భద్రంగా ఉంచుతాయి. అసలు చాలామంది వినియోగదారులకు తమ ఫోన్లలో ఇలాంటి యాప్ ఒకటి ఉందని వారికి తెలియకపోవచ్చు. కొద్దిమంది మాత్రమే ఫోన్లలో ఈ యాప్ గురించి శోధించి.. తొలగించడానికి ప్రయత్నిస్తారు. ఈ యాప్ వల్ల జరిగే ప్రయోజనం కంటే.. వినియోగదారులకు నష్టమే ఎక్కువ జరుగుతుంది. ఈ యాప్ ద్వారా వ్యక్తిగత డేటాను సులభంగా పొందవచ్చు. కాల్ లాగ్‌లు, పరిచయాలు, మీరు ఎక్కడున్నది? మీ చరిత్ర, మీరు మాత్రమే గోప్యంగా ఉంచుకునే సమాచారాన్ని కూడా ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. మీరు పంపే సందేశాల్ని ఈ యాప్ ద్వారా సేకరించ వచ్చు. అలాగే ఈ యాప్ వినియోగదారుల హక్కుల్ని కూడా దెబ్బతీ స్తుంది. ఇది ఫోన్ పనితీరుపై కూడా ప్రభావితం చేస్తుంది. అందుకే స్మార్ట్‌ఫోన్లను రక్షించడానికని చేసే ప్రయత్నం.. మెరుగైన పద్ధతుల్లో ఉండాలి. ప్రభుత్వం ప్రస్తుతం ఉన్న సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ వ్యవస్థను బలోపేతం చేయవచ్చు. తప్పనిసరి అని భావిస్తే.. యాప్‌కు కోడ్ తప్పనిసరి అని అభిప్రాయపడ్డారు.

# హైదరాబాద్ రియల్ ఎస్టేట్‌లో కొత్త రూల్..!



హైదరాబాద్, ,: హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్, పట్టణ అభివృద్ధిని ప్రభావితం చేస్తూ తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 10 అంతస్తులు దాటి నిర్మించే భవనాలకు టీడీఆర్ కొనుగోలు తప్పనిసరి చేసింది. చెరువులు, నదుల పరిరక్షణకు భూసేక రణను వేగవంతం చేసేందుకు ఆకర్షణీయమైన టీడీఆర్ ప్యాకేజీని ప్రకటించింది. హైదరాబాద్ మహానగరంలో రియల్ ఎస్టేట్ రంగాన్ని, పట్టణ అభివృద్ధిని ప్రభావితం చేసేలా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నగరంలోని చెరువులు, నదుల పరిరక్షణతో పాటు మౌలిక సదుపాయాల కల్పన కోసం భూసేకరణను వేగవంతం చేసేందుకు 'టీడీఆర్' నిబంధనలను సవరిస్తూ పురపాలక శాఖ జీవో నం.16ను విడుదల చేసింది. ఈ కొత్త ఉత్తర్వులు ఔటర్ రింగ్ రోడ్ వరకు విస్తరించిన తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని 300 డివిజన్లకు వర్తిస్తాయి. కొత్త నిబంధనల ప్రకారం.. నగరంలో 10 అంతస్తులు దాటి నిర్మించే ప్రతి భవనానికి టీడీఆర్ కొనుగోలు తప్పనిసరి చేశారు. 11వ అంతస్తు నుంచి పై అంతస్తుల వరకు మొత్తం నిర్మాణ విస్తీర్ణంలో 10 శాతానికి సమానమైన టీడీఆర్ సర్టిఫికెట్లను బిల్డర్లు సమర్పించాల్సి ఉంటుంది. దీనివల్ల మార్కెట్‌లో నిల్వ ఉన్న టీడీఆర్ బాండ్లకు విపరీతమైన డిమాండ్ పెరుగుతుంది. ఒకవేళ బిల్డర్లు తమ భూమిని ప్రభుత్వానికి ఉచితంగా అప్పగిస్తే.. వారికి సెట్‌బ్యాక్, భవన ఎత్తు నిబంధనలలో ప్రత్యేక సడలింపులు కూడా కల్పిస్తారు. చెరువులు, నదుల సమీపంలోని పట్టా భూములను స్వాధీనం చేసుకునేందుకు ప్రభుత్వం ఆకర్షణీయమైన ప్యాకేజీని ప్రకటించింది. ఎఫ్‌టీఎల్ పూర్తిస్థాయి నీటి మట్టం పరిధిలోని భూములకు 200 శాతం టీడీఆర్, చెరువుల బఫర్ జోన్లలోని భూములకు 300 శాతం టీడీఆర్, బఫర్ వెలుపలి భూములు అభివృద్ధి కోసం సేకరిస్తే ఏకంగా 400 శాతం టీడీఆర్ ఇవ్వాలని నిర్ణయించారు. అయితే, భూసేకరణ విస్తీర్ణం ఒక ఎకరా కంటే ఎక్కువగా ఉంటే ఆ దరఖాస్తును ప్రభుత్వం నేరుగా పరిశీలిస్తుంది. మూసీ నది పరీవాహక ప్రాంతం, చెరువుల సుందరీకరణకు భూ యజమానుల నుంచి ఎదురవుతున్న అడ్డంకులను తొలగించడానికి ఈ నిర్ణయం దోహదపడనుంది.

గతంలో జారీ చేసిన సుమారు రూ. 10 వేల కోట్ల విలువైన టీడీఆర్ సర్టిఫికెట్లు మార్కెట్‌లో పేరుకుపోయి, వాటి విలువ పడిపోయింది. ఫలితంగా యజమానులు భూములు ఇచ్చేందుకు నిరాకరిస్తూ నగదు పరిహారం కోరుతున్నారు. ఇప్పుడు పెద్ద భవనాల నిర్మాణానికి టీడీఆర్ తప్పనిసరి చేయడం వల్ల, బిల్డర్లు వీటిని కొనుగోలు చేయక తప్పదు. దీనివల్ల మార్కెట్‌లో టీడీఆర్ ధర పెరగడంతో పాటు, ప్రభుత్వంపై నగదు పరిహారం భారం తగ్గుతుంది. తద్వారా నిధుల కొరతతో ఆగిపోయిన రోడ్ల విస్తరణ, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టులు వేగవంతం కానున్నాయి.

# సమాజంలో మార్పు విద్యతోనే సాధ్యం



క్లాసు రూంలో పాఠాలు చెబుతున్న ఆ ప్రొఫెసర్.. ఆ తరగతి పిల్లలకి అధ్యాపకురాలు మాత్రమే కాదు.. వారిలో దాగున్న ఎన్నో ప్రశ్నలకి సమాధానం. సమాజం నుండి ఎంతో వివక్షని ఎదుర్కొన్న తను చెప్పే పాఠాలు ఆ పిల్లల మెదళ్లల్లో సమాజంలో తనలాంటి వాళ్లని చూసే చూపుని మారుస్తుంది. గౌరవాన్ని కలిగిస్తుంది. క్యాంపస్‌లో ఆమె వేసే ప్రతి అడుగులో చూస్తున్న వారికి, వింటున్న వారికి, గౌరవిస్తున్న వారికి ప్రతి ఒక్కరికీ ఆమె సాధించిన విజయం కనిపిస్తుంది. ఎందుకంటే ఆ ప్రొఫెసరమ్మ ట్రాన్స్‌జెండర్. తమిళనాడు లయోల కాలేజీలో ఈ ఏడాది జూన్ నుండి అసిస్టెంట్ ఇంగ్లీష్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆమె పేరు డాక్టర్ ఎన్. జెన్సీ.

తమిళనాడు చరిత్రలో ఉన్నతవిద్యలో అర్హత సాధించిన, ఉన్నత కొలువు దీరిన మొట్టమొదటి ట్రాన్స్.. జెన్సీ. ఒకప్పుడు విద్యాలయం నుండి గెంటివేయబడిన తను ఈరోజు ఆ విద్యాలయంలోనే గౌరవమర్యాదలు పొందుతున్న హోదాలో ఉన్నారు. ఇంగ్లీష్ లిటరేచర్‌లో పిహెచ్‌డి చేసిన జెన్సీకి అధ్యాపక వృత్తి అంటే ఎనలేని ప్రేమ. పిల్లలని విద్యావంతులని చేసి, సమాజాన్ని చైతన్యం చేయాలన్న లక్ష్యం ఆమెది. విద్య తనలాంటి వారిని ఎంత అందలం ఎక్కిస్తుందో ఆమె నిరూపించలానుకున్నారు. అందుకే ఎన్నో కష్టనష్టాలు పడి, అవమానాలు ఎదుర్కొని మరీ డాక్టరేట్ సాధించారు. అయితే ఈ విజయం పట్ల ఆమె సంతోషంగా లేరు. ట్రాన్స్ వ్యక్తుల పట్ల సమాజం చూపే వివక్ష పోయినప్పుడే తనకి ఆనందమని ఆమె పదే పదే చెబుతారు.

'ఈ సమాజం ట్రాన్స్ వ్యక్తులని భిన్నంగా చూస్తుంది. ఇంటి నుండి గెంటేయాలని చెబుతుంది. కానీ ట్రాన్స్ వ్యక్తులని చదివించండి' అని ఆమె అంటారు. ప్రొఫెసర్‌గా ఉన్న ఆమె తనలాంటి వారి పట్ల సమాజం ద ృష్టికోణం మార్పించాలని నిరంతరం శ్రమిస్తున్నారు. టెడ్ స్పీకర్‌గా విద్యాసంస్థలు, సామాజిక వేదికలు, ప్రజా వేదికలలో 50కి పైగా ప్రేరణాత్మక ఉపన్యాసాలు ఇచ్చి సమాజంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. తన కమ్యూనిటీ వ్యక్తులు ఎదుర్కొనే పలు సమస్యలపై కూడా ఆమె పనిచేస్తున్నారు. సాధారణంగా ఏదేని గుర్తింపు పత్రాల్లో లింగనిర్ధారణ ముఖ్యంగా చేస్తారు. అయితే ట్రాన్స్ వ్యక్తులు మొదట ఉన్న గుర్తింపు తరువాతి కాలంలో మార్చుకోవాల్సి వస్తుంది. ఇది అంత సాధారణమైన ప్రక్రియ కాదు. ఎన్నో ఇబ్బందులు పడాలి. జెన్సీ ఆ సమస్యలను పరిష్కరించి కమ్యూనిటీ వ్యక్తులకి సాయం చేస్తున్నారు. అంతేకాదు, సామాజికంగా, విద్యాపరంగా ఎదుర్కొనే సమస్యలపై సలహాలు ఇస్తున్నారు. దీనిపై ఆమె ఇలా అన్నారు. 'ఈ ప్రయాణంలో నేను ఎన్నో ఇబ్బందులు పడ్డాను. పోరాడాను. నా తరువాత వచ్చేవారికి ఈ సమస్యలు పునరావృతం కాకూడదు. అందుకే సాయం చేస్తున్నాను'. ప్రొఫెసర్‌గా, సామాజిక కార్యకర్తగా రెండు బ ృహత్తర బాధ్యతల్లో తలమునకలైన జెన్సీ ఈ ప్రయాణంలో ఎంత ముందుకు వెళ్లారంటే.. ఇటీవల పేదపిల్లలకి అవార్డు ప్రదానం చేస్తున్న ఓ జంట, ఆ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెన్సీని పిలిచారు. అప్పుడు 'సమాజంలో ఈ మార్పు రావాలనే నా ప్రయత్నం. ఇది అన్ని చోట్లా రావాలి' అంటూ ఎంతో ఉద్వేగంగా మాట్లాడారు. సమాజంలో ఇంతటి ప్రభావం చూపిస్తున్న జెన్సీ ఇప్పుడు తన కమ్యూనిటీకే కాదు. ఎంతోమందికి స్ఫూర్తిమంతంగా కనిపిస్తున్నారు. కాలేజీ క్యాంపస్‌లో విద్యార్థులు తనని పాఠాలు చెప్పే అధ్యాపకురాలిగానే కాదు, 'అంతకు మించిన వ్యక్తి' అని కొనియాడుతారు. 'ఆమె చూపించే ప్రభావం పాఠాలకి మించి ఉంటుంది' అంటారు. 'ఎన్నో సమస్యల అడ్డుగోడలని బద్దలు చేయగల ఏకైక సాధనం విద్య' అని ఆమె నిరూపించింది అని అభివర్ణిస్తారు.

# విడదల అటు... రోజా ఎటూ




తిరుపతి, : ఏదైనా అధికారంలో ఉన్నప్పుడు ఏది చేసినా చెల్లుబాటు అవుతుంది. అధినేతకు ధిక్కారం ఉండదు. ఎదిరించేవారు అస్సలు ఉండరు. కానీ అది అధికారంలో ఉన్నప్పుడు మాత్రమే. అధికారం కోల్పోయిన తరువాత విధేయత అనేది పక్కకు వెళ్ళిపోతుంది. రాజకీయం అంటే కేవలం అవసరం అన్నట్టు పరిస్థితి మారిపోతుంది. ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి విషయంలో అదే జరిగింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిన తర్వాత ఒక్కోనేత ఆ పార్టీకి గుడ్ బై చెబుతున్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి అడుగులు వేసిన నేతలు సైతం జగన్మోహన్ రెడ్డిని విడిచిపెట్టి వెళ్ళిపోతున్నారు. ఆ పరిస్థితిని చూస్తున్న అధినేత జగన్మోహన్ రెడ్డి సైతం ఆశ్చర్యపోతున్నారు. గత కొద్దిరోజులుగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరు మహిళ నేతలు అసలు తాడేపల్లి కి రావడం మానేశారట. దీంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఒక రకమైన చర్చ అయితే జరుగుతోందిమాజీ మంత్రి ఆర్కే రోజా గురించి చెప్పనవసరం లేదు. సినిమాల ద్వారా ఆమె అందరికీ సుపరిచితురాలు. రాజకీయాల్లోకి వచ్చాక నిత్యం వార్తల్లో నిలిచేవారు. గట్టిగా ఉంటూనే తెలుగుదేశం పార్టీలో ప్రవేశించారు. కానీ అక్కడ సరిగ్గా రాణించలేకపోయారు. రెండుసార్లు టిడిపి తరపున పోటీ చేసి ఓడిపోయారు. అయితే రాజశేఖర్ రెడ్డి ద్వారా కాంగ్రెస్ పార్టీలో చేరాలనుకున్నారు. ముఖ్యమంత్రిగా ఉండగా ఆయనను కలిశారు. అయితే కొద్ది కాలానికి రాజశేఖర్ రెడ్డి ప్రమాదంలో చనిపోయారు. దీంతో కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లకుండా జగన్ స్థాపించిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2014 ఎన్నికల్లో తన చిరకాల వాంఛ అయినా ఎమ్మెల్యేగా ఎన్నికై అసెంబ్లీలో అడుగుపెట్టారు. 2019లో రెండోసారి గెలిచి మంత్రి కూడా అయ్యారు. 2024 ఎన్నికల్లో ఓడిపోయారు. అయితే ఇప్పుడు సొంత పార్టీ నేతలు నగిరి నియోజకవర్గంలో తనను ఇబ్బంది పెడుతున్నారని అధినేత జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కానీ జగన్ పట్టించుకోకపోవడంతో ఇప్పుడు తాడేపల్లి కార్యాలయం వైపు కూడా రావడం మానేశారు. రాజకీయంగా అదృష్టం అంటే మాజీమంత్రి విడదల రజనీది ఎందుకంటే పోటీ చేసిన తొలిసారి ఎమ్మెల్యే అయ్యారు. ఎమ్మెల్యే అయిన తొలిసారి మంత్రి పదవి కూడా చేపట్టారు. దీనికి ముమ్మాటికీ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన స్వేచ్ఛ, అవకాశం కారణం. అప్పటి మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అనుచరురాలుగా, ద్వితీయ శ్రేణి నాయకురాలిగా ఉండేవారు రజని. కానీ ఏకంగా జగన్మోహన్ రెడ్డి ఆమెను పార్టీలోకి ఆహ్వానించి టికెట్ ఇచ్చారు. మంత్రి పదవి కూడా కల్పించారు. ఆమెపై వ్యతిరేకత ఉందన్న కోణంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గం పంపించి టికెట్ కేటాయించారు.




### క్లాసిక్ దర్శకుడితో దేవరకొండ

# కొత్త ప్రయాణం..!



టాలీవుడ్ సెన్సేషనల్ స్టార్ విజయ్ దేవరకొండ వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నాడు. తాజాగా ఆయన లైనప్‌లోకి మరో ఆసక్తికరమైన పేరు వచ్చి చేరింది. తొలి చిత్రం -హాయ్ నాన్న-తోనే విమర్శకుల ప్రశంసలు అందుకుని, బాక్సాఫీస్ వద్ద క్లాసిక్ హిట్‌ను నమోదు చేసిన యువ దర్శకుడు శౌర్యువ్. తాజాగా ఇప్పుడాయన విజయ్ దేవరకొండకు ఓ అద్భుతమైన కథను వినిపించినట్లు సమాచారం. ఈ క్రేజీ కాంబినేషన్‌లో సినిమా సెట్ అయిందనే వార్త ఇప్పుడు ఫిల్మ్ నగర్‌లో హాట్ టాపిక్‌గా మారింది. శౌర్యువ్ మొదటి సినిమా -హాయ్ నాన్న-లో చూపించిన ఎమోషనల్ డెప్త్, టేకింగ్ అందరినీ ఆశ్చర్యపరిచింది. తండ్రి-కూతుళ్ల అనుబంధాన్ని హృదయానికి హత్తుకునేలా తెరకెక్కించి తానో క్లాసిక్ డైరెక్టర్ అని నిరూపించుకున్నారు. తాజాగా విజయ్ దేవరకొండ వంటి మాస్ - యూత్ ఫాలోయింగ్ ఉన్న హీరోని ఆయన ఏ విధంగా చూపిస్తారనే ఉత్కంఠ అందరిలోనూ నెలకొంది. వీరిద్దరి కలయికలో వచ్చే సినిమా కచ్చితంగా ఒక కొత్త అనుభూతిని ఇస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం ఈ సినిమా ఒక వినూత్నమైన కాన్సెప్ట్‌తో కూడిన ఎమోషనల్ యాక్షన్ డ్రామాగా ఉండబోతోంది. విజయ్ దేవరకొండ బాడీ లాంగ్వేజ్‌కు తగ్గట్టుగా ఉంటూనే శౌర్యువ్ మార్క్ సున్నితమైన భావోద్వేగాలు ఈ కథలో ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. ఇప్పటికే కథా చర్చలు ముగిశాయని విజయ్ ఈ స్క్రిప్ట్ పట్ల చాలా ఎగ్జైటింగ్‌గా ఉన్నారని తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్ విజయ్ కెరీర్‌లో మరో వైవిధ్యమైన చిత్రంగా నిలిచిపోవడం ఖాయం. ప్రస్తుతం విజయ్ దేవరకొండ రాహుల్ సాంకృత్యన్, రవి కిరణ్ కోలా వంటి టాలెంటెడ్ దర్శకులతో సినిమాలు చేస్తున్నారు. వాటి తర్వాత శౌర్యువ్ సినిమా సెట్స్ పైకి వెళ్లే అవకాశం ఉంది. ఒకవైపు మాస్ సినిమాలు చేస్తూనే మరోవైపు శౌర్యువ్ లాంటి దర్శకులతో క్లాసిక్ సినిమాలకు ప్రాధాన్యత ఇవ్వడం విజయ్ మారుతున్న ఆలోచనా విధానానికి నిదర్శనం. ఈ చిత్రం ద్వారా విజయ్ మళ్ళీ తనలోని ఎమోషనల్ యాక్టర్‌ను వెలికితీసే ఛాన్స్ ఉంది. ఈ ప్రాజెక్టును ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ నిర్మించడానికి సిద్ధంగా ఉందిట. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించినఅధికారిక ప్రకటన వెలువడనుంది. -హాయ్ నాన్న- తర్వాత శౌర్యువ్ చేస్తున్న రెండో సినిమా కావడంతో ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి. విజయ్ దేవరకొండ అభిమానులు కూడా తమ హీరో నుండి ఒక హార్ట్ టచింగ్ మూవీ వస్తుందని ఆశిస్తున్నారు. ఈ కాంబో అనౌన్స్‌మెంట్ కోసం సోషల్ మీడియాలో రౌడీ ఫ్యాన్స్ అప్పుడే సందడి మొదలుపెట్టారు.

# వరుస ఆఫర్లతో బిజీగా త్రిష..





తెలుగు, తమిళ్ భాషల్లో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును సొంతం చేసుకున్న అతి కొద్దిమంది నటీమణులలో త్రిష గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఇండస్ట్రీకి వచ్చి రెండు దశాబ్దాలకు పైగానే అవుతున్నా .. ఇప్పటికీ చెరగని అందంతో.. వరుస ఆఫర్లతో బిజీగా మారింది. ఇక అలాంటి ఈమె ఈ మధ్యకాలంలో స్టార్ సీనియర్ హీరోల చిత్రాలలో అవకాశాలు అందుకుంటూ అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. ముఖ్యంగా నయనతారతో అప్పటికీ ఇప్పటికీ పోటీ పడుతోంది. ఈ క్రమంలోనే మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటిస్తున్న విశ్వంభర సినిమాలో హీరోయిన్గా నటించిన త్రిష.. ఈ ఏడాది సమ్మర్ కానుకగా ఈ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇదిలా ఉండగా మరొకవైపు కోలీవుడ్ హీరో విజయ్ తో రిలేషన్ లో ఉందనే వార్తలను విపరీతంగా ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా ఈ విషయంపై అటు కోలీవుడ్ దర్శక నిర్మాతలతో పాటు పలువురు నటులు కూడా వీరి బంధం పై కామెంట్లు చేస్తున్నారు. రాజకీయ నాయకులు కూడా ఈ విషయంలో తలదూర్చడంతో అటు విజయ్ ను రాజకీయంగా తొక్కేయడానికి త్రిషను అడ్డం పెట్టుకొని కామెంట్లు చేస్తున్నారు అనే వార్తలు తమిళ తంబీల నుంచి కూడా వ్యక్తమవుతున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా త్రిష - విజయ్ మధ్య స్నేహబంధం ఉన్నప్పటికీ ఏదో ఉందనే రూమర్స్ క్రియేట్ చేస్తూ వైరల్ చేస్తున్నారు.

దీనికి తోడు సోషల్ మీడియాలో ఎన్ని రూమర్స్ వస్తున్న సమయంలో త్రిష - విజయ్ ఇద్దరు కలిసి ఇటీవల ఒక పెళ్లి వేడుకలు మళ్లీ జంటగా కనిపించి రూమర్లకు మరింత ఆజ్యం పోశారు. అలా ఈ మధ్య వ్యక్తిగతంగా మరిన్ని విమర్శలు ఎదుర్కొంటుంది ఈ ముద్దుగుమ్మ. మొత్తానికి అయితే అనవసరపు మాటలను పట్టించుకోవడం అంటే సమయాన్ని వృథా చేసినట్టే అని త్రిష భావించినట్టు ఉంది. అందుకే కాబోలు ఇలా తన పని తాను చేసుకుంటూ మరింత సంతోషంగా గడుపుతోంది అంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు

పట్టుచీరలో సాంప్రదాయంగా ఆకట్టుకుంటున్న త్రిష..

ఇకపోతే ఎన్ని విమర్శలు వచ్చినా తనకేమీ పట్టనట్టు సోషల్ మీడియాలో బిజీగా మారిపోయింది. అందులో భాగంగానే ట్రెడిషనల్ లుక్ లో కనిపించి అభిమానుల హృదయాలు దోచుకుంది ఒక జ్యువెలరీ సంస్థ ప్రమోషన్ లో భాగంగా అందమైన జ్యువెలరీని ధరించి పట్టుచీరలో సాంప్రదాయంగా మరింత మెరిసిపోయింది ఈ చెన్నై చిన్నది. కాటుక కళ్ళతో మైమరిపిస్తూ త్రిష తాజాగా షేర్ చేసిన ఈ ఇంస్టాగ్రామ్ ఫోటోలు మరింత వైరల్ గా మారుతున్నాయి. అమ్మడి అందానికి అభిమానులు ఫిదా అవుతూ 40 దాటినా అందానికి కొదవలేదు అంటూ కామెంట్లు చేస్తున్నారు. ఇకపోతే ఇక్కడ విశేషమేమిటంటే.. ముఖ్యంగా వ్యక్తిగతంగా ఎన్ని ఎఫైర్ రూమర్స్ ఎదుర్కొంటున్నప్పటికీ తాజాగా షేర్ చేసిన ఫోటోలలో త్రిష చాలా సంతోషంగా కనిపించడంతో నిటిజన్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

మిస్ బ్యూటిఫుల్ స్మైల్ నుంచి స్టార్ హీరోయిన్ గా..

త్రిష కెరియర్ విషయానికి వస్తే.. ప్రశాంత్ - సిమ్రాన్ కాంబినేషన్లో వచ్చిన జోడి సినిమాలో సిమ్రాన్ స్నేహితురాలి పాత్రలో క్యారెక్టర్ ఆర్టిస్ట్ పాత్ర ద్వారా కెరియర్ మొదలుపెట్టిన త్రిష.. తెలుగులో తొలిసారి ప్రభాస్ హీరోగా వచ్చిన వర్షం సినిమా ద్వారా తెలుగు ప్రేక్షకులను పలకరించింది. మొదటి సినిమాతోనే అందం, అభినయంతో, నటనతో మెప్పించిన త్రిష.. ఆ తర్వాత ఎన్నో చిత్రాలలో నటించి స్టార్ హీరోయిన్గా పేరు దక్కించుకుంది . ఇండస్ట్రీలోకి రాకముందు అందాల పోటీలలో కూడా పాల్గొన్న ఈమె మిస్ చెన్నైగా ఎంపిక అయింది. ఆ తర్వాత మిస్ ఇండియా అందాల పోటీలలో కూడా పాల్గొనింది. పైగా మిస్ బ్యూటిఫుల్ స్మైల్ గా కిరీటాన్ని సొంతం చేసుకుంది త్రిష.

Printed, Published, and Owned by KOKKU RAVI KUMAR Editor: KOKKU RAVI KUMAR, Praja Galam Telugu Daily, C/O: Lazaras, Flat No: 206, 2nd Floor, Produturi Apartment, Road No: 11, Gangasthan Phase-2, Goopanpally, PO:Nizamabad Rs, DIST: Nizamabad, Telanagana-503003. Printed at: Swetha Offset printers, H. No: 2-10-91 & 92, Weekly Bazar, Boi gally, Nizamabad, Telanagan-503001 Email: info.krknews.ravi@gmail.com